Postel No. MBN/08/2016-2018



పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యం చేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్ మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :24 | సంచిక :257 | సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | శుక్రవారం 09 జనవరి 2026 | పేజీలు :12 | వేల రూ5 /-


## 20న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్..



**హైదరాబాద్, జనవరి 8:**తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలైంది. గతేడాది డిసెంబర్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ).. ఇప్పుడు పట్టణ పోరుపై దృష్టి సారించింది. జనవరి 20వ తేదీ నాటికి రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండటంతో.. దానికి సంబంధించి ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ఖరారు చేసింది. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు చివరి తేదీ జనవరి 12 అని తెలిపారు. అదే రోజున ఓటర్ల తుది జాబితాను ప్రచురించాలని మొదట ఆదేశించారు. టీ పోల్ యాప్‌లో, ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను జనవరి 13వ తేదీన అప్‌లోడ్ చేయాలి. జనవరి 16వ తేదీన ఫోటోలతో కూడిన ఓటర్ల తుది జాబితా ప్రచురించనున్నారు. వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల వివరాలను కూడా ఆరోజే వెల్లడిస్తారు. ఇక జనవరి 20వ తేదీన మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది.2019 నాటి ఓటర్ల జాబితాను ప్రాతిపదికగా తీసుకుని.. బీఎల్‌వోల ద్వారా క్షేత్రస్థాయిలో వివరాల పరిశీలన జరుగుతోంది. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రిని సిద్ధం చేయాలని కలెక్టర్లను ఈసీ ఆదేశించింది. ఎన్నికల నియమావళిని కఠినంగా అమలు చేయడానికి ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ ఏర్పాటుకు ఆదేశాలు జారీ అయ్యాయి. గురువారం రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల సంఘం కీలక సమావేశం నిర్వహించి, వారి సూచనలను తీసుకోనుంది.తుది ఓటర్ల జాబితాను ఆయా వార్డు - మిగతా3లో

## టాప్ గేర్ లో... రియల్ ఎస్టేట్



**హైదరాబాద్, జనవరి 8:**దేశంలోని 8 ప్రధాన నగరాల్లో చూస్తే హౌసింగ్ సేల్స్ (ఇళ్లు లేదా ఫ్లాట్ల విక్రయాలు) గతేడాది 3.48 లక్షల యూనిట్లుగా ఉన్నాయి. ఇది అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే స్వల్పంగా ఒక శాతం తగ్గిందని చెప్పొచ్చు. అయితే ఇదే సమయంలో ఈ ప్రధాన నగరాల్లో ఇళ్ల ధరలు సగటున 19 శాతం వరకు పెరిగినట్లు పేర్కొంది. బుధవారం రోజు వర్చువల్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించిన ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ నైట్‌ఫ్రాంక్ ఇండియా ఈ డేటా విడుదల చేసింది. ఇక్కడ ప్రధానంగా హోం లోన్ వడ్డీ రేట్లు తగ్గడం సహా ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండటం, ద్రవ్యోల్బణం తగ్గుతుండటం వంటివి హౌసింగ్ డిమాండ్‌ను స్థిరంగా ఉంచేందుకు దోహదం చేసినట్లు తెలిపింది. ఈ 8 ప్రధాన నగరాలు చూస్తే ఢిల్లీ- ఔఅఖీ, ముంబై, బెంగళూరు, పుణె, హైదరాబాద్, అహ్మదాబాద్, చెన్నై, కోల్‌కతా ఉన్నాయి.ఇక్కడ ప్రధాన - మిగతా3లో

## ఉపాధి హామీని నిర్వీర్యం చేసే కుట్ర

**సీఎం రేవంత్**



**హైదరాబాద్, జనవరి 8:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, దేశవ్యాప్తంగా దీనికి గుర్తింపు లభించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం నాడు గాంధీభవన్‌లో పీసీసీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం వల్ల వెట్టిచాకిరి ఆగిపోయిందని, గ్రామాల నుంచి వలసలు తగ్గాయన్నారు. అలాగే పనికితగ్గ వేతనం డిమాండ్ చేసే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దేశంలో 80 శాతం మంది ఈ ఉపాధి హామీపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు.

**క్షమాపణ చెప్పాల్సిందే..**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. పథకం పేరు మార్పు వెనుక ప్రధాని మోదీ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. ఎస్ఐఆర్ (ూ×=) వెనుక పెద్ద కుట్ర ఉందని.. వీబీ జీ రామ్ జీ (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్) చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు. ఉపాధి హామీని రద్దు చేస్తే మళ్లీ వలసలు ప్రారంభమవుతాయని హెచ్చరించారు. కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేందుకు, అదానీ-అంబానీలకు ప్రజలను కూలీలుగా మార్చేందుకు ఉపాధి హామీని రద్దు చేస్తున్నారని విమర్శించారు. వికసిత్ భారత్ కాదు.. సంక్షభ భారత్‌ను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. నల్ల చట్టాల విషయంలో క్షమాపణ చెప్పే వరకు వదల్లేదని.. ఇప్పుడు ఉపాధి హామీ విషయంలోనూ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ ఆరోపించారు.

**కార్యకర్తల త్యాగాల వల్లే...**

ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తల పాత్రను ముఖ్యమంత్రి రేవంత్ కొనియాడారు. కార్యకర్తల కష్టం, త్యాగాలతోనే అధికారంలో ఉన్నామని.. వచ్చిన పదవులన్నీ కార్యకర్తలు ఇచ్చినవేనని చెప్పారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను - మిగతా3లో

## ప్రభుత్వవిజయాలపై బహిరంగసభలు



**హైదరాబాద్, జనవరి 8:**తెలంగాణలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఫిబ్రవరి 3 నుండి 9 వరకు ఉమ్మడి తొమ్మిది జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ నిర్ణయించింది. ప్రభుత్వం చేపట్టిన సంక్షమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, రాబోయే మున్సిపల్ ఎన్నికలకు కేడర్‌ను సమాయత్తం చేయడమే లక్ష్యంగా ఈ సభలు సాగనున్నాయి. ఫిబ్రవరి 3న మొదటి సభ మహబూబ్ నగర్‌లో జరగనుంది. ఈ బహిరంగ సభల ప్రధాన ఉద్దేశ్యం ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేసిన ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్ వంటి పథకాల విజయాలను ప్రజలకు వివరించడం. ముఖ్యంగా క్షత్రస్థాయిలో లబ్ధిదారులతో నేరుగా మమేకమై, ప్రభుత్వ పనితీరుపై సానుకూల వ్యతిరేకత లేకుండా చూసుకోవాలని పార్టీ భావిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు, సీనియర్ నాయకులు ఈ సభల్లో పాల్గొంటారు. ప్రతి ఉమ్మడి జిల్లా కేంద్రంలో - మిగతా3లో

## గులాబీకి వరుస చిక్కుముళ్లు...



**హైదరాబాద్, జనవరి 8:**రాజకీయాలలో ముఖ్యంగా కుటుంబాలు నడిపే పార్టీలలో అంతర్గతంగా కుమ్ములాటలు చోటు చేసుకోవడం మనదేశంలో కొత్తేమీ కాదు. గతంలో కాంగ్రెస్ పార్టీ లో సంజయ్ గాంధీ వ్యవహార శైలి ఈ దేశ ప్రజలకు సుపరిచితమే. తమిళనాడులో డీఎంకే, ఉత్తర్ ప్రదేశ్ లో సమాజ్ వాదీ పార్టీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తెలుగుదేశం పార్టీ.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉదాహరణలు.. అంతిమంగా అధికారం కోసం, అలవిమాలిన సంపాదన కోసం జరిగే పోరాటాలు ప్రాంతీయ కుటుంబ పార్టీల అసలు బాగోతాన్ని బయటపెడతాయి. ఇప్పుడు ఈ జాబితాలోకి భారత రాష్ట్ర సమితి కూడా చేరింది.2014లో అధికారంలోకి వచ్చిన భారత రాష్ట్ర సమితి.. తెలంగాణలో వ్యవస్థలను ఎంత నాశనం చేయాలో అంత చేసింది. ప్రత్యర్థి పార్టీల ఎమ్మెల్యేలను అడ్డగోలుగా కొనేసింది. ప్రతిపక్షం అనేది లేకుండా చూసుకుంది. కాళేశ్వరం నుంచి మొదలు పెడితే గొర్రెల పంపిణీ వరకు ఇలా ప్రతి పథకంలోనూ అవినీతి జరిగిందని, అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపణలు వినిపించాయి. వాస్తవానికి ఇటువంటి కుంభకోణాలు పార్టీకి డ్యామేజ్ చేయడం ఒక ఎత్తు అయితే.. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు కలిగించే డ్యామేజ్ మరొక ఎత్తు.వాస్తవానికి గులాబీ పార్టీలో ఈ స్థాయిలో అంతర్గతంగా కుమ్ములాటలు జరుగుతాయని ఎవరూ ఊహించలేదు. సాక్షాత్తు కెసిఆర్ కుమార్తె వ్యతిరేక స్వరాన్ని వినిపిస్తారని.. తన తండ్రి పరిపాలనను ఉదాహరణలతో వివరిస్తూ విమర్శిస్తారని ఎవరూ అంచనా వేయలేదు. కాళేశ్వరం ప్రయోజనం నెరవేరలేదని, పాలమూరు రంగారెడ్డి పథకాన్ని పండబెట్టారని, సామాజిక తెలంగాణ సహకారం కాలేదని ఇలా ప్రతి విషయంలోనూ కవిత విమర్శలు చేసుకుంటూ పోయారు. కొన్ని సందర్భాలలో లెక్కలతో సహా వివరించారు. ఒక రకంగా ఈ పనిని కాంగ్రెస్ చేయాల్సి ఉండేది. ఒక రకంగా బలమైన స్వరాన్ని వినిపించే ప్రయత్నం చేశారు కవిత.కవిత చేస్తున్న ఆరోపణల్లో నిజం - మిగతా3లో

## పాకిస్తాన్ లో కరువు ఛాయలు



**న్యూఢిల్లీ జనవరి 8:**గత ఏడాది ఏప్రిల్‌లో జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి జరిగింది. 26 మంది పర్యాటకులు చనిపోయారు. దీంతో భారత ప్రభుత్వం సింధు జల ఒప్పందం రద్దు చేసింది. 1969లో జరిగిన ఈ ఒప్పందం నిలిపివేయడంతో మన దేశం నుంచి పాకిస్తాన్‌లోకి వెళ్లాల్సిన జలాలు ఆగిపోయాయి. అవసరం లేని సమయంలో వరదలు వస్తున్నాయి. తాజాగా ఒప్పందం నిలివేత ఎఫెక్ట్ పాకిస్తాన్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. చుక్క నీరు కూడా పాకిస్తాన్ దాటి వెళ్లడం లేదు. దీంతో దాయాది దేశంలో కరువు ఛాయలు కనిపిస్తున్నాయి.భారత్ పాక్‌పై ఉగ్రవాద కార్యకలాపాలకు ప్రతీకారంగా ఈ చర్య తీసుకుంది. పాకిస్తాన్‌లో సింధు, జెహ్లం, చెనాబ్ నదులపై ఆధారపడిన వ్యవసాయం, రోజువారీ జీవనం కష్టమవుతోంది. డ్యామ్‌ల నిర్మాణం, నీటి నిల్వలు భారత్‌కు ప్రయోజనకరంగా మారాయి. ఇప్పటికే పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పాకిస్తాన్‌లో తాజాగా జల సంక్షోభం తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారు.పాకిస్తాన్ మొత్తం వ్యవసాయంలో చాలా వరకు సింధు జలాలపై ఆధారపడి సాగుతోంది. నీటి నిలిపివేతతో 30 నుంచి 40 శాతం వ్యవసాయం తగ్గే అవకాశం ఉంది. ఆహార భద్రత దెబ్బతినే ప్రమాదం ఉంది. నదీ ప్రవాహ మార్పులు డెల్టా ప్రాంతాల్లో ఉప్పు పెరగడం, జీవవైవిధ్య నష్టానికి దారితీస్తాయి. ఈ నేపథ్యంలో పాక్ అంతర్జాతీయ మధ్యవర్తిత్వం కోరవచ్చు. కానీ భారత్ దృఢంగా నిలబడుతుంది. ఒప్పందం పునరుద్ధరించే అవకాశాలు తక్కువ.



## వీబీ-జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా పోరాడాలి

**మహేశ్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్, జనవరి8 :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీ-జీ రామ్ జీ (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) పై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ షాకింగ్ కామెంట్స్ చేశారు. జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా పోరాడాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా గ్రామ సభలు ఏర్పాటు చేద్దామని సూచించారు. ఇవాళ(గురువారం) గాంధీ భవన్‌లో పీసీసీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అధ్యక్షతన సమావేశం ప్రారంభమైంది. వందేమాతరం గీతంతో ఈ సమావేశం మొదలైంది. ఈ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్ష నటరాజన్, మంత్రులు హాజరయ్యారు.

**పునరుద్ధరించాలి..**

ఈ సందర్భంగా జీ రామ్ జీ చట్టంపై చర్చించారు. అలాగే టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం అజెండా రూపొందించారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే కుట్రను నిరసిస్తూ తీర్మానం చేశారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని వెనక్కు తీసుకుని.. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని - మిగతా3లో

# సంపాదకీయం

## ప్రజాస్వామ్యం పరిఢవిల్లేనా?

ప్రజాస్వామ్య సౌధం నాలుగు స్తంభాలపై నిలిచి ఉంది. చట్టసభలు, కార్యనిర్వాహక శాఖ, న్యాయ వ్యవస, మీడియా. ఈ నాలుగు స్తంభాలలో ముఖ్యమైన చట్టసభలకు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు జరపవలసిన బాధ్యత ఎన్నికల కమిషన్, ప్రభుత్వాలదే. ముఖ్యంగా లోక్‌సభ శాసనసభలకు ఐదేళ్లకొకసారి లేదా కాస్త ముందుగా గాని ఎన్నికలు నిర్వహిస్తుండగా మిగిలిన స్థానిక సంస్థలను నిర్లక్ష్యం చేస్తూ నిర్వీర్యం చేస్తున్నారు. ఐదేళ్లు నిండిన తర్వాత వీటికి ప్రత్యేక అధికారులు నియమించి పాలన సాగిస్తున్నారే కానీ ఏదో ఒక కుంటిసాకుతో వాటికి ఎన్నికలు జరపడం లేదు. ఫలితంగా వాటికి రావలసిన కేంద్ర నిధులు విడుదల కాక అభివృద్ధి పడకేస్తున్న పరిస్థితి నెలకొంది. ఎన్నికలంటే రాజకీయ పార్టీలకు ఎక్కడలేని ఉత్సాహం వస్తుంది. ఏదో విధంగా అబద్ధపు ప్రచారాల తోనూ, అలవికాని హామీలతోనూ ఓటర్లను ఆకర్షించవచ్చు. తమ ఓటు షేర్ పెంచుకునే ప్రయత్నం చేయవచ్చు. అధికార పక్షం బలప్రదర్శనకు, అంతో ఇంతో అధికార దుర్వినియోగానికి మంచి అవకాశం. కాగా ప్రతిపక్షాలకు విమర్శల బాణాలు సంధించడానికి, అధికార పక్షాన్ని ఇరుకున పెట్టే దానికి సువర్ణ అవకాశం. పోటీ చేసే అభ్యర్థులకు నోటిఫికేషన్ విడుదలైన నాటి నుండి ఫలితాల ప్రకటన వరకు గొప్ప టెన్షన్. తెగించి ఖర్చు చేస్తున్నా అందుకు అనుకూలమైన ఫలితం వస్తుందో లేదో అన్న ఆందోళన వారిని ఆవహించి ఉంటుంది. ఎన్నికల కమిషన్ కంటపడకుండా ఖర్చు చేయాలి. అందరినీ 'సంతృప్తి' పరచుకుంటూ పోవడం అతడికి అత్యవసరం. ఈ మహా ప్రక్రియలో చివరి బకరా ఓటరు. ఆశించి భంగపడటం అతడి నైజం. అందుకే ఈ మధ్య అభివృద్ధి జరుగుతుందని, తమ జీవితాలు బాగుపడతాయని సగటు ఓటరు విశ్వసించడం లేదు. ఎన్నికల సమయంలో అభ్యర్థులు ఇచ్చే సొమ్మునే ఆశిస్తున్నాడు, దానికి ఆశపడుతున్నాడు. మన వ్యవస్థలో ఎన్నికల అక్రమాలు, నిబంధనల అతిక్రమణ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. పోటీ అభ్యర్థులను బెదిరించడం, లొంగదీసుకునే ప్రయత్నం చేయడం, కొంతమంది అభ్యర్థులతో లోపాయకారి ఒప్పందాలు నేటి ఎన్నికల ప్రక్రియలో భాగమయ్యాయి. ముఖ్యంగా ఎన్నికల ముందు రోజు జరిగే అక్రమాలకు, దుర్మార్గాలకు అంతులేకుండాపోయింది. పోలింగ్‌నాడు కూడా ఓటరుకు తన ఓటు తాను వేసేంతవరకు నమ్మకం లేదు. అంటే ప్రతిచోట ఎన్నికల ప్రక్రియ అపహాస్యం అవుతుండగా ప్రజాస్వామ్యంపై విశ్వాసం సన్నగిల్లుతున్నది. ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారుతున్నది. జాతీయ స్థాయిలో కార్పొరేట్లు తమకు అనుకూలమైన ప్రభుత్వాల కోసం వందల వేల కోట్లు పార్టీలకు విరాళాలు ఇస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్నాయి. గతంలో పెద్ద పదవులకు అంటే ఎంపి, ఎంఎల్ఎ లాంటి వాటికి విదేశాలలో ఉన్న వారు సైతం దేశానికి వచ్చి ఏదో ఒక పార్టీ టికెట్ సంపాదించి పోటీ చేయడం పదవులు అనుభవించడం మనకు అనుభవమే. ఈసారి సర్పంచ్ ఎన్నికలకు అభ్యర్థులు విదేశాల నుండి 'దిగుమతి' అవుతున్నారు. కొంతమంది తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి లేదా పదవి విరమణ చేసి మరీ ఈ సర్పంచ్ ఎన్నికలలో పోటీ చేశారు. అంటే వారికి 'సేవా తత్పరత' ఎక్కువవుతున్నది. మాతృభూమిని అభివృద్ధి చేయడానికి కంకణం కట్టుకున్నట్లు వారు చెప్పుకోవడం సంతోషమే. కానీ అది ఐదేళ్ల తర్వాత ఆ గ్రామ ప్రజలు ఇవ్వవలసిన తీర్పు మాత్రమే. మన దగ్గర మహిళా అభ్యర్థులు పదవులకు ఎంపికైనా కానీ వారి 'మగమహారాజు'లే పరిపాలిస్తుంటారు. అనధికార పరిపాలకులుగా చలామణి అవుతుంటారు. పదవులు మహిళలకు, అధికారాలు వారి భర్తలకు. కొన్ని సందర్భాలలో సమావేశాలకు సైతం వారి భర్తలే హాజరై చర్చల్లో పాల్గొంటూ నిర్ణయాత్మక శక్తిగా వ్యవహరించడం శోచనీయం. మాటల్లోని మహిళాభ్యున్నతి గడప దాటడం లేదు. తరతరాలుగా జీర్ణించుకొని పోయిన పురుషాధిక్యం సమాజంలో మహిళలకు అడుగడుగునా ఆటంకాలు ఏర్పరచుతూ తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూనే ఉంది. కొన్నిచోట్ల దళిత గిరిజన సర్పంచులపై ఆ గ్రామంలోని ఆధిపత్య కులాలు తమ పెత్తనం చెలాయిస్తుండటం చూస్తూనే ఉన్నాం. కొంతమంది మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులు తమ నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ ఇతర నియోజకవర్గాలను చిన్నచూపు చూస్తారు లేదా నిర్లక్ష్యం చేస్తారు. వీరు రాష్ట్రం మొత్తానికి లేదా దేశం మొత్తానికి బాధ్యులు అనే విషయం మరవడం బాధాకరం. పదవి స్వీకారం నాడు ఏ వ్యక్తికి, ప్రాంతానికి అనుచితంగా లేదా పక్షపాతంతో వ్యవహరించబోమని దైవసాక్షిగా ప్రమాణం చేస్తారు. ప్రజలు ప్రశ్నించడం మానుకున్నారు. ప్రశ్నించిన వాడి ఉనికి ప్రశ్నార్థకమవుతున్నది. అందుకే అవినీతికి అంతులేకుండా పోతున్నది. న్యాయం అందడానికి, పొందడానికి కాలము, డబ్బు ఖర్చవుతున్నాయి. సామాన్యుడి సహనానికి పరీక్షగా మారింది. రాజకీయాలలో డబ్బు జోక్యం ఎక్కువైంది. అందుకే గతంలో లాయర్లు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, మేధావులు, సంఘ సంస్కర్తలు రాజకీయాలు నడపగా నేడు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మద్యం వ్యాపారులు, నేరచరితులు రాజకీయాలను ఆక్రమించారు, విలువలను పాతరేశారు. ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు కూడా రాజకీయాల పట్ల ఆకర్షితులవుతున్నారే కానీ వాటిని ప్రక్షాళన చేయలేకపోతున్నారు. అందులో విజయం సాధించలేకపోతున్నారు. రేపటి తరానికి దిశానిర్దేశం చేయలేకపోతున్నారు. రాజకీయ నాయకులకు, ఉద్యోగులకు లాగా ఒక నిర్దిష్టమైన అర్హత లేకపోవడం ఈ వ్యవస్థ దురదృష్టం. ఓటుకు ఈసారి గిరాకీ మరీ పెరిగింది. దూరతీరాలలో ఉన్న వారు సైతం తమ సొంత ఊరుకొచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు అభ్యర్థుల ఖర్చుతో. ఒక పెద్ద మనిషి ప్రత్యేకించి విదేశాల నుండి విమానంలో విచ్చేసి తన హక్కును కాపాడుకొని ఓటు విలువ తెలియజేశాడు. నిన్నమొన్నటి ఎన్నికలలో ఒకచోట ఒక ఓటు విలువ 40 వేలు పలికినట్లుగా చదివాం. కొన్ని చోట్ల కోట్లు చేతులు మారుతున్నట్టుగా చదువుతున్నాం. అంతో ఇంతో ఈ దేశంలో ఎన్నికల సంస్కరణలకు శ్రీకారం చుట్టిన టిఎన్ శేషన్ సదాస్మరణీయుడు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ దేశంలో జిల్లాకు ఒక శేషన్ కూడా సరిపోడేమో! ఆ పిల్లిమెడలో గంటకట్టేది ఎవరో? ఆశగా ఎదురు చూద్దాం. ఇక గ్రామాల్లో శాంతి నెలకొంటుందని, అవి అభివృద్ధి పథంలో సాగుతాయని కోరుకుందాం.

# నేడు ప్రవాస భారతీయుల దినోత్సవం

ప్రవాస భారతీయుల దినోత్సవం భారతదేశ అభివృద్ధికి విదేశీ భారతీయ వర్గాల సహకారాన్ని గుర్తించడానికి భారతదేశపు రిపబ్లిక్ ద్వారా జనవరి 9 న ఏటా జరిగే వేడుక రోజు. భారత ప్రభుత్వం ఎల్.ఎం. సింఘ్వి అధ్యక్షతన ఏర్పాటు చేసిన భారతీయ డయాస్పోరాపై ఉన్నత స్థాయి కమిటీ (హెచ్ఎల్‌సి) సిఫార్సుల ప్రకారం ప్రవాసీ భారతీయ దివస్‌ను జరుపుకోవాలనే నిర్ణయం తీసుకోబడింది . అప్పటి భారత ప్రధానమంత్రి శఅటల్ బిహారీ వాజ్‌పేయి జనవరి 8, 2002న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ఒక బహిరంగ కార్యక్రమంలో కమిటీ నివేదిక స్వీకరించి, జనవరి 9, 2002న "ప్రవాసీ భారతీయ దివస్" (పిబిడి) ప్రకటన చేశారు. జనవరి 9,1915లో మహాత్మా గాంధీ దక్షిణాఫ్రికా నుండి భారతదేశానికి తిరిగి వచ్చినందుకు గుర్తుగా ఈ రోజును ప్రవాస భారతీయుల దినోత్సవముగాఎంపిక చేశారు. 2003 లో స్థాపించబడి, ఇది భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ మరియు ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సమాఖ్య , భారత పరిశ్రమల సమాఖ్య మరియు నార్త్ ఈస్టర్న్ రీజియన్ యొక్క అభివృద్ధి మంత్రిత్వ శాఖ చేత స్పాన్సర్ చేయబడింది. ఒక వేడుక కార్యక్రమం ఒక భారతీయ నగరంలో ప్రతి సంవత్సరం 7-9 జనవరి న జరుగుతుంది: ఇండియన్ ప్రవాసల సంబంధించిన సమస్యల నివరణ మరియు ప్రవాసీ భారతీయ సన్మాన పురస్కారలు అందించబడుతున్నాయి. 2013 లో, 11 వ ప్రవాస భారతీయుల దినోత్సవము 7-9 జనవరి కొచ్చిలో జరిగింది . మారిషస్ అధ్యక్షుడు, రాజ్కేశ్వార్ పుర్రీగ్ అధికారిక ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వ్యవహరించాడు. 2014 లో, ప్రవాస భారతీయుల దినోత్సవము న్యూఢిల్లీలో జరిగింది, 51 దేశాల నుండి 1,500 మంది ప్రతినిధులు హాజరయ్యారు. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ప్రవాసీ భారతీయ సమ్మాన్ అవార్డులను ఇచ్చారు. 12 వ ప్రవాస భారతీయుల దినోత్సవము 2014 జనవరి 7-9 న న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్లో జరిగింది. 13వ ప్రవాస భారతీయుల దినోత్సవము గుజరాత్లోని గాంధీనగర్లోని మహాత్మా మందిర్ వద్ద జనవరి 7-9, 2015 న జరిగింది. 14 వ ప్రవాస భారతీయుల దినోత్సవము 2016 7-9 జనవరిలో న్యూఢిల్లీలో జరిగింది. 15 వ ప్రవాస భారతీయుల దినోత్సవము 2017 7-9 జనవరిలో కర్ణాటకలోని బెంగళూరులో జరిగింది. ప్రాంతీయ ప్రవాస భారతీయుల దినోత్సవము 2018 6-7 జనవరి 6-8 న సింగపూర్, మరీనా బే సాండ్స్లో జరిగింది. 16వ ప్రవాసీ భారతీయ దివస్ 2019 జనవరి 21?23 తేదీలలో భారతదేశంలోని వారణాసిలో జరిగింది. మారిషన్ ప్రధాన మంత్రి ప్రవింద్జుగ్నౌత్గౌరవ అతిథిగా వచ్చారు. 17వ ప్రవాసీ భారతీయ దివస్ ఇండోర్‌లో 8-10 జనవరి 2023 వరకు జరిగింది. 18వ ప్రవాసీ భారతీయ దివస్ భువనేశ్వర్‌లో 8-10 జనవరి 2025 వరకు జరిగింది. భారత దేశ అభివృద్ధి మరియు వృద్ధికి దోహదపడేందుకు, వారి సమస్యలను సరిదిద్దడానికి, ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలను వారికి పరిచయం చేయడానికి, నిర్దిష్ట ప్రాంతాలలోని భారతీయ ప్రవాసులతో అనుసంధానం అవ్వడానికి విదేశాంగ మంత్రిత్వ శాఖ భారతదేశం వెలుపల ప్రాంతీయ ప్రవాసీ భారతీయ దివస్ లను ఏర్పాటు చేస్తుంది.

## హరిద్వార్‌లోని గంగా ఘాట్‌లలో

# హిందువులకే ఎంట్రీ

**ఉత్తరాఖండ్, జనవరి 8:** హరిద్వార్‌లోని 105 ఘాట్‌లలోకి హిందూయేతరుల ప్రవేశాన్ని నిషేధించాలని ఉత్తరాఖండ్‌లోని బీజేపీ ప్రభుత్వం యోచిస్తోంది. రిషికేశ్, హరిద్వార్‌లను 'సనాతన పవిత్ర నగర్'లుగా ప్రకటించే ప్రతిపాదన కూడా ఉంది. అయితే, 1916 నాటి ఒప్పందాన్ని పరిశీలిస్తూ, అర్ధ కుంభ్ మేళా నుంచే ఈ ప్రక్రియను ప్రారంభించే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఆధ్యాత్మిక గుర్తింపును కాపాడతామని తెలిపారు. అయితే, స్థానికులు మాత్రం దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇది మన మతం విధానం కాదని అంటున్నారు. రిషికేశ్, హరిద్వార్‌లను 'సనాతన పవిత్ర నగర్'లుగా ప్రకటించాలని కూడా పుష్కర్ సింగ్ ధామి ప్రభుత్వం భావిస్తోంది. 2027 జనవరి 14న మకర సంక్రాంతికి ప్రారంభం కానున్న అర్ధ కుంభ్ మేళా నుంచే ఈ ప్రక్రియను ప్రారంభించే అవకాశం ఉందని సమాచారం. ఈ విషయంలో 1916లో భారతరత్న పండిట్ మదన్ మోహన్ మాలవ్యా, బ్రిటిష్ ప్రభుత్వానికి మధ్య జరిగిన ఒప్పందం వివరాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. గంగా సభకు తొలి అధ్యక్షుడిగా మాలవ్యా వ్యవహరించారు. ఆ ఒప్పందం ప్రకారం.. గంగా నది ప్రవాహాన్ని నిరంతరాయంగా కొనసాగించడం, పుణ్యనగరం పవిత్రతను కాపాడటం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా గంగా ఘాట్‌లలోకి హిందూయేతరుల ప్రవేశంపై ఆంక్షలు విధించారు. అంతేకాదు, రిషికేశ్, హరిద్వార్‌లలో హిందువులు కానివారు శాశ్వతంగా నివసించడానికి వీలులేదు. వారు కేవలం పని నిమిత్తం వచ్చి, తమ పనులు పూర్తయ్యాక తిరిగి వెళ్లిపోవాలి.



రాష్ట్ర ప్రభుత్వం ఈ అసలు ఒప్పందంలోని నిబంధనలను పునరుద్ధరించాలని తీవ్రంగా పరిశీలిస్తోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. గంగా సభ అధ్యక్షుడు నితిన్ గౌతమ్ గతంలో మాట్లాడుతూ.. 'హరిద్వార్ పవిత్రతను కాపాడటానికి, మొత్తం కుంభ్ మేళా, హరిద్వార్ నగరాన్ని హిందువులు కానివారికి నిషేధిత ప్రాంతంగా ప్రకటించాలి. వారి ప్రవేశాన్ని నిషేధించాలి. హరిద్వార్, రిషికేశ్‌లలోని అన్ని నదీ తీరాలు వారికి ప్రవేశం ఉండకూడదు' అని అన్నారు. అయితే తాను విశ్వ హిందూ పరిషత్ (హరిద్వార్) మాజీ అధ్యక్షుడిగా ఆ డిమాండ్ చేశానని, గంగా సభలో దీనిపై ఎలాంటి తీర్మానం చేయలేదని చెప్పారు. రాజకీయ పార్టీలు కూడా ఈ విషయంపై స్పందించాయి. కాంగ్రెస్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ అశోక్ శర్మ మాట్లాడుతూ.. "హిందూయేతరుల ప్రవేశం నిషేధాన్ని హరి-కి-పౌరి మాత్రమే పరిమితం చేయాలని కోరిన మదన్ మోహన్ మాలవ్యా కంటే బీజేపీ-ఆర్ఎస్ఎస్ పెద్ద హిందువులా? ఈ నిషేధాన్ని మేము వ్యతిరేకిస్తున్నాం" అని అన్నారు. హరిద్వార్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సందీప్ గోయల్ మాట్లాడుతూ.. 'ఇది మా పార్టీ విధానం కాదు...' అని తెలిపారు.

# భారత్ తప్పటడుగులు వేసిందా

నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత నెల రోజుల నుంచి షేక్ హసీనాకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లో ప్రజలు వీధుల్లోకి వచ్చి పోరాటం మొదలుపెట్టారు. ఈ నిరసనలు ఆగస్టు 5న తీవ్ర హింసాత్మకంగా మారాయి. షేక్ హసీనా తన ప్రాణాలను కాపాడుకోవడానికి భారత్‌కు రావాల్సి వచ్చింది. బంగ్లాదేశ్‌లో నిరంకుశ పాలనను కొనసాగించారని ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడిగా పేరున్న హసీనా తండ్రి ముజిబుర్ రెహమాన్‌కు, భారత్‌తో చారిత్రాత్మక సంబంధాలు ఉన్నాయి. షేక్ హసీనా, భారత్ మధ్య సంబంధాలు కూడా అదే విధంగా కొనసాగాయి. అయితే, భారత్ మద్దతుతోనే షేక్ హసీనా అధికారంలో ఉన్నారని బంగ్లాదేశ్‌లోని ప్రతిపక్షలు, షేక్ హసీనా వ్యతిరేకులు ఆరోపిస్తూ వచ్చారు. గతేడాది ఆగస్టులో షేక్ హసీనాకు భారత్ ఆశ్రయం ఇచ్చిన తర్వాత బంగ్లాదేశ్‌లో యాంటీ-ఇండియా సెంటిమెంట్ మరింత పెరిగింది. బంగ్లాదేశ్‌ను భారత్ ఎప్పుడూ షేక్ హసీనా కుటుంబ దృష్టితోనే చూస్తోందని, అంతకు మించి చూసేందుకు ఎప్పుడూ ప్రయత్నించలేదని బంగ్లాదేశ్ మీడియా అంటోంది. ఈ నెల డిసెంబర్ 23న బ్రస్సెల్స్‌కు చెందిన లాభాపేక్ష లేని పరిశోధనా సంస్థ ఇంటర్నేషనల్ క్రైసిస్ గ్రూప్ (ఐసీజీ) భారత్-బంగ్లాదేశ్ సంబంధాలపై 'ఆఫ్టర్ ది "గోల్డెన్ ఎరా": గెటింగ్ బంగ్లాదేశ్-ఇండియా టైస్ బ్యాక్ ఆన్ ట్రాక్ అనే పేరుతో 53 పేజీల రీసర్చ్ రిపోర్టును ప్రచురించింది. గతేడాది ఆగస్టులో బంగ్లాదేశ్ ప్రధానమంత్రిగా షేక్ హసీనా తన పదవిని కోల్పోవడం భారత్‌కు తీవ్ర ఎదురు దెబ్బ అని ఈ నివేదికలో పేర్కొంది. బంగ్లాదేశ్-భారత్ సంబంధాలపై ఐసీజీ తాజాగా విడుదల చేసిన నివేదికలో.. విలియం వ్యాన్ షెండెల్ పుస్తకం 'ఏ హిస్టరీ ఆఫ్ బంగ్లాదేశ్ణ లోని కోట్‌ను కూడా చేర్చింది. 'ఏ హిస్టరీ ఆఫ్ బంగ్లాదేశ్ణ పుస్తకంలో విలియం వ్యాన్ షెండెల్ రాసిన వివరాల్లో, " బంగ్లాదేశ్ స్వాతంత్ర్యానికి భారత్ మద్దతు ఇచ్చినప్పటికీ, రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు శత్రుత్వంలా కాకపోయినా, తరచూ ఉద్రిక్తంగానే ఉండేవి. బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఆవిర్భవించడంలో ఒకరి పాత్రను మరొకరు తక్కువ చేసుకునే కథనాలను రెండు దేశాలు ప్రోత్సహించేవి" అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో న్యూదిల్లీ సహకారానికి తగినంత కృతజ్ఞతను బంగ్లాదేశ్ చూపించలేదని భారత్‌లో ఒక దృక్పథం ఉంది. అలాగే, భారత్ కేవలం తన సొంత వ్యూహాత్మక ప్రయోజనాలకు మాత్రమే జోక్యం చేసుకుంటుందని.. స్వతంత్ర బంగ్లాదేశ్‌ను ఒక శాటిలైట్ స్టేట్‌గా (మరోదేశం నియంత్రణలో, అత్యధిక రాజకీయ ప్రాబల్యంతో నడిచే దేశంగా) భావించి, ఏహ్య భావంతో చూస్తుందని ఆ దేశ ప్రజలు విస్తృతంగా భావిస్తున్నారు" అని రాశారు. భారత విదేశాంగ వ్యవహారాల జర్నల్‌లో స్మృతి ఎస్. పట్నాయక్ రాసిన ఆర్టికల్‌ను కూడా ఈ నివేదిక కోట్ చేసింది. "షేక్ హసీనా పార్టీ అవామీ లీగ్‌కు భారత్ ఇచ్చిన స్థిరమైన మద్దతు ద్వారానే ఎన్నో సంవత్సరాలుగా భారత్, బంగ్లాదేశ్ సంబంధాల మధ్య



పునాది బలపడిందని పునరుద్ఘాటించడం చాలా ముఖ్యం. ఎందుకంటే, ప్రస్తుతం ఈ పార్టీ అధికారాన్ని కోల్పోయింది. రెండు దేశాల మధ్య పునాది కూడా తీవ్రంగా దెబ్బతిన్నది" అని డైలీ స్టార్ రాసింది. ఈ దెబ్బతిన్న ప్రాంతంలో ఉన్న ఖాళీని పరస్పర అనుమానం పూరిస్తోంది. బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా పన్నాగాలు పన్నుతూ, పారిపోయిన వారికి న్యూదిల్లీ సురక్షితమైన ప్రదేశంగా మారిందని ఢాకా భావిస్తోంది. అలాగే, బంగ్లాదేశ్‌లో మెజారిటీ వర్గాల అరాచకం పెరుగుతోందని భారత్ ఆందోళన చెందుతోంది. జియా-ఉర్-రెహమాన్, ఖలీదా జియాలు భారత్ ప్రయోజనాలు దెబ్బతీస్తుండటంతో, భారత్ తప్పనిసరి పరిస్థితుల్లో షేక్ హసీనాకు మద్దతు ఇవ్వాల్సి వచ్చిందని దిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలోని సౌత్ ఏషియన్ స్టడీస్ సెంటర్ ప్రొఫెసర్ మహేంద్ర పీ లామా భావిస్తున్నారు. "తూర్పు పాకిస్తాన్ కారణంగా భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలతో దాదాపు సంబంధాలు తెగిపోయాయి. అప్పుడు, బంగ్లాదేశ్ ఏర్పాటు ఒక ఆశను తీసుకొచ్చింది. షేక్ ముజిబుర్ రెహమాన్, షేక్ హసీనా పదవీ కాలాల్లో ఈ ఆశ సజీవంగా మిగిలింది. అయితే, బంగ్లాదేశ్‌లోని జియా-ఉర్-రెహమాన్, హుస్సేన్ మొహమ్మద్ ఇర్షాద్‌లు భారత ప్రయోజనాలను దెబ్బతీశారు. అలాంటి పరిస్థితుల్లో షేక్ హసీనా, అవామీ లీగ్‌ను భారత్ బలపర్చాల్సి వచ్చింది" అని ప్రొఫెసర్ లామా చెప్పారు. 1975 ఆగస్టులో బంగ్లాదేశ్ తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్యోద్యమ నాయకుడు షేక్ ముజిబుర్ రెహమాన్‌తో పాటు చాలామంది తన కుటుంబ సభ్యులు సైనిక తిరుగుబాటులో హత్యకు గురయ్యారు. ఈ ఘటన రెండు దేశాలకు టర్నింగ్ పాయింట్ అయింది. ఈ హత్యలు బంగ్లాదేశ్‌లో సైనిక పాలనకు దారితీశాయి. ముఖ్యంగా, 1976 నుంచి 1981 వరకు జియా-ఉర్-రెహమాన్ పాలనలో (ఆ తర్వాత సైన్యంలోని సభ్యులే జియా-ఉర్-రెహమాన్‌ను హత్య చేశారు), ఆ తర్వాత 1982 నుంచి 1990 మధ్య కాలంలో హుస్సేన్ మొహమ్మద్ ఇర్షాద్ పాలనలో బంగ్లాదేశ్ నడిచింది" అని ఐసీజీ తన నివేదికలో పేర్కొంది. ఢాకాలో 15 ఏళ్ల సైనిక పాలన కాలంలో.. భారత్-బంగ్లాదేశ్‌లు ఒకదానికొకటి ప్రధానంగా భద్రతా కోణంలోనే చూసుకునేవి. ఇరు దేశాలు తమ భూభాగాల్లో పనిచేసే తిరుగుబాటు గ్రూప్‌లకు మద్దతు ఇచ్చాయి. బంగ్లాదేశ్ చిట్టగాంగ్ కొండ ప్రాంతాల్లో (చిట్టగాంగ్ హిల్ ట్రాక్ట్స్) శాంతి బాహిని సంస్థకు న్యూదిల్లీ మద్దతు ఇచ్చేది" అని ఐసీజీ రాసింది. ఈశాన్య భారత్‌లో ఆపరేట్ అయ్యే తిరుగుబాటుదారులకు ఆయుధాలను సరఫరా చేస్తూ ఢాకా సాయం చేసింది. బంగ్లాదేశీ గడ్డపై క్యాంపులు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి కూడా ఇచ్చింది. 1980లలో, బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలు భారత్‌లో రాజకీయ సమస్యగా మారాయి. దీనికి స్పందనగా, సరిహద్దుల్లో న్యూదిల్లీ కంచెలు వేసింది. సరిహద్దు భద్రతను కట్టుదిట్టం చేసింది" అని పేర్కొంది. 1990-91లో బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య పాలన తిరిగి రావడంతో ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడొచ్చన్న ఆశలు భారత్‌లో కలిగాయి. కానీ, బంగ్లాదేశ్‌లో అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం బీఎన్‌పీ నేతృత్వంలో ఏర్పడింది. ప్రధానమంత్రి ఖలీదా జియా 1992లో భారత్‌ను సందర్శించడం, రెండు దేశాల మధ్య సరికొత్త వాణిజ్య ఒప్పందంవంటి సానుకూల సంకేతాలు ప్రారంభంలో ఉన్నప్పటికీ, ఆ తర్వాత సంబంధాల మెరుగుదల ఆశలు నీరుగారిపోయాయి. తిరుగుబాటుదారులకు బంగ్లాదేశ్ మద్దతు ఇస్తోందని భారత అధికారులు ఆరోపించారు. నీళ్ల పంపిణీ, సరిహద్దు విభజన వంటి కీలక ద్వైపాక్షిక విషయాల్లో కొంత పురోగతి కనిపించింది. బీఎన్‌పీ ప్రభుత్వానికి జమాత్ ఏ ఇస్లామీ మద్దతు ఇస్తోందని భారత్ ఆరోపించిన తర్వాత ఈ అపనమ్మకం మరింత పెరిగింది. హిందూ జాతీయవాద భారతీయ జనతా పార్టీ ప్రభావం పెరగడం, 1992 డిసెంబర్‌లో బాబ్రీ మసీదు కూల్చడం వంటివి బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేక భావనను మరింత పెంచాయి. బాబ్రీ మసీదు కూల్చిన తర్వాత, బంగ్లాదేశ్‌లో హిందూ కమ్యూనిటీకి చెందిన వారిపై దాడులు జరిగాయి. భారత్‌లో హిందూ-ముస్లింల మధ్య మత ఘర్షణలు జరిగాయి. భారత దేశీయ రాజకీయాల్లో ముస్లింల పట్ల ద్వేష రాజకీయాలు ఉంటే అది బంగ్లాదేశ్‌ను కూడా ప్రభావితం చేస్తుందని, అక్కడ ఉదారవాద ప్రజాస్వామ్యాన్ని ఆశించలేమని ప్రొఫెసర్ లామా అన్నారు. 16 నెలలుగా భారత్-బంగ్లాదేశ్‌ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు స్తంభించిపోయాయి. గత 10 రోజులుగా రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. భద్రతా కారణాలతో, భారత్‌లో దిల్లీ సహా నాలుగు ప్రాంతాల్లో వీసా సర్వీసులను ఢాకా నిలిపివేసింది. అలాగే, భారత్ కూడా ఢాకాతో సహా నాలుగు ప్రాంతాల్లో వీసా సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఢాకా, దిల్లీ మధ్యలో ఇంత అపనమ్మకం, అనుమానాన్ని నేనెప్పుడూ చూడలేదు. అంతర్జాతీయ నిబంధనలు ప్రకారం, ఇరుదేశాలు దౌత్య కార్యాలయాలకు భద్రత కల్పించాలి. రెండు పొరుగుదేశాలు, ఒకదానిపై మరొకటి ఆధారపడి ఉన్నందున భారత్ వాస్తవాన్ని అంగీకరించి, బంగ్లాదేశ్‌తో ఉన్న సంబంధాల విషయంలో నమ్మకాన్ని పునరుద్ధరించే కార్యక్రమాన్ని చేపట్టాల్సిన అవసరం ఉంది.

# బీజేపీని కట్టడి చేశాం

## మోదీ సర్కారుపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, జనవరి 8:**2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి 400 సీట్లు గెలుచుకుని ఉంటే రాజ్యాంగాన్నే మార్చివేసేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. మెజారిటీ ఉందన్న కారణంతో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తే అంగీకరించేది లేదని ఆయన స్పష్టం చేశారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పేదలపై కక్షతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని మార్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఉపాధి హామీ నిబంధనల మార్పు ముసుగులో పథకాన్ని శాశ్వతంగా సమాధి చేయడానికి కుట్ర పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. మెజారిటీ ఉందన్న అహంకారంతో చట్టసభలను వినియోగించి పేదలను అణిచివేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకోవాల్సిన సమయం ఇదేనని ఆయన పిలుపునిచ్చారు. ఈ పథకంతో ఎన్నో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని, ఇది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని ఆయన అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్లకు అప్పగించే ప్రయత్నం చేసిందని ఆయన మండిపడ్డారు. అందుకే గత ఎన్నికల్లో 400 సీట్లను లక్ష్యంగా పెట్టుకున్నారని ఆయన అన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ ప్రజలను అప్రమత్తం చేయడంతో బీజేపీ 240 సీట్ల వద్ద ఆగిపోయిందని ఆయన పేర్కొన్నారు. దీనితో రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచన వాయిదా పడిందని ఆయన అన్నారు. ఓట్లను తొలగించేందుకు ఎస్ఐఆర్ తీసుకువచ్చారని, దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.పేదలపై కక్షతో మహాత్మగాంధీ పేరు ఉన్న పథకానికి పేరు మార్చారని మండిపడ్డారు. రూల్స్ పేరుతో పథకానికి శాశ్వతంగా సమాధి కట్టేందుకు ప్లాన్ చేస్తున్నారని ఫైర్ అయ్యారు. అధికారం ఉందని మోదీ ఇష్టారీతిన పాలిస్తామంటే అంగీకరించేది లేదని రేవంత్ రెడ్డి అన్నారు. మెజార్టీ ఉంది కదా అని పేదలను అణచివేస్తామంటూ కాంగ్రెస్ చూస్తూ ఊరుకోబోదని వార్నింగ్ ఇచ్చారు. ఈ పథకం ప్రవేశ పెట్టిన తర్వాత చాలా మార్పులు వచ్చాయని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. గత ఎన్నికల్లో బీజేపీ నేతలు ప్రచారం చేసినట్టుగా 400 సీట్లు వచ్చి ఉంటే మాత్రం ఈపాటికి రాజ్యాంగాన్ని మార్చేసేవారని ఎద్దేవా చేశారు. కార్పొరేట్ సంస్థలకు లొంగిపోయి పేదలకు అన్యాయం చేస్తున్నారని దీన్ని గమనించే బీజేపీకి ఎక్కడ ఉంచాలో అక్కడ ఉంచారని చెప్పారు. రాష్ట్రాల్లో ఓడిపోతామని గ్రహించి ప్రతిపక్షల ఓట్లు తొలగించే కుట్రకు కూడా వెనుకాడటం లేదని అన్నారు. దేశంలో బడా కంపెనీలకు మేలు చేసి ప్రజలతో వెట్టిచాకిరీ రోజులు తిరిగి తీసుకొచ్చేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఉపాధీ హామీ పేరు మార్పు వెనుకలా కార్పొరేట్ కుట్ర దాగి ఉందని అన్నారు. కేంద్ర చేస్తున్నది వికసిత భారత్ కాదని సంక్షభ భారత్ దిశగా నడిపిస్తోందని అన్నారు. బడా కంపెనీలకు మేలు చేసేలా చట్టంలో మార్పులు చేశారని అన్నారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన పీసీసీ, పీఏసీ విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు, సీనియర్ నేతలు మాట్లాడారు. కేంద్రం విధానాలపై ఫైర్ అయ్యారు. గ్రామీణ ప్రజలకు మరణ శాసనం రాసేలా మోదీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి పేరు మార్చి దాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కామెంట్ చేశారు. ప్రజలకు ఎంతో మేలు చేసే పథకం నుంచి మహాత్మ గాంధీ పేరు తీసేయడమే కాకుండా పని హక్కులు, నిధులు కుదించారని అన్నారు. ప్రజలకు పని కల్పించే పథకంలో పని మాయమైందని, ప్రజలకు సేవ చేసే అధికారులను కూడా తొలగించారని, ఇప్పుడు కేంద్రం ఇచ్చే నిధుల్లో కూడా కోత పెట్టారని మండిపడ్డారు. రాష్ట్రాలపై భారం మోపి ప్రజల ఉపాధికి గండి కొడుతున్నారని అన్నారు. అందుకే కేంద్రం తీసుకొచ్చిన నిర్ణయాలను వ్యతిరేకిస్తూ వేల గ్రామాల్లో తీర్మానాలు చేశారని వాటిని రాష్ట్రపతికి అందజేస్తామని తెలిపారు.




# గులాబీకి వరుస చిక్కుముళ్లు...

- మొదటి పేజీ తరువాయి

లేకపోలేదు. కానీ 10 సంవత్సరాల కాలంలో అధికారంలో ఉన్నప్పుడు ఆమె ఏం చేశారు అనేది ఇక్కడ అసలైన ప్రశ్న. భారత రాష్ట్ర సమితి ఏర్పాటును వ్యతిరేకించానని చెప్పిన ఆమె.. పార్టీ ప్రారంభత్సవానికి ఢిల్లీ ఎందుకు వెళ్లినట్టు? 10 సంవత్సరాల కాలంలో తెలంగాణలో విధ్వంసం జరిగిందని చెబుతున్న ఆమె.. గతంలో బంగారు తెలంగాణ సాకారం అయిందని ఎందుకు చెబుతున్నట్టు.. లిక్కర్ కేసులో అడ్డంగా ఇరుక్కుపోయారు కాబట్టి.. కేసుల నుంచి తప్పించుకోవాలంటే ఆమె కెసిఆర్ కు వ్యతిరేకంగా వ్యవహరించాలి కాబట్టి.. అలానే చేస్తున్నారని గులాబీ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్, బిజెపి రాజకీయాల లక్ష్యాలకు అనుగుణంగా ఆమె నడుచుకుంటున్నారని గులాబీ నేతలు మండిపడుతున్నారు.వాస్తవానికి తన పార్టీలో ఉన్నప్పుడు ప్రాధాన్యం దక్కలేదని పదేపదే ఆరోపిస్తున్న కవిత.. ఒకసారి ఎంపీ ఎలా అయ్యారు? మరోసారి ఎమ్మెల్సీ ఎలా అయ్యారు? సింగరేణిలో అధ్యక్షురాలిగా ఎలా ఉన్నారు? ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయని గులాబి పార్టీ నేతలు అంటున్నారు. అధికారం దూరంగానే కెసిఆర్ కు వ్యతిరేకంగా మాట్లాడటం సమంజసం కాదని ఆమెకు గుర్తుచేస్తున్నారు. మరోవైపు జాగృతి నేతలు స్పందిస్తున్న తీరు వేరే విధంగా ఉంది. కేటీఆర్ కూడా ఆమెకు ద్రోహం చేశారని.. కనీసం ఒక పని కూడా చేసుకునే అవకాశం కల్పించలేదని.. ఆమె భర్త ఫోన్ కూడా టాప్ చేశారని.. అలాంటప్పుడు ఆమె పార్టీలో ఎలా ఉంటారంటూ జాగృతి నేతలు చెబుతున్నారు. గడిచిన 10 సంవత్సరాల కాలంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో హరీష్ రావు అడ్డగోలుగా దోపిడీకి పాల్పడ్డారని.. అందువల్లే కవిత ఆయన టార్గెట్ చేస్తూ ఆరోపణలు చేస్తున్నారని జాగృతి నేతలు చెబుతున్నారు.. కవిత రాజకీయ ఎదుగుదలను తట్టుకోలేక ఆమెకు అడుగడుగునా అడ్డు పుల్లలు వేస్తున్నారని.. అందువల్లే కవిత ఈ స్థాయిలో స్పందిస్తున్నారని జాగృతి నేతలు అంటున్నారు.కవితకు, కెసిఆర్ కు మధ్యలో గ్యాప్ రావడానికి ప్రధాన కారణం హరీష్, సంతోష్ రావు అని జాగృతి నేతలు చెబుతున్నారు. అందువల్లే ఆమె ఆధారాలతో సహా విమర్శలు చేస్తున్నారని.. ఇందులో వ్యక్తిగత లక్ష్యాలు అంటూ ఏమీ లేవని జాగృతి నేతలు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ అంతపురంలో జరిగే కుమ్ములాటలు రాజ్యానికి అసలు మంచివి కావు. ఇప్పుడు భారత రాష్ట్ర సమితిలో చోటు చేసుకుంటున్న పరిణామాలు కూడా ఆ పార్టీకి ఏమాత్రం శ్రేయస్కరం కాదు. ఇప్పటికే



పార్లమెంటు ఎన్నికల్లో 0 ఫలితాలు వచ్చాయి. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలలో అధికార పార్టీకి సానుకూలమైన ఫలితాలు వచ్చాయి. స్థానిక ఎన్నికల్లో చెప్పుకోదగ్గ స్థానాలు కూడా గులాబీ పార్టీకి రాలేదు. అలాంటప్పుడు ఈ అంతర్గత కుమ్ములాటను ఏ స్థాయిలో కేసీఆర్ పరిష్కరిస్తారో చూడాల్సి ఉంది.

# 20న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్..

- మొదటి పేజీ తరువాయి

పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. దీనివల్ల ఓటర్లకు తమ పోలింగ్ కేంద్రం, బూత్ వివరాలు తెలుస్తాయని ఈసీ వెల్లడించింది. మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన మౌలిక సౌకర్యాలపైనా కలెక్టర్లకు ఈసీ దిశానిర్దేశం చేసింది. బ్యాలెట్ బాక్స్‌లు, ఎన్నికల సిబ్బంది నియామకం, రిటర్నింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్‌ను నియమించి.. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించాలని ఎన్నికల కమిషన్ సూచించింది.

**గెలుపు గుర్రాలపై గురి**

మున్సిపల్ ఎన్నికలపై అధికార పార్టీ ప్రత్యేక గురి పెట్టింది. పంచాయతీ ఎన్నికలలో వచ్చిన ఫలితాలను మున్సిపల్ ఎన్నికల్లో పునరావృతం కాకుండా అధికార పార్టీ ఆచితూచి అడుగులు వేస్తుంది.మున్సిపాలిటీ ఎన్నికల్లో అన్ని స్థానాల ‘ పైచేయి’ సాధించేలా క్షేత్రస్థాయి కసరత్తులు ముమ్మరం చేసింది. ఇప్పటికే పార్టీ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా మున్సిపాలిటీ వారిగా సర్వే చేయించి పార్టీ బలాలు, బలహీనతలు పై దృష్టి సారించింది.సీఎం రేవంత్ రెడ్డి రెండు రోజుల క్రితం పీసీసీ చీఫ్ తో ప్రత్యేక సమావేశం నిర్వహించి...జిల్లా ఇన్చార్జి మంత్రులతో పాటు నియోజకవర్గ ఎమ్మెల్యేలు పార్టీ ఇంచార్జిల కు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. జిల్లా లో ఉన్న మున్సిపాలిటీలో అన్ని స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకునేలా ఎత్తుగడలు వేయాలని ఎక్కడ కూడా ప్రతిపక్ష పార్టీకి అవకాశం ఇవ్వొద్దు అంటూ అంతర్గతంగా నేతలకు దిశా నిర్దేశం చేశారు. మున్సిపాలిటీ ఎన్నికల పై ప్రధాన రాజకీయ పార్టీలు సైతం కసరత్తు ముమ్మరం చేశాయి.మున్సిపల్ పీఠాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. అసంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో చతికిలపడినప్పటికీ స్థానిక పోరు బూలో బీఆర్ఎస్, బీజేపీ లు అనూహ్యంగా పుంజుకోవడం తో ఆ పార్టీ శ్రేణుల్లో కొంత ఆత్మస్థైర్యం నింపినట్ల య్యింది. దీంతో అధికార, ప్రతిపక్ష పార్టీలు బిఆర్ఎస్, బిజెపి పార్టీ లు సైతం ఎన్నికల కు సై అంటుంది. దీంతో ఆయా పార్టీ లు గెలుపు కోసం వ్యూహారచన చేస్తున్నాయి. రంగారెడ్డి జిల్లాలో 15 మున్సిపాలిటీలు మూడు కార్పొరేషన్లు ఉండగా అందులో ఎనిమిది మున్సిపాలిటీలు మూడు కార్పొరేషన్లను ఇటీవల ప్రభుత్వం జిహెచ్ఎంసిలో విలీనం చేసింది. ప్రస్తుతం ఆమనగల్, షాద్నగర్, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్పల్లి మున్సిపాలిటీ ఎన్నికలకు అధికారులు సన్నాహాలు చేస్తుండగా కొత్తూరు మున్సిపాలిటీ కి పాలకవర్గం గడువు తీరకపోవడం తో అక్కడ ఎన్నికలు మరింత సమయం పడుతుంది. మిగతా ఆరు మున్సిపల్ ఎన్నికలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి.గత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాల ను గెలుచుకొంది. రాష్టంలో అధికారం కోల్పోయి మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో మళ్ళీ పురఎన్నికలో పట్టు నిలుపుకునేలా ఎత్తుగడలు వేస్తుంది. నియోజకవర్గాలో సన్నాహక సమావేశాలు నిర్వహించి పార్టీ నేతల్లో ఉత్సాహం నింపుతుంది. మున్సిపాలిటీ,వార్డుల వారిగా బస్తి బాట పేరుతో ప్రచారానికి సైతం దిగింది. వార్డుల వారిగా రిజర్వేషన్ల ప్రకారం అభ్యర్థులను గెలుపు గుర్రాలను అధికారపాటికి దీటుగా నిలబెట్టేలా వ్యూహాలు సిద్ధం చేసే పనులు పార్టీ నేతలు నిమగ్నంగా అయ్యారు.పురపాలికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకునేలా వ్యూహాలకు పదును పెడుతోంది. ఈ మేరకు ఇప్పటికే రంగారెడ్డి జిల్లా లో ఆరు మున్సిపల్ పరిధిలో ఆయా పార్టీ అధ్యక్షులు ఇప్పటికే సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయా డివిజన్ల వారీగా పార్టీ పరిస్థితి, గెలుపు గుర్రాలపై కీలక నేతలతో చర్చిం చారు. గెలవడానికి ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని.. పార్టీ అభ్యున్నతే లక్ష్యంగా ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ కు దీటుగా అభ్యర్థులను రంగంలోకి దించేలా క్షేత్రస్థాయిలో గెలుపు గుర్రాలను జల్లెడ పట్టే బాధ్యతలను పలువురికి అప్పగించినట్లు సమాచారం.స్థానిక పోరు లో విజయం సాధించినా కానీ కాంగ్రెస్ లో కొంత అసంతృప్తి నెలకొంది. మెజార్టీ స్థానాలు సాధించలేకపోయామని నేతలు బహిరంగంగానే తమ లోపాలను బయట పెట్టుకున్నారు. సమన్వయంతో పార్టీలో ముందుకు వెళ్ళలేదని పంచాయతీలో వచ్చిన ఫలితాలను చూసి తమ తప్పులను ఒప్పుకుంటున్నారు. పంచాయతీ లో బీఆర్ఎస్ పుంజు కోవడం తో కాంగ్రెస్ నేతలను కొంత ఇరకాటంలో పడేసినట్లయ్యింది.స్థానిక పోరు లో బీఆర్ఎస్, బీజేపీ మద్దతుదారులు గెలవడా నికి ప్రధాన కారణం స్వపక్షంలోని రెబల్స్ అభ్యర్థులేనని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గుర్తించింది. సీఎం సైతం జిల్లా, నియోజకవర్గా ల వారిగా ఫలితాలను చూసి కొంత అసంతృప్తి వెళ్ళగక్కారు. నియోజకవర్గం ఫలితాలను చూసి అందుకు బాధ్యులపై చీవాట్లు పెట్టారు. ఈ నేపథ్యంలో పురపాలక పోరులో రెబల్స్ ప్రభావం లేకుండా ఆ పార్టీ ముఖ్య నేతలు ఆచితూచి వ్యవహరిస్తు న్నారు. ఇందులో భాగంగా ఆయా డివిజన్లు / వార్డుల వారీగా ఆశా వహులు,కౌన్సిలర్ అభ్య ర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరి స్తోంది. ప్రస్తుతం వ్యక్తిగత సమాచారం తో పాటు ఆయా వార్డుల్లో బలా బలాలు, సామాజిక వర్గాల వారిగా ఆర్థిక స్థితిగతులకు అనుగుణంగా అభ్యర్థులను ఖరారు ఖరారు చేసే పనులు ప్రస్తుతం నేతలు నిమగ్నం అయ్యా



## టాప్ గేర్ లో రియల్ ఎస్టేట్

- మొదటి పేజీ తరువాయి




నగరాల్లో హైదరాబాద్‌లోనే సేల్స్ కాస్త ఎక్కువగా పెరిగాయి. ఇక్కడ 2025 సంవత్సరంలో మొత్తం ఇళ్ల విక్రయాలు 4 శాతం పెరిగి 38,403 యూనిట్లకు చేరుకున్నాయి. ఇదే సమయంలో ఇళ్లు లేదా ఫ్లాట్స్ ధరలు కూడా 13 శాతం వరకు పెరిగి చదరపు అడుగుకు సగటు ధర రూ. 6,721 గా ఉంది. రెండో అర్ధభాగంలో అంటే జులై- డిసెంబర్ సమయంలో హౌసింగ్ సేల్స్ హైదరాబాద్ నగరంలో 19,355 గా ఉండగా.. ఇది అంతకుముందు సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే 5 శాతం ఎక్కువ.కొత్త ఇళ్ల సప్లై విషయానికి వస్తే 2025లో హైదరాబాద్‌లో ఇది 40,737 యూనిట్లుగా ఉండగా.. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 7 శాతం తగ్గింది. ఇక 2025లో అన్‌సోల్డ్ ఇన్వెంటరీ అంటే అమ్ముడుపోని ఇళ్లు లేదా ఫ్లాట్ల సంఖ్య హైదరాబా?ద్‌లోనే 54,878 యూనిట్లుగా ఉండటం గమనార్హం. అంటే ఇక్కడ డిమాండ్‌కు మించి కొత్త ఇళ్ల సప్లై ఉండటమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. హైదరాబాద్‌లో ప్రధానంగా మౌలిక వసతుల కల్పన, ఉద్యోగాల సృష్టిలో దూసుకెళ్తుండటం వల్ల రియల్ ఎస్టేట్ కూడా వృద్ధి చెందుతున్నట్లు నైట్ ఫ్రాంక్ ఇండియా రిపోర్ట్ తెలిపింది.ముంబైలో హౌసింగ్ సేల్స్ ఒక శాతం పెరిగి 97,188 యూనిట్లుగా ఉంది. ఇక్కడ సగటున ఇళ్ల ధరలు 7 శాతం పెరిగి చదరపు అడుగుకు రూ. 8,856 గా ఉంది. బెంగళూరులో ఇళ్ల విక్రయాలు స్థిరంగా 55,373 యూనిట్లుగా ఉంది. ఇళ్ల ధరలు సగటున 12 శాతం వరకు పెరిగి చ.అడుగుకు రూ. 7,388 గా ఉంది. పుణె, ఢిల్లీ- ఔఅఖీ, కోల్‌కతాలోనూ ఇళ్ల అమ్మకాలు కాస్త తగ్గుముఖం పట్టాయి.

## ఉపాధి హామీని నిర్వీర్యం చేసే కుట్ర

- మొదటి పేజీ తరువాయి

గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ ఎన్నికల్లో 66 శాతంపైగా కాంగ్రెస్ గెలిచిందని, మున్సిపల్ ఎన్నికల్లోనూ గెలవాలని ధీమా వ్యక్తం చేశారు. కష్టపడినవాడు ఎప్పుడూ నష్టపోడని తెలిపారు. కాంగ్రెస్ మంత్రులంతా కష్టపడి పైకొచ్చినవారేనని, పార్టీ అవకాశం ఇస్తే తనతోపాటు ఎవరికైనా గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు.

## వీబీ-జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా పోరాడాలి

- మొదటి పేజీ తరువాయి

డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా జనవరి 10వ తేదీ నుంచి ఫిబ్రవరి 25వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలను చేపట్టాలని మార్గనిర్దేశం చేశారు.

**నిరసనలు ఉధృతం చేయాలి..**

ఏఐసీసీ సూచన మేరకు జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకిస్తూ నిరసనలు ఉధృతం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. సంక్రాంతి తర్వాత 20 నుంచి 30వ తేదీల్లో అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. పీూచీ=జు+ూ చట్టం గొప్పతనం వివరిస్తూ ప్రతి నియోజకవర్గానికి ఐదు వేల చొప్పున కరపత్రాలు పంపిణీ చేయాలని మార్గనిర్దేశం చేశారు. ప్రతి కరపత్రం గ్రామాలు, వాడవాడకూ చేరాలని సూచించారు. విదేశాల్లో ఉన్న వ్యక్తులు కూడా ఉపాధి హామీ పథకం గురించి ఆరా తీశారని పేర్కొన్నారు. ఈ పథకం గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారని చెప్పుకొచ్చారు. జీ రామ్ జీ చట్టంతో పేదల హక్కు కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు చేస్తూ డీసీసీలు గ్రామసభలు నిర్వహించి తీరాల్సిందేనని హుకుం జారీ చేశారు. జీ రామ్ జీ చట్టంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆయా జిల్లాల్లో బహిరంగ సభల్లో పాల్గొంటారని తెలిపారు. కాంగ్రెస్ శ్రేణులు భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. డీసీసీ పదవి బాధ్యతగలదని.. అన్ని కార్యక్రమాలను దగ్గరుండి పర్యవేక్షంచాలని మహేశ్ కుమార్ గౌడ్ దిశానిర్దేశం చేశారు.

## ప్రభుత్వవిజయాలపై బహిరంగసభలు

- మొదటి పేజీ తరువాయి



ఒక భారీ బహిరంగ సభ ఉంటుంది. ఈ సందర్భంగా స్థానిక సమస్యలపై స్పందించడంతో పాటు, నియోజకవర్గాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు సంబంధించి కీలక ప్రకటనలు చేసే అవకాశం ఉంది. ఇటీవలి కాలంలో ప్రధాన ప్రతిపక్షలు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను తిప్పికొట్టేందుకు ఈ సభలను వేదికగా మార్చుకోనున్నారు. జల వివాదాలు, నిరుద్యోగ భృతి , ఇతర హామీలపై విపక్షల ఆరోపణలకు ధీటైన సమాధానం ఇచ్చేలా వ్యూహరచన చేస్తున్నారు. మున్సిపల్ , స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో, ఈ బహిరంగసభలు పార్టీ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతాయని కాంగ్రెస్ భావిస్తోంది. పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని మరింత బలపరుచుకోవడం ఈ సభల వెనుక ఉన్న అసలు వ్యూహం అని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ బహిరంగసభలు నిర్వహించాలని ప్లాన్ చేశారు. దక్షణ తెలంగాణలోని మూడు జిల్లాల్లో బహిరంగసభలను పదిహేను రోజుల్లో నిర్వహిస్తామని రెండు వారాలా కిందట నిర్వహించి ప్రెస్మీట్లో ప్రకటించారు. ఆ తర్వాత బహిరంగసభల నిర్వహణ గురించి పార్టీ నేతలతో మాట్లాడారు. కానీ ఇప్పటి వరకూ తేదీలను ఖరారు చేయలేదు.మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో ఈ సభలు పెట్టాలనుకున్నారు. బీఆర్ఎస్ కంటే ముందుగానే కాంగ్రెస్ బహిరంగసభలు పెట్టి బీఆర్ఎస్ చేస్తున్నప్రచారాన్ని తిప్పి కొట్టాలని నిర్ణియంచుకుంది. ఏకంగా తొమ్మిది జిల్లాల్లో సభలు పెట్టాలని నిర్ణయించడంతో బీఆర్ఎస్ పార్టీ అంత కంటే ముందే సభలు నిర్వహిస్తుందా లేకపోతే.. వాయదా వేసుకుంటుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

## బీఎన్‌పీకి చెందిన రాజకీయ నాయకుడిని కాల్చివేత

**న్యూఢిల్లీ, జనవరి 8:**బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) స్వచ్ఛంద విభాగం స్వచ్ఛసేవక్ దళ్ నాయకుడు అజీజుర్ రెహమాన్ ముసాబ్బీర్‌ను బుధవారం రాత్రి ఢాకాలో గుర్తు తెలియని దుండగులు కాల్చి చంపారు. ఈ ఘటనలో మరొక వ్యక్తి గాయపడ్డారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అజీజుర్ గతంలో బీఎన్‌పీకి చెందిన ఢాకా మెట్రోపాలిటన్ నార్త్ స్వచ్ఛ సేవక్ దళ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఢాకాలోని కర్వాన్ బజార్ వద్ద ఒక హోటల్ సమీపంలో ఈ సంఘటన జరిగింది. దుండగులు అతి దగ్గరి నుంచి అజీజుర్‌పై కాల్పులు జరిపి పరారయ్యారు. బాధితుడు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు.ఈ ఘటనలో గాయపడిన మరొక వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిందితులను గుర్తించేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, అజీజుర్‌పై కాల్పులను నిరసిస్తూ బీఎన్‌పీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు.

## సీఎం, మంత్రికి కృష్ణ జలాల పై అవగాహన లేదు...

**తలసాని**



**సికింద్రాబాద్:**కృష్ణా జలాల వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కు అవగాహన లేదనే విషయం స్పష్టమైందని సనత్ నగర్ ఎమ్మెల్యే, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.తెలుగుదేశం నాయకులే రేవంత్ రెడ్డి చెప్పిన మాటలన్నీ అబద్ధమని చెప్పడంతో వీళ్ళ అవగాహన రాహిత్యం బట్టబయలైందని తెలిపారు.కృష్ణా జిల్లాల విషయంలో హరీష్ రావు పి పి టి ద్వారా ప్రజలకు స్పష్టత ఇచ్చారని వెల్లడించారు.సికింద్రాబాద్ కార్పొరేషన్ చేయాల్సిందేనని మాజీ మంత్రి తలసాని డిమాండ్ చేశారు.చారిత్రక నేపథ్యం ఉన్న సికింద్రాబాద్ పేరు కనుమరుగు చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కుట్ర చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి దమ్ముంటే హైదరాబాద్ పేరు మార్చాలని అన్నారు.సికింద్రాబాద్ కార్పొరేషన్ ఏర్పాటు చేసే వరకు పోరాటం చేస్తామని బంద్ లు, రాస్తారోకోలు, రైలు రోకోలు చేసి సికింద్రాబాద్ కార్పొరేషన్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.సికింద్రాబాద్ కార్పొరేషన్ కోసం కలిసి వచ్చే అన్ని పార్టీ లను కలుపుకొని ఈనెల 11న సమావేశం ఏర్పాటు చేస్తామని అన్నారు.జిహెచ్ఎంసి డివిజన్ల పునర్విభజన తప్పుల తడకగా చేశారని దుయ్యబట్టారు.ఈనెల 17న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి మంజు థియేటర్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహిస్తామని సికింద్రాబాద్ ప్రజలంతా స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## ఇరుసుమండ బ్లో అవుట్ ఘటన

**ఓఎన్జీసీ అధికారులపై ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆసహనం**

**అమలాపురం:**అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామంలో జరిగిన ఓఎన్జీసీ బ్లో అవుట్ ఘటనపై రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ తీవ్రంగా స్పందించారు. ఓఎన్జీసీ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిక్షేపాలు వెలికి తీయడానికి ముందు స్థానిక ప్రజలకు, ప్రజాప్రతినిధులకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. కోనసీమ ప్రజలకు తగిన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకంగా లక్కవరం ప్రాంతంలో స్థలం సిద్ధంగా ఉందని, అక్కడ 50 కోట్ల రూపాయల వ్యయంతో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ఓఎన్జీసీ నిర్మించి ఇవ్వాలని కోరారు. బ్లో అవుట్ ఘటన బుధవారం సాయంత్రానికి అదుపులోకి వచ్చిందని అధికారులు తెలిపారు.ఈ ఘటన వల్ల కలిగిన నష్టపరిహారం, రోడ్ల నిర్మాణానికి అయ్యే ఖర్చును అంచనా వేస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం బావికి కేవలం 10 మీటర్ల దూరంలోనే పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇరుసుమండ, గుబ్బలపాలెం, చింతలపాలెం, లక్కవరం గ్రామాల ప్రజలతో ఎమ్మెల్యే దేవవరప్రసాద్ ప్రత్యక్షంగా మాట్లాడారు. సోమవారం బ్లో అవుట్ జరిగిన సమయంలో ఉదయం 11:30 నుంచి 12:30 గంటల వరకు గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారని, ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని పరుగులు తీశారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. డీప్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ వారు స్థానిక ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ముందస్తు సమాచారం ఇచ్చిన తర్వాతే పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. మాకు చెప్పకుండా ఆయిల్ బావుల నుంచి నిక్షేపాలు వెలికి తీస్తే తాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోనని స్పష్టం చేశారు. లక్కవరం ప్రాంతంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం తప్పనిసరి అని మరోసారి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఓఎన్జీసీ డీడీ విక్రమ్ సక్సేనా మాట్లాడుతూ ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని తెలిపారు.

### బంజారాహిల్స్ ఉదయ్‌నగర్‌లో

## కూలిన పురాతన నాలా శ్లాబ్

**నాలాలో పడిపోయిన మినీ ఇసుక లారీ**

**హైదరాబాద్:**బంజారాహిల్స్ రోడ్ నెంబర్‌ఉ11 పరిధిలోని ఉదయ్‌నగర్‌లో ప్రమాదం చోటుచేసుకుంది. లోడుతో వెళ్తున్న మినీ ఇసుక లారీ అకస్మాత్తుగా రోడ్డు కుంగిపోవడంతో కింద ఉన్న నాలాలోకి పడిపోయింది. పైకి సాధారణ రోడ్డులా కనిపించిన ఈ ప్రాంతం వాస్తవానికి ఎప్పుడో నిర్మించిన పురాతన నాలా శ్లాబ్‌గా స్థానికులు చెబుతున్నారు.ఇన్నేళ్లుగా వానలకు తడిసి, ఎండలకు ఎండిపోవడంతో నాలా శ్లాబ్ పూర్తిగా బలహీనమైంది. ఆపై భారీ బరువుతో వచ్చిన మినీ లారీ కారణంగా శ్లాబ్ ఒక్కసారిగా కూలిపోయి ప్రమాదం జరిగింది. లారీ ఎడమ భాగం నాలాలోకి కూరుకుపోవడంతో అందులో ఉన్న డ్రైవర్ ఇరుక్కుపోయాడు. పెద్ద శబ్దంతో మినీ లారీ పడిపోవడంతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని కష్టపడి డ్రైవర్ ను బయటకు తీశారు. సమాచారం అందుకున్న వెంటనే జీహెచ్ఎంసీ, హైడ్రా, జలమండలి అధికారులు, బంజారాహిల్స్ పోలీసులు అక్కడికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.పోలీసుల ప్రాథమిక విచారణలో, ఇసుక లారీ సిబ్బంది ముందుకు వెళ్లే క్రమంలోనే ప్రమాదంలో చిక్కుకున్నట్లు గుర్తించారు. ఈ మార్గంలో రోజూ పది వరకు భారీ లారీలు రాకపోకలు సాగిస్తుండగా, స్థానికులు కూడా తమ వాహనాలతో ఇదే దారిని వినియోగిస్తున్నారు. అయితే రహదారి కింద నాలా ఉన్న విషయమే తమకు తెలియదని స్థానికులు తెలిపారు.ఇదిలా ఉండగా, నాలాలో పడిపోయిన మినీ లారీని బయటకు తీసే పనిలో అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## దివ్యాంగులను అన్ని విధాలుగా ప్రభుత్వ సహకారం

***బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలి: మేఘారెడ్డి***



**వనపర్తి:**దివ్యాంగులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అందుకు గాను రేవంత్ సర్కార్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.బుధవారం జిల్లా సంక్షమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాత మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఆర్టిఫీషియల్ లింబ్స్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, గ్రిడ్ కంట్రోల్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో జిల్లాలోని 730 మంది దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.గత సంవత్సరం దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగుల సంక్షమ భవనానికి 1000 గజాల స్థలం కేటాయించడం జరిగిందని, అట్టి స్థలంలో భవన నిర్మాణానికి త్వరలోనే నిధులు మంజూరు చేయనున్నట్లు తెలియజేశారు.దివ్యాంగులు ఎందులోనూ తక్కువ కాదని, సమాజంలోని అన్ని రంగాల్లో సకలాంగులతో సమానంగా పోటీ పడుతున్నారని కొనియాడారు.రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందుల వల్ల కొంత ఆలస్యం అయినప్పటికి దివ్యాంగులకు ఇస్తామని ఏదైతే మేనిఫెస్టోలో పొందుపరిచామో వాటిని ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఆర్టిఫీషియల్ లింబ్స్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, గ్రిడ్ కంట్రోల్ ఆఫ్ ఇండియా తరపున జిల్లాలోని దివ్యాంగులకు 70.73 లక్షల విలువ గల ఉపకరణాలు 728 మంది దివ్యాంగులకు ఇస్తున్నందుకు యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలిపారు.కేంద్ర ప్రభుత్వ కార్పొరేషన్లు సి.ఎస్.ఆర్., ఎ.డి.బి నిధులు వనపర్తి జిల్లాకు అత్యధికంగా కేటాయించి జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.అనంతరం దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా మైనారిటీ సంక్షమ శాఖ ఆధ్వర్యంలో 20 మందికి ఒక్కొక్కరికి రూ. 30 వేల చొప్పున చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలింకో డిప్యూటీ జనరల్ మేనేజర్ సంజయ్ సింగ్, గ్రిడ్ కార్యనిర్వహక సంచాలకులు యం.కె. రమేష్, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఆర్డీఓ సుబ్రమణ్యం, డి. డబ్ల్యు. ఒ సుధారాణి, జిల్లా మైనారిటీ సంక్షమ శాఖ అధికారి అఫ్జలుఫిన్, తహసిల్దార్ రమేష్ రెడ్డి, దివ్యాంగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మీసాల మోహన్, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ టూర్ లో జగన్ జెండాలు

**ఖమ్మం, జనవరి 8:**రాజకీయాలలో ఇలా ఉండాలని ఉండదు. ఇలా ఉంటేనే బాగుంటుందని కూడా ఉండదు. రాజకీయాలలో ఎలాగైనా జరుగుతుంది. ఏదైనా జరుగుతుంది. దానికి ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు. కొన్ని సందర్భాలలో బద్ధ శత్రువులుగా ఉన్న కాంగ్రెస్, బిజెపి కలిసిపోతాయి. రాజకీయ లక్ష్యాల కోసం కలిసి పోటీ చేస్తాయి. ఇంతవరకు జాతీయస్థాయి రాజకీయ మొక్క చిత్రంలో ఇటువంటి సన్నివేశం చూడకపోయినప్పటికీ.. రాష్ట్ర స్థాయిలలో మాత్రం కాంగ్రెస్, బిజెపి ఒక ఒర లో ఇమిడిపోయిన దృశ్యాలు చాలానే కనిపించాయి.తెలంగాణలో ఇప్పుడు విభిన్నమైన రాజకీయ దృశ్యం కనిపిస్తోంది. బహుశా దీనిని చాలామంది ఊహించి ఉండరు. 2014లో, 2018 లో భారత రాష్ట్ర సమితి తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. 2018లో అధికారంలోకి వచ్చిన తర్వాత సహజంగానే భారత రాష్ట్ర సమితి అధినేత కేసిఆర్ ఏపీ రాజకీయాలలో వేలు పెట్టడం మొదలుపెట్టారు.అంతకుముందు చంద్రబాబు ప్రస్తావన తీసుకొచ్చి రిటర్న్ గిఫ్ట్ లో భాగంగా కేసీఆర్ ఈ దిశగా అడుగులు వేశారు. 2019లో ఏపీలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావడంలో విజయవంతం అయ్యారు.. చాలా సందర్భాలలో అలైబలై అన్నట్టుగా వ్యవహరించారు. మధ్య మధ్యలో ప్రగతి భవన్ కు పిలిపించడం.. తెలంగాణ సత్కారాలు అందించడం వంటివి జరిగిపోయాయి. 2023



ఎన్నికల్లో మాత్రం సెంటిమెంట్ రగిలించే క్రమంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు మీదికి ఏపీ పోలీసులు వచ్చారు. అప్పట్లో ఈ సన్నివేశం కాస్త ఉద్విగ్నంగా మారినప్పటికీ.. గులాబీ పార్టీకి మాత్రం ఓట్లు తెప్పించే మంత్రంగా పనిచేయలేదు.ఇప్పుడిక అటు తెలంగాణలో.. ఇటు ఆంధ్రప్రదేశ్లో కెసిఆర్, జగన్ అధికారాన్ని కోల్పోయారు. అధికారాన్ని దక్కించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రయత్నాలు ఎంతవరకు సఫలికృతం అవుతాయి తెలియదు కానీ.. తెలంగాణ రాష్ట్రంలో గులాబీ పార్టీకి వైసిపి బహిరంగంగా సపోర్ట్ తెలియజేస్తోంది. బుధవారం ఖమ్మంలో కేటీఆర్ పర్యటించినప్పుడు.. కూసుమంచి వద్ద స్వాగతం పలికే క్రమంలో గులాబీ పార్టీ జెండాలతో పాటు, వైసిపి జెండాలు కూడా కనిపించాయి. కొంతమంది జగన్, కేటీఆర్ ను కలిపి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.తెలంగాణ వాదంతో, తెలంగాణ సెంటిమెంట్తో అధికారంలోకి వచ్చిన భారత రాష్ట్ర సమితి.. తెలుగుదేశం పార్టీని, వైసీపీని, జనసేన ను ఆంధ్ర బూచిలుగా చూపించే ప్రయత్నం చేసింది. చివరికి ఆ పార్టీలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తూ 2018లో అధికారంలోకి వచ్చింది. ఇక ఉద్యమ సమయంలో అయితే జగన్ మీద కేసీఆర్, కేటీఆర్ ఏ స్థాయిలో విమర్శలు చేశారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.మానుకోటలో జగన్ పర్యటన సందర్భంగా రాళ్లు రువ్విన సంఘటన కూడా విధితమే. ఇన్ని జరిగిన తర్వాత కేవలం రాజకీయ ఆకాంక్షలతోనే గులాబీ పార్టీ అడుగులు వేయడం.. తన ఉద్యమస్ఫూర్తిని మర్చిపోవడం బాధాకరం. తన పర్యటనలో వైసీపీ జెండాలు కనిపించడం ద్వారా తెలంగాణ సమాజానికి కేటీఆర్ ఏం సమాధానం చెబుతారు? ఎలాంటి సంజాయిషీ ఇస్తారు? ఈ ప్రశ్నలకు కాలమే సమాధానం చెప్పాలి.ఇటీవల బెంగళూరు నగరంలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో జగన్, కేటీఆర్ పాల్గొన్నారు. వారిద్దరూ పక్కపక్కన కూర్చున్నారు.. ఈ కలయికను గులాబీ పార్టీ గొప్పగా చెప్పుకుంది. వైసిపి గట్టిగా ప్రచారం చేసుకుంది. దీనిని బట్టి అంతర్గతంగా ఏం జరుగుతుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని తెలంగాణ వాదులు అంటున్నారు.

# ఉర్దూ వర్శిటీ విస్తరణకు సిద్ధం...

**హైదరాబాద్, జనవరి 8:**గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం విస్తరణకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ జారీ చేసిన షోకాజ్ నోటీసుపై స్పందించింది. మణికొండ జాగీర్‌లోని 50 ఎకరాల భూమిలో భవిష్యత్ అవసరాల కోసం అకడమిక్ భవనాలు, హాస్టళ్లు నిర్మించనున్నట్లు విశ్వవిద్యాలయం తెలిపింది. ఈ పనులకు సంబంధించిన సమగ్ర నివేదిక సిద్ధమవుతోందని, నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపుతామని.. అందుకు రెండు నెలల సమయం గడువు ఇవ్వాలని సమాధానం ఇచ్చింది.గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ యూనివర్సిటీ విస్తరణపై ముందడుగు పడింది. వర్సిటీ క్యాంపస్ విస్తరణ, భవిష్యత్ అవసరాలపై యాజమాన్యం దృష్టి సారించింది. వర్సిటీకి కేటాయించిన భూములపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ జారీ చేసిన షోకాజ్ నోటీసుకు వర్సిటీ సానుకూలంగా స్పందించింది. వర్సిటీకి కేటాయించిన భూముల్లో... మణికొండ జాగీర్ పరిధిలోని 50 ఎకరాల భూమిని ఎందుకు వెనక్కి తీసుకోకూడదో తెలపాలంటూ... రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కొన్ని రోజుల క్రితం షోకాజ్ నోటీసులు జారీ చేశారు.దీనిపై వర్సిటీ తాజాగా స్పందిస్తూ... ఆ స్థలంలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను వెల్లడించింది. పూర్తి స్థాయి నివేదికను



సమర్పించేందుకు రెండు నెలల గడువు ఇవ్వాలని వర్సిటీ రిజిస్ట్రార్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు.ఈ షోకాజ్ నోటీసులపై 'మనూ' రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్కే ఇంతియాజ్ అహ్మద్ స్పందిస్తూ... జనవరి 1న లేఖ రాశారు. వర్సిటీ విస్తరణ కోసం కేటాయించిన ఆ 50 ఎకరాల భూమి ఖాళీగా లేదని... దాన్ని భవిష్యత్ విస్తరణ కోసం రిజర్వ్ చేసినట్లు తెలిపారు. ఈ స్థలంలో వర్సిటీకి అవసరమైన కొత్త అకడమిక్ భవనాలు, విద్యార్థుల కోసం హాస్టళ్లు, సిబ్బంది నివాస సముదాయాల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు.ఈ స్థలంలో చేపట్టబోయే ప్రాజెక్టులకు సంబంధించి సీపీడబ్ల్యూడీ హైదరాబాద్ విభాగం 'సమగ్ర ప్రాజెక్టు నివేదిక'ను సిద్ధం చేస్తోందని వివరించారు. ఆ నివేదిక రాగానే నిధుల మంజూరు కోసం కేంద్ర విద్యాశాఖ, హెఫా కు ప్రతిపాదనలు పంపుతామని లేఖలో పేర్కొన్నారు. అందుకే రెండు నెలల గడువు ఇవ్వాలని కోరారు.అసలేం జరిగిందంటే.. 1998లో ఉర్దూ యూనివర్సిటీని ఏర్పాటు చేయడం కోసం అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం గండిపేట మండలంలోని మణికొండ జాగీర్ గ్రామంలో.. సర్వే నంబర్ 211, 212లో ఉన్న సుమారు 200 ఎకరాలను కేటాయించింది. అయితే, ఇందులో 50 ఎకరాలు ఇంకా ఖాళీగానే ఉంది. దీంతో నిబంధనల ప్రకారం వినియోగంలో లేని ఆ 50 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎందుకు వెనక్కి తీసుకోకూడదో తెలపాలని 2025, డిసెంబర్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్.. రెవెన్యూ శాఖ తరఫున వర్సిటీకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.దీనిపై స్పందించిన వర్సిటీ.. తాము ఆ 50 ఎకరాల భూమిని వృథాగా ఉంచలేదని తెలిపింది. రాబోయే రోజుల్లో వర్సిటీ విస్తరణలో భాగంగా అక్కడ భారీ నిర్మాణాలు చేపట్టబోతున్నామని స్పష్టం చేసింది. వర్సిటీ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని తమ విజ్ఞప్తిని పరిశీలించాలని కోరింది.

# కార్పొరేషన్ గా నల్గొండ...

**నల్గొండ, జనవరి 8:**తెలంగాణ శాసనసభ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ, అభివృద్ధిలో భాగంగా జిల్లా కేంద్రమైన నల్లగొండను మున్సిపల్ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రవేశపెట్టిన బిల్లుకు అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో నల్లగొండ పట్టణ ముఖచిత్రం పూర్తిగా మారనుంది. నల్లగొండ పట్టణం శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సాధారణంగా ఒక పట్టణాన్ని కార్పొరేషన్‌గా గుర్తించడానికి రూ. 20 కోట్ల వార్షిక ఆదాయం, 2 లక్షల జనాభా ప్రాతిపదికగా ఉంటుంది.అయితే నల్లగొండ పట్టణం ఇప్పటికే రూ. 40 కోట్ల వార్షిక ఆదాయంతో పాటు 2.5 లక్షల జనాభాను కలిగి ఉండటంతో అప్‌గ్రేడ్ ప్రక్రియ సులభతరమైంది. ఒకప్పుడు కేవలం రూ. 10 వేల బడ్జెట్‌తో ప్రారంభమైన ఈ పట్టణం.. నేడు రియల్ ఎస్టేట్, వాణిజ్య రంగాల్లో దూసుకుపోతోంది. కార్పొరేషన్‌గా మారడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధుల రాక పెరగడమే కాకుండా అధునాతన మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ఇదే సమావేశంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తన నియోజకవర్గ సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోల్ గ్రామాన్ని కొత్త మండల కేంద్రంగా ప్రకటించాలని, అలాగే నకిరేకల్ పట్టణాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించే అవకాశం ఉంది.మరోవైపు,



తెలంగాణ శాసనమండలి కార్యకలాపాలు ముగిశాయి. స్పీకర్ గుత్తా సుఖేందర్ రెడ్డి సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశాల్లో మున్సిపల్ సవరణ బిల్లుతో పాటు మరో కీలక నిర్ణయానికి మండలి ఆమోద ముద్ర వేసింది. తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ సేవలను గౌరవిస్తూ.. ఆయన కుమారుడికి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం కల్పించే బిల్లును డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టగా సభ్యులందరూ మద్దతు తెలిపారు. ఈ శాసనమండలి సమావేశాల్లో ఎమ్మెల్సీ కవిత చేసిన చివరి ప్రసంగం ఆసక్తి రేకెత్తించింది. తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన ఆమె.. సభలో వీడ్కోలు ప్రసంగం చేశారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## రష్యా, చైనాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన ట్రంప్

**న్యూఢిల్లీ, జనవరి 8:**అమెరికా లేకపోతే నాటోను ఎవరూ ఖాతరు చేయరని, రష్యా, చైనా గౌరవించే, భయపడే ఏకైక దేశం అమెరికా మాత్రమేనని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. గ్రీన్‌లాండ్‌ను అమెరికా సొంతం చేసుకుంటే నాటో కూటమి చీలిపోయినట్టేనని డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, స్పెయిన్, పోలాండ్ తదితర నాటో దేశాలు హెచ్చరించిన నేపథ్యంలో ట్రంప్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.తన సొంత సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్ల ద్వారా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా సైనిక సామర్థ్యాన్ని తాను పునర్నిర్మించి బలోపేతం చేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. నాటో దేశాలన్నీ తమ మిత్రులేనని, తాను జోక్యం చేసుకోకపోతే రష్యా ఇప్పటికే ఉక్రెయిన్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకునేదని అన్నారు. తాను ఒంటిచేత్తో ఎనిమిది యుద్ధాలను ఆపానని మళ్లీ చెప్పుకొచ్చారు. అయినప్పటికీ నోబెల్ బహుమతి విషయంలో నార్వే మొండిగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.అమెరికా లేకుంటే నాటోను రష్యా, చైనా ఏమాత్రం ఖాతరు చేయవని ఆయన అన్నారు. అమెరికాకు అవసరమైనప్పుడు నాటో మద్దతుగా ఉంటుందో లేదో తనకు అనుమానంగానే ఉందని వ్యాఖ్యానించారు. నాటో అండగా లేకపోయినా అమెరికా మాత్రం వారికి అండగా ఉంటుందని ట్రంప్ పేర్కొన్నారు.

### ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు..

# విచారణకు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే

**హైదరాబాద్, జనవరి 8**: తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు లో సిట్ దర్యాప్తు మరింత ఊపందుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అక్రమంగా ఫోన్లు ట్యాప్ చేసిన ఆరోపణలపై సిట్ దూకుడుగా విచారణ చేపడుతోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసిన సిట్.. వారిని విచారిస్తోంది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఈరోజు (గురువారం) జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ ఎదుట విచారణకు హాజరయ్యారు. గతేడాది నవంబర్ 17న కూడా ఆయన సిట్ విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి నోటీసు అందడంతో జైపాల్ యాదవ్ విచారణకు రాగా.. సిట్ అధికారులు ఈ కేసుకు సంబంధించి పలు ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో ఈ కేసులో నిందితుడైన అడిషనల్ ఎస్పీ తిరుపతన్న, జైపాల్ యాదవ్ మధ్య ఫోన్ సంభాషణలు జరిగినట్లు సిట్ గుర్తించింది. దర్యాప్తులో



భాగంగా.. ఒక కేసులో భార్యాభర్తల మధ్య తలెత్తిన సమస్యపై

తిరుపతన్నతో మాట్లాడినట్లు జైపాల్ యాదవ్ వాంగ్మూలం ఇచ్చారు. అయితే సిట్ అధికారులు ఎన్నికల సమయంలో జరిగిన ఈ కాల్స్, సంభాషణలపై లోతుగా విచారించారు. జైపాల్ యాదవ్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసినట్లు సమాచారం. అలాగే ఈ కేసులో మరో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యనూ సిట్ విచారించనుంది. ఇటీవల సిట్ జారీ చేసిన నోటీసుల్లో భాగంగా ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలతోపాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి కూడా విచారణకు హాజరు కానున్నారు. బీఆర్ఎస్ హయాంలో కొండల్ రెడ్డి ఫోన్ ట్యాప్ అయినట్లు దర్యాప్తులో తేలడంతో ఆయనను సాక్షిగా పిలిచినట్లు తెలుస్తోంది.

# అభివృద్ధిలో రాణించేందుకు నిధుల వరద....

**ఎన్నికలు ఏవైనా గెలుపు కాంగ్రెస్ పార్టీ దే**
**నలు దిక్కుల సంక్షమం అభివృద్ధి**
**ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి**



**నాగర్ కర్నూల్ జనవరి 8 (స్కై న్యూస్)** నియోజకవర్గ ప్రజలు గెలిపించడంతో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు వేలకోట్ల రూపాయల నిధులను నియోజకవర్గానికి తరలించుకు రావడం జరిగిందని వాటితో రహదారులు సంక్షమ భవనాల నిర్మాణాలు.మురుగు కాల్వల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని వివరించారు. గురువారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా విద్య వైద్యం వ్యవసాయ రంగాలతో పాటు ఉపాధి కల్పన పై దృష్టి సారించి సంక్షమాన్ని పరుగులు పెట్టించడం జరిగిందని వివరించారు. నియోజకవర్గానికి నాలుగు దిక్కుల నుండి అభివృద్ధి పనులు చేపట్టేందుకు ముఖ్యమంత్రి సహాయంతో ఎమ్మెల్సీ సహకారంతో గతంలో ఎప్పుడు లేని విధంగా అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని తెలిపారు. శిధిలావస్థకు చేరుకున్న కళాశాల భవనాన్ని నిర్మించేందుకు తొమ్మిది కోట్ల నిధులను మంజూరు చేయించడం జరిగిందని గతంలో నిధులు మంజూరు అయిన కొద్దిపాటిని కూడా ఖర్చు చేయలేదని తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత కళాశాలకు వెళ్లి పరిశీలించి నిధులను మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. విద్యా వ్యాప్తి కోసం ప్రభుత్వ పాఠశాలలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించడంతోపాటు నూతన భవన నిర్మాణాలను ఏర్పాటు చేయడంతో పాటు నియోజకవర్గానికి 200 కోట్ల నిధులతో నిర్మించ తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులను త్వరలో ప్రారంభిస్తామని టెండర్ ప్రక్రియ పూర్తయినట్లు ఆయన తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా సిసి రోడ్ల నిర్మాణం డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం జరిగిందని గ్రామాల అభివృద్ధి కోసం ఎస్ బిజెపి నిధులను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. కమ్యూనిటీ భవనాల నిర్మాణం దళితవాడలకు సిసి రోడ్లు డ్రైనేజీ వ్యవస్థను నిర్మించేందుకు 13.70 కోట్ల సబ్ ప్లాన్ నిధులను మంజూరు చేయడం జరిగిందని వివరించారు. మునిసిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల గ్రామానికి వెళ్లే దారిలో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి 20 కోట్ల 20 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయించడం జరిగిందని అదేవిధంగా జిల్లా కేంద్రంలో నూతన బస్టాండ్ నిర్మాణానికి 12 కోట్ల రూపాయలను మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. భక్త మార్కండేయ రిజర్వాయర్ నిర్మాణానికి 25 కోట్ల రూపాయలను మంజూరు చేయించడం జరిగిందని డిపిఆర్ తో పాటు పరిపాలన అనుమతులను సాధించడం జరిగిందన్నారు. ప్రజల సంక్షమమే లక్ష్యంగా పనిచేస్తున్న తాము ప్రజల కోరిక మేరకు ఆర్టిఏ కార్యాలయాన్ని మార్చడం జరిగిందని బాల భవనం నిర్మాణానికి నిధులను మంజూరు చేయించడం జరిగిందన్నారు. ముస్లిం షాది ఖానా నిర్మాణానికి మూడు కోట్ల నిధులను మంజూరు చేయాలని ప్రతిపాదనలు చేయడం జరిగిందన్నారు నియోజకవర్గానికి ఇంజనీరింగ్ మరియు పాలిటెక్నిక్ కళాశాలలో త్వరలో మంజూరు చేసేలా కృషి చేయడం జరుగుతుందని తెలకపల్లి మండల కేంద్రానికి డిగ్రీ కళాశాల మంజూరు చేయించడం జరిగిందన్నారు. గత పాలకులు ఎన్నికల సమయంలో ఇలాంటి అనుమతులు లేకుండా అస్తవ్యస్తంగా వేసిన రహదారులను క్రమబద్ధీకరించేందుకు మునిసిపాలిటీలో 45 కోట్లతో పనులు చేపట్టడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రజలలోకి తీసుకువెళ్లి వాటిని అమలు చేయడం వల్ల పేద ప్రజలకు అండగా నిలుస్తున్నామని ఉచిత విద్యుత్ మహాలక్ష్మి పథకం పెన్షన్ లాంటి కార్యక్రమాలను నిర్విరామంగా కొనసాగిస్తున్నట్లు అన్నారు. జిల్లా కేంద్రం నుండి తరలించిన బీసీ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలను ఇక్కడికి తరలించేందుకు సంబంధిత అధికారులతో చర్చలు చేయడం జరిగిందని వెంటనే వాటి ని తరలించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ నిధులతో పాటు తమ ఫౌండేషన్ ద్వారా 8 9 10 తరగతి విద్యార్థులకు షూస్ పంపిణీ చేయడం జరిగిందన్నారు వట్టెం రిజర్వాయర్కు విద్యుత్ అందించేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఇంటి సమస్యతో సతమతమవుతున్న బిఆర్ఎస్ అధినేత ముఖ్యమంత్రి విమర్శించడం మానుకొని కుటుంబాన్ని చక్కాదిద్దుకోవాలని సలహా ఇచ్చారు. రాజకీయ వారసత్వం లేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల హృదయాలలో గెలిచి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం తట్టుకోలేక విపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్నారని ఎవరు ఎన్ని విమర్శలు చేసినా ఎప్పుడు ఏ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ మాత్రమే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జర్నలిస్టుల ఇండ్ల సమస్యను పరిష్కరించేందుకు తన వంతు సహకరిస్తామని హామీ ఇచ్చారు రిజర్వాయర్ల భూ నిర్వాసితులకు ఆర్థిక సాయం పూర్తి స్థాయిలో అందేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని మునిసిపాలిటీలో అన్ని స్థానాలను కైవసం చేసుకుని జెండా ఎగరవేస్తామని అన్నారు ప్రభుత్వ ఆసుపత్రిలో లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్ మార్చురీ ఆధునికరణకు తాగునీటి పైప్ లైన్ తో పాటు వంటగది మరియు మూత్రశాలల నిర్మాణానికి 68 లక్షల రూపాయలను మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల సమీపంలో 650 పడకల ఆసుపత్రిని మంజూరు చేయించడం జరిగిందని దీని నిర్మాణానికి రెండు వందల ఆరు కోట్ల రూపాయలను మంజూరు చేయించడం జరిగిందన్నారు. పంచాయతీరాజ్ రోడ్ల మరమ్మత్తుల కోసం ఎమ్ ఆర్ ఆర్ గ్రాండ్ కింద 25 కోట్ల రూపాయలను మంజూరు చేయించడం జరిగిందని. అవసరమైన గ్రామాలలో నూతన గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి నిధులను మంజూరు చేయడం జరిగిందని. నియోజకవర్గంలో పోతిరెడ్డిపల్లి తెలకపల్లి తూడికుర్తి ఉయ్యాలవాడ నాగనూల్ పెద్ద ముద్దునూరు ఇంద్రకల్ గ్రామాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. వివిధ గ్రామాలలో ఆలయాల పునర్నిర్మాణానికి ఒక కోటి 61 లక్షల రూపాయలను మంజూరు చేయించడం జరిగిందన్నారు నూతనంగా ఆరు విద్యుత్ సబ్స్టేషన్లను మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. గతంలో విద్యుత్ పరికరాలను నిలువ చేసుకునేందుకు స్టోర్ రూమ్ లేకపోవడం వల్ల ప్రతిదానికి మహబూబ్ నగర్ కు వెళ్ళవలసి వచ్చేదని నాలుగు కోట్ల నిధులతో శ్రీపురం సమీపంలో ఎలక్ట్రికల్ స్టోర్ నిర్మాణానికి నిధులను మంజూరు చేయించడం జరిగిందన్నారు. జిల్లా కేంద్రంలో డిజిటల్ లైబ్రరీ తో పాటు తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బెంచ్ లను త్రాగునీటి సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు మండల పార్టీ అధ్యక్షులు మాజీ ఎంపీపీ కోటయ్య యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి వినోద్ ఆర్.టి. ఓ డైరెక్టర్ గోపాల్ రెడ్డి మాజీ కౌన్సిలర్లు కావలి శ్రీనివాసులు నిజాం జక్కా రాజ్ కుమార్ రెడ్డి తో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు

## ప్రతి విద్యార్థి విద్యతోపాటు కళా రంగంలో రాణించాలి

**- కళాశాల ప్రిన్సిపల్ షేక్ కలందర్ భాష**



**జోగులాంబ గద్వాల, జనవరి 8 (స్కై న్యూస్):**జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రతి విద్యార్థి విద్యతోపాటు కళా రంగంలో రాణించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ షేక్ కలందర్ భాష తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలన పై ఆర్ ఎక్స్ ఫ్లోర్ మూవీస్ వారు కళాశా సెమినార్ హాల్లో నటీనటులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సినిమా రంగాలు సమాజానికి మంచి సందేశాన్ని అందిస్తున్నాయని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై తీసే చిత్రం విజయవంతం కావాలని కోరారు. ఈ సినిమాలో గ్రామీణ ప్రాంతపు కొత్త నటీ, నటులను, హీరో, హీరోయిన్ల ను ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. చిత్ర నిర్మాత అతిక రహిమాన్ మాట్లాడుతూ మన తెలుగు రాష్ట్రాల్లో మాదకద్రవ్యాల వినియోగం ఎక్కువగా ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థులపై దీని ప్రభావం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో చిన్న వయసులోనే విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. వాటి నిర్మూలనకు ఎన్నో చిత్రాలు ఉద్భవిస్తున్నాయని అందులో ఈ సినిమా ఒకటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎం ఎం బాల, కో డైరెక్టర్ హబీబా, హెచ్బిఆర్ టీవీ సీఈఓ కుమారస్వామి, డాక్టర్ శివరాం రెడ్డి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## షాద్ నగర్ డిసిపిగా సి. హెచ్ శిరీష

**ప్రభుత్వం పలువురు అధికారులను బదిలీ చేస్తూ సి ఎస్ ఉత్తరులను జారీ చేసారు**



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, జనవరి 8 :-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డిసిపి) అధికారిగా సిహెచ్ శిరీషను ప్రభుత్వం నియమించింది ప్రభుత్వం పలువురు అధికారులను బదిలీ చేస్తూ సి ఎస్ ఉత్తరులను జారీ చేశారు ఇందులో భాగంగా ఇటీవల ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ నూతన పరిధిలోకి వచ్చిన షాద్ నగర్ ప్రాంతాన్ని డిసిపి కార్యాలయంగా ఏర్పాటు చేశారు ఇందులో భాగంగానే డిసిపి అధికారిని ప్రభుత్వం నియమించింది ఇంటలిజెన్స్ విభాగంలో నాన్ క్యాడర్ ఎస్పీగా పనిచేస్తున్న శిరీషను షాద్ నగర్ డిసిపిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు అదేవిధంగా హైదరాబాద్ సౌత్ రేంజ్ అడిషనల్ కమిషనర్గా తస్వీర్ ఇక్బాల్, హైదరాబాద్ నార్త్ రేంజ్ జాయింట్ సీపీగా శ్వేత, కుత్బుల్లాపూర్ జోన్ డీసీగా కోటిరెడ్డి, మహేశ్వరం జోన్ డీసీపీగా నారాయణరెడ్డి, సికింద్రాబాద్ జోన్ డీసీపీగా రక్షతామూర్తి, ఉప్పల్ జోన్ డీసీపీగా సురేష్, చార్మినార్ జోన్ డీసీపీగా కిరణ్ ఖరే, ఎల్బీనగర్ జోన్ డీసీపీగా అనురాధ, ఖైరతాబాద్ జోన్ డీసీపీగా శిల్పవల్లి, గోల్కొండ జోన్ డీసీపీగా చంద్రమోహన్, జూబ్లీహిల్స్ జోన్ డీసీపీగా రమణారెడ్డి, శంషాబాద్ జోన్ డీసీపీగా రాజేష్ లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## నెల్లికొండి, సీతారాంపేట గ్రామాల యువకులకు క్రికెట్ కిట్ అందజేసిన: ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి



**చిన్న చింతకుంట జనవరి 8 (స్కై న్యూస్);** చిన్న చింతకుంట మండలం నెల్లికొండి గ్రామంలో గురువారం గ్రామ పెద్దలు, యువకుల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించి, క్రికెట్ కిట్ అందజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి.అనంతరం సీతారాంపేట గ్రామానికి చెందిన యువకులకు క్రికెట్ కిట్ అందజేసి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రికెట్ ఆడి వాడిన గెలిచిన ఒకరిపై ఒకరు దూషణలు వేళనలు చేసుకోకుండా, సోదర భావం కలిగి ఉండాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ ఆడగల తో పాటు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లో వోల్టేజ్ సమస్యలను పరిష్కరించిన విద్యుత్ అధికారులు



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, జనవరి 8:-** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మున్సిపల్ పట్టణ కేంద్రంలోని మల్లికార్జున నగర్, విశ్వబ్రాహ్మణ, రెడ్డి కాలనీ వాసులు గత కొన్ని రోజులు లో వోల్టేజ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడి చాలా వరకు ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి కాలనీ వాసులు లో వోల్టేజ్ సమస్యపై పలుమార్లు విద్యుత్ అధికారులకు చెప్పిన పట్టించుకోలేదు ఈ విషయంపై చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారి శైలజాఆగిరెడ్డి పి ఏ సి ఎస్ చైర్మన్ దేవర వెంకటరెడ్డి స్పందించి వోల్టేజ్ సమస్యను తీర్చేందుకు విద్యుత్ అధికారులతో మాట్లాడి కొత్త ట్రాన్స్ ఫార్మర్ వేయించారు ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసే దిమ్మెను మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి స్వంత డబ్బులతో కట్టించారు లో వోల్టేజ్ సమస్య తీర్చినందుకు కాలనీ మాజీ సర్పంచ్ ను అభినందించారు, ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

## అందరికీ ఆరోగ్యం కాంగ్రెస్ సంకల్పం

**సీఎం సహాయ నిధి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**మొత్తం 63,02,500 లక్షల విలువైన చెక్కుల అందజేత**



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, జనవరి 8:-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అందజేశారు కొందుర్గు మండలానికి సంబంధించి 30 మంది లబ్ధిదారులకు రూ.3.61 లక్షలు, ఫరూక్ నగర్ మండలానికి సంబంధించి 68 మంది లబ్ధిదారులకు 27.35 లక్షలు, షాద్ నగర్ పట్టణ పరిధిలో 48 మంది లబ్ధిదారులకు 20.01 లక్షలు, జిల్లేడు చౌదరిగుడా మండలంలో 29 మంది లబ్ధిదారులకు 9.46 లక్షలు ఇతరత్రా ఆరు మంది లబ్ధిదారులకు 2.59 లక్షలు కలిపి మొత్తం 63.02.500 లక్షల విలువైన చెక్కులను ఆయన అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ ఆరోగ్యాన్ని అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళు తుందని, ఒక గొప్ప సంకల్పంతో సీఎం సహాయ నిధి చెక్కులను అనారోగ్యంతో బాధపడే వారికి అందిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు నిరుపేదలు తమ ఆరోగ్య సమస్యలకు సంబంధించి కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకునేందుకు ప్రభుత్వం ఈ సహాయాన్ని చెక్కులను అందిస్తుందని వెల్లడించారు దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు ఈ చెక్కులను చిలకమర్రి సర్పంచ్ రవీందర్ రెడ్డి, అదేవిధంగా పట్టణంలోని 18 వ వార్డులో తంగేళ్లపల్లి శంకర్ జమాల్పూర్ చందూలాల్ కత్తి చంద్రశేఖర అప్ప నవీన్ రెడ్డి రేవల్లి పండరినాథ్ కొప్పు ప్రేమలత పట్లవత్ సువర్ణ తదితరులు చెక్కులు అందుకున్న వారిలో ఉన్నారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, చెంది తిరుపతిరెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, రఘు నాయక్,ఎం డి. ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు సేవా కార్యక్రమాలతోనే సార్థకత

**జె ఎస్ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సతీష్ రెడ్డి**





**నాగర్ కర్నూల్ జనవరి 8 (స్కై న్యూస్)** ప్రతి ఒక్కరూ సంపాదించిన వాటిలో వృద్ధులకు సేవలు అందించడానికి ఖర్చు చేయడం వల్ల జన్మకు సార్థకత ఏర్పడుతుందని జేఎస్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ జమ్ముల సతీష్ రెడ్డి అన్నారు గురువారం మండల పరిధిలోని గగ్గలపల్లి గ్రామంలో వృద్ధులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జే ఎస్ ఆర్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు చేయూతనివ్వడంతో పాటు సామాజిక వర్గాలకు ఉన్నత విద్యను అందించేందుకు ఆర్థిక సాయం చేయడం జరుగుతుందని తెలిపారు. జన్మనిచ్చిన గ్రామానికి సేవలు అందించేందుకు ఫౌండేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని కవులు కళాకారులను ప్రోత్సహించడంతోపాటు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రోత్సాహకాన్ని అందించేందుకు సంస్థ కృషి చేస్తుందన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సేవా దృక్పథన్ని అలవర్చుకొని ఆదుకోవడం ద్వారా పేదల గుండెల్లో చిరస్మరణీయంగా నిలవడం సాధ్యమవుతుందని అన్నారు. వృద్ధుల దీవెనలు ఎన్ని లక్షలు పెట్టినా దొరకవని అన్నారు ఈ సందర్భంగా 250 మంది వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేయడం జరిగిందని వివరించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉషారాణి ఉపసర్పంచ్ ఉమార్ పాషా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్ల ఈశ్వర్ రెడ్డి గ్రామస్తులు గడ్డంపల్లి మధు శాంత కుమార్ జయకృష్ణ రామచంద్రారెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## నేడు శ్రీ తిమ్మప్ప స్వామి దేవాలయం హుండీ లెక్కింపు



**మల్దకల్, జనవరి 8 (స్కై న్యూస్):**ఆదిశిలా క్షత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గత నెలలో జరిగిన బ్రహ్మోత్సవాలకు అనంతరం దేవాలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమం శుక్రవారం ఉదయం 10:30 గంటలకు జరుగుతుందని దేవాలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీకృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాద రావు, ఈవో సత్య చంద్రారెడ్డి తెలిపారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే హుండీ లెక్కింపులో అభిలాష ఆధ్వర్యంలో సేవాసమితి సభ్యులు దేవాదాయ సిబ్బంది భక్తుల ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరుగుతుందని తెలిపారు.

**ఆదిశిల క్షత్రంలో ధనుర్మాస పూజలు**

ఆదిశిల క్షత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాస పూజలు జరుగుతున్నాయని ఆలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీకృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాద రావు, ఈవో సత్య చంద్రారెడ్డి తెలిపారు. ఉదయం 4:30 గంటలకు అభిషేకాలు పూజలు అనంతరం పొంగలి నైవేద్యం సమర్పిస్తున్నట్లు వారు తెలిపారు. మకర సంక్రాంతి ఈనెల 14న బోగి 15న సంక్రాంతి నిర్వహిస్తున్నట్లు స్వామివారిని దర్శించుకుని భక్తులు తరించాలని వారు కోరారు.

## ఉపాధ్యాయులకు వెంటనే ఆర్థిక ప్రయోజనాలు కల్పిం చాలి

**బిపి ఆర్ టి యు కార్యదర్శి జహిరొద్దిన్**




**నారాయణపేట జనవరి 8: (స్కైన్యూస్)** ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని పి ఆర్ టి యు కార్యదర్శి జహిరొడ్డిన్ కోరారు. గురువారం నారాయ ణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పిఆర్టియు టీఎస్ 2026 క్యాలెండర్లను పట్టణ ప్రధాన కార్యదర్శి జహీరోద్దీన్ ఆధ్వ ర్యంలో పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ ప్రధాన కార్యదర్శి జహీరోద్దీన్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థిక ప్రయోజనాలు అయిన డీఏలు, పిఆర్సి, సరెండర్ బిల్లులు, జిపిఎఫ్ బిల్లులు, మెడికల్ బిల్లులు సకాలంలో రాకపోవడం వలన ఉద్యోగ ఉపాధ్యాయులు ఆర్థిక ప్రయోజనాలతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2021 మార్చిలో గత ప్రభుత్వము ఆలస్యముగా పి ఆర్ సి ప్రకటించింది ఇప్పటికీ పి అర్ సి గడువు ముగిసి రెండున్నర సంవత్సరాలు దాటిపోయింది ఇప్పటికే ఐదు డిఏలు పెండింగ్లో ఉన్నాయి దీని కారణంగా పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా జీతభత్యాలు పెరగకపోవడం వల్ల ఉపాధ్యాయులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు వాపోయారు.రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయకుండా వెంటనే పి ఆర్సి ప్రకటించి పెండింగు డీఏ లు అన్ని ఏకకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం జయంతు, దత్తు రావు, నరేష్, వినోద్ కళ్యాణి, వసంత రావు తదితరులు పాల్గొన్నారు.

వార్తాతరంగాలు శుక్రవారం 09 జనవరి 2026

## ప్రజల సౌకర్యానికే సిసి రోడ్లు నిర్మాణం

### కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సురేష్



**నాగర్ కర్నూల్ జనవరి 8 (స్కై న్యూస్)** స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి ప్రజల సౌకర్యం కోసమే పలు కాలనీలలో సిసి రోడ్డు నిర్మాణ పనులను మంజూరు చేయించడం జరిగిందని 9వ వార్డు పార్టీ ఇంచార్జ్ మిడిదొడ్డి సురేష్ తెలిపారు గురువారం కాలనీలో నిర్మిస్తున్న రహదారి పనులను నాయకులతో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ల సహకారంతో వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఇంటింటికి సిద్ధమైన తాగునీటిని అందించడంతో పాటు రహదారుల నిర్మాణం విద్యుత్తు లైట్ల ఏర్పాటు పనులను పూర్తి చేయడం జరిగిందని వివరించారు ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పార్టీ నాయకులు గణేష్ మురళీధర్ రావు తదితరులు పాల్గొన్నారు

## అమ్మ తల్లి టీకాలతో రోగ నిరోధక శక్తి



**నాగర్ కర్నూల్ జనవరి 8 (స్కైన్యూస్)** రాష్ట్ర ప్రభుత్వం గొర్రెలలో రోగ నిరోధక శక్తిని పెంచేందుకు ఉచితంగా అమ్మ తల్లి టీకాలను పంపిణీ చేయడం జరుగుతుందని అందులో భాగంగా గురువారం మండల పరిధిలోని తూడుకుర్తి మంతటి గ్రామాలలో శిబిరాలను నిర్వహించడం జరిగిందని మండల పశు వైద్యాధికారులు డాక్టర్ టీ కల్పన పి అశోక్ తెలిపారు. ఈ టీకాల వల్ల గొర్రెలకు రోగ నిరోధక శక్తి పెరిగి గొర్రెలకు వైరస్ సోకకుండా వ్యాధి తీవ్రతను తగ్గిస్తుందని తెలిపారు. టీకాలు వేయడం ద్వారా వ్యాధి నివారణ రక్షణ ఆర్థిక నష్టాన్ని తగ్గించడం జరుగుతుందని వివరించారు ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది మాధ్య నాయక్ శ్రీశైలం వినయ్ మక్బూల్ సతీష్ కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు

## మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ: సర్పంచ్ శివకుమార్



**చిన్న చింతకుంట జనవరి 8 (స్కై న్యూస్);** చిన్న చింతకుంట మండల పరిధిలోని పర్దిపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ముందు గురువారం ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన చీరలను గ్రామ సర్పంచ్ తెలుగు శివకుమార్, ఉప సర్పంచ్ బాబు తో పాటు గ్రామ పెద్దలు కాంగ్రెస్ నాయకులు కలిసి మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఒకటవ వార్డు గోరేమియా ఇంటి సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్ డ్యామేజ్ కావడంతో ఆ ప్రాంత ప్రజలకు తాగు నీళ్ల సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే సర్పంచ్ స్పందించి పైపులైన్ రిపేర్ చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కురుమన్న, రమేష్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ తెలుగు రమేష్, మండల నాయకులు తెలుగు వెంకటేష్ , గంగాల ఆనంద్, వార్డు సభ్యులు ఖాదర్ గ్రామపెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పర్యావరణానికి మొక్కలు నాటాలి

### 12న పారిశుద్ధ కార్మికులకు ముగ్గుల పోటీలు

### డిప్యూటీ సూపర్డెంట్ డాక్టర్ వి. శేఖర్



**నాగర్ కర్నూల్ జనవరి 8 (స్కై న్యూస్):**సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ప్రత్యేకంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు డిప్యూటీ సూపర్డెంట్ డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. ఆస్పత్రి ఆవరణ శుభ్రతతో పాటు పచ్చదనం ఉండేందుకు పలు మొక్కలను ఖాళీ స్థలాలలో వైద్యులు,డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వి.శేఖర్ నాటారు.ఆసుపత్రి కి వచ్చే రోగులకు ఇబ్బందులు కలగకుండా అన్ని వార్డులలో శుభ్రత పాటింపు పై ప్రత్యేక చర్యలు చేపట్టారు. ముఖ్యంగా ఓపి మరియు ఐ.పి విభాగాలు శుభ్రంగా ఉండాలని ఆయన సూచించారు.ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో పారిశుధ్య సేవలందిస్తున్న కార్మికులకు,సిబ్బందికి ఈ నెల 12న సోమవారం నాడు ముగ్గుల పోటీలు నిర్వహించి ప్రథమ,ద్వితీయ,తృతీయ స్థానాలలో గెలుపొందిన వారికి నగదు పారితోషికం అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రాణి దేవి, నర్సింగ్ అధికారి ఆనంద్, హెల్ప్ డెస్క్ ఇంచార్జ్ యాదగిరి, సానిటేషన్ సిబ్బంది నాగరాజు, మహేష్,శేఖర్,రాజు,రాజశేఖర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులో ఉంటూ విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

### ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి



**నాగర్ కర్నూల్ జనవరి 8 (స్కై న్యూస్)** విద్యుత్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎక్కడ విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి కోరారు గురువారం జిల్లా కేంద్రంలోని ఎనిమిదవ వార్డులో నిర్వహించిన ప్రజా బాట కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు ఆయనను సన్మానించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షమానికి ప్రజాపాలనను అందించడం జరుగుతుందని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం సబ్ స్టేషన్లను మంజూరు చేయడం జరిగిందని కావలసిన స్టోర్ రూము నిర్మాణం చేపట్టడానికి నిధులను మంజూరు చేయించడం జరిగిందని ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే అధికారులతో చర్చించి కావలసిన మెటీరియల్ ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో డీఈ శ్రీధర్ శెట్టి ఏడిఏ శ్రీనివాస్ ఏ ఈ మాన్య నాయక్ తో పాటు రామ్ చందర్ నాయక్ తో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు

# షాద్ నగర్ ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్ నగర్ లో రూ. 40.50 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**షాద్ నగర్ వార్డుల్లో ఎమ్మెల్యే భారీ బైక్ ర్యాలీ**

**పలు వార్డుల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభివృద్ధి పనులు**







ఎన్నికలు వచ్చినట్లు పండగ వాతావరణాన్ని తెచ్చినట్లు మున్సిపాలిటీలో ఎక్కడ చూసినా సందడి మూడు రంగుల జెండా పట్టి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెంట నేతలు, కార్యకర్తలు తండోపతండాలుగా కదలి రాగా పలు వార్డుల్లో ప్రగతి పనులు ప్రారంభమయ్యాయి ఆయా పనులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు మొత్తం 40.50 కోట్ల రూపాయలు ప్రభుత్వం వివిధ అభివృద్ధి పనులకు మంజూరు చేయగా ఈ సందర్భంగా గురువారం మొత్తం 11 కోట్ల రూపాయలతో పనులు ఆయా కాలనీలలో పనులు ప్రారంభించారు ప్రభుత్వం టీడీఎస్ 18 కోట్లు, సిడిఎంఏ 3 కోట్లు, యూఐడీఎఫ్ నిధులు, మూడు కోట్లు సీఎం నిధులు, 75 లక్షలు టీయూ ఎఫ్ ఐ డి సి నిధులు ఉన్నాయి ఆయా నిధులతో పట్టణంలోని తొమ్మిదవ వార్డులో రూ.3.04 కోట్లతో రెండు సిసి రోడ్లు, భగీరథ కాలనీ పార్కు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అదేవిధంగా 26వ వార్డులో రూ. 46.41 లక్షలతో సిసి రోడ్డు పనులను, అదేవిధంగా 25 లక్షలతో పార్కు పనులను ప్రారంభించారు 19వ వార్డులో రూ.22.95 లక్షలతో సిసి రోడ్డు పనులు ప్రారంభించగా, 27 వార్డులో 69.70 లక్షలతో మరో సిసి రోడ్డును ప్రారంభించారు ఇక 15వ వార్డులో చాలా కాలంగా అర్ధాంతరంగా నిలిచిపోయిన కమ్యూనిటీ భవనానికి ప్రత్యేకంగా 18 లక్షలు కేటాయించి నిర్మాణం పనులను మొదలుపెట్టారు 12 వ వారర్ లోను రూ.25.76 లక్షలతో సిసి రోడ్డు పనులను మొదలుపెట్టారు ఈ సందర్భంగా నాయకులు పెద్ద ఎత్తున హాజరు కావడంతో కాలనీలలో పండగ వాతావరణం నెలకొనడం విశేషం షాద్ నగర్ ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే తన ముందున్న లక్ష్యం అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు పట్టణంలో వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వార్డుల వారీగా వివిధ అభివృద్ధి పనులు చిత్తశుద్ధితో చేపడుతున్నట్లు వెల్లడించారు గత ప్రభుత్వాన్ని నిర్లక్ష్యం వల్ల పురపాలికలో పలు వార్డులు సమస్యల వలయంలో అల్లాడుతున్నాయని, నాసిరకం రహదారులు నిర్మించి కాలనీలలో ఇబ్బందులు సృష్టించారని వెల్లడించారు పురపాలికలు అనుకున్న అభివృద్ధి సాధించడానికి అవసరమైన నిధులను క్రమమైన విధానంలో తీసుకొస్తున్నానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు ప్రతివార్డుకు అవసరం మేరకు నిధులు తెచ్చి వార్డులను తీర్చిదిద్దుతానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, మజు మున్సిపల్ చైర్మన్ విశ్వం, రఘునాయక్, జమ్రుద్ ఖాన్, ఇబ్రహీం, అగునూరు బస్వం, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు అదేవిధంగా షాద్ నగర్ పట్టణంలో గురువారం కాంగ్రెస్ పార్టీ నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు స్థానిక మైనార్టీ నేత జమ్రుద్ ఖాన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున యువత వందలాదిగా బైక్ ర్యాలీ చేపట్టడంతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బైక్ పై ఆయా వార్డుల్లో ప్రయాణించి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.

# అస్సాంలో నిలువు రాళ్ళను పస్తిన కున్సి ఉపాధ్యాయుడు నరేందర్



**నారాయణపేట జనవరి 8: (స్కైన్యూస్)** మాగనూర్ మండలంలోని ముడుమాల నిలువు రాళ్ల విశిష్టతను పి ఎం శ్రీ కున్సి పాఠశాల స్కూల్ అసిస్టెంట్ నరేందర్ చక్కగా వివరించి ప్రసస్తాన్ని చాటారు.గురువారం అస్సాం రాష్ట్రంలోని గువహతిలో నిర్వహించిన సాంస్కృతిక, ప్రకృతిక వారసత్వ పరిరక్షణ లో పాఠశాలల పాత్ర అనే జాతీయస్థాయి శిక్షణ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ పీఎంశ్రీ జడ్ పి హై స్కూల్, కున్సికు చెందిన స్కూల్ అసిస్టెంట్ నరేందర్ తెలంగాణపై విస్తృత ప్రెసెంటే షన్ ఇచ్చారు.ఈ ప్రెసెంటేష న్లో తెలంగాణ రాష్ట్రం భౌగోళిక స్వరూపం, చారిత్రక ప్రాధాన్యం, ఆర్థిక అభివృద్ధి, సామాజికఉసాంస్కృతిక వైవిధ్యాలను స్పష్టమైన ఉదాహరణలతో వివరించా రు. గోదావరి, కృష్ణ నదీ వ్యవ స్థలు, పీఠభూమి స్వభావం, వ్యవసాయ ఆధారిత జీవన విధానం తెలంగాణ ప్రత్యేకత లుగా ప్రస్తావించారు.ప్రత్యేకంగా మన ప్రాంత వారసత్వ సంపద అయిన ముడుమాల్ నిలువురాళ్లు ప్రాచీన మానవ నాగరికతకు సాక్ష్యలుగా నిలుస్తున్నాయ ని, వాటిని భవిష్యత్ తరాల కు పరిరక్షంచాల్సిన బాధ్యత పాఠశాలలదేనని పేర్కొన్నా రు. అలాగే వేల సంవత్సరాల చరిత్ర కలిగిన పిల్లలమర్రి వంటి ప్రకృతిక వారసత్వ సంపదలు పర్యావరణ పరిరక్షణకు ప్రతీకలుగా నిలుస్తాయని వివరించారు. హైదరాబాద్ నగరం ఐటీ హబ్‌గా, విద్యాఉవైద్య రంగా ల్లో అంతర్జాతీయ స్థాయిలో సాధించిన అభివృద్ధిని వివరించారు. చార్మినార్, గోల్కొండ కోట, రామప్ప దేవాలయం, కాళేశ్వరం ప్రాజెక్టు వంటి తెలంగాణ పర్యాటక వారసత్వ క్షత్రాలు రాష్ట్ర గర్వకారణాలని ప్రస్తా వించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతి, పండు గలు, కళారూపాలు, జానపద సంప్రదాయాలపై చేసిన వివర ణ ఇతర రాష్ట్రాల ప్రతినిధుల ను విశేషంగా ఆకర్షించింది. తెలంగాణ రాష్ట్రానికి ప్రాతి నిధ్యం వహిస్తూ, ఒక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా జాతీయ వేదికపై రాష్ట్ర గొప్ప తనాన్ని తెలియజేయడం గర్వకారణమని నరేందర్ తెలిపారు.ఈ సందర్భంగా ఈ అవకాశాన్ని కల్పించిన జిల్లా విద్యాధికారి గోవిందా రాజు లు , అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ విద్యాసాగర్, మండ ల విద్యాధికారి నిజముద్దీన్, పీఎంశ్రీ జడ్ పి హై స్కూల్, కున్సి ప్రధానోపాధ్యాయులు సంతోష లకు నరేందర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# క్షణం నిర్లక్ష్యం ...జీవితాలు ఆగం

### జిల్లా జడ్జి బోయ శ్రీనివాసులు



**నారాయణపేట జనవరి 8:( స్కైన్యూస్)**ఒక క్షణం నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తే నిండు ప్రాణం బలి అయి ఆ కుటుంబాలకు తీవ్ర విషాదం జీవితాలు ఆగం అవుతాయని నారాయణపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు అన్నారు.గురువారం తెలంగాణ లీగల్ సర్వీసెస్ సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవా అధికారి సంస్థ ఆధ్వర్యంలో ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు ఆన్ రోడ్ సురక్ష అభియాన్ స్పెషల్ క్యాంపె యిన్ పై ర్యాలీ నిర్వహిం చారు.ఈ ర్యాలీ జిల్లా కోర్ట్ నుంచి సత్యనారాయణ చౌరస్తా వరకు నిర్వహించా రు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు మాట్లాడుతూ ఒక క్షణం నిర్లక్ష్యంగా వ్యవహా రిస్తే నిండు ప్రాణం బలి అవు తుందన్నారు. రోడ్డు నియమా లు మీ ప్రాణాలు కుటుంబాల భవిష్యత్తుని కాపాడేందుకు రూపొందించారని గుర్తు చేశారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధ నల ప్రసంగం నియమాలు స్వేచ్ఛను పరిమితం చేయ వని అన్నారు. ప్రాణాలను కాపాడతాయని నొక్కి చెప్పా లనీ సిగ్నల్‌లను పాటించ డం, వేగ పరిమితులు, హెల్మెట్‌లు,సీట్‌బెల్ట్‌లు ధరించడం వంటి ముఖ్య అంశాలను హైలైట్ చేయాలన్నారు. అదే సమయంలో ఫోన్లు, మద్యం తాగి వాహనాలు నడపడం ఆకస్మిక విన్యాసాలు వంటి అంతరాయాలను నివారిం చాలన్నారు,క్రమశిక్ష ణ అవగాహన ద్వారా డ్రైవర్లు, ప్రయాణీకులు పాదచారులకు సురక్షతమైన రోడ్లను సృష్టించాలన్నారు, తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీస్ అథరిటీ రూపొందించిన ప్రమాణ పత్రా న్ని చదివి విద్యార్థుల చేత ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివి ల్ జడ్జి వింధ్య నాయక్, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.ప్రభాకర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే.సురేష్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే.లక్ష్మిపతి గౌడ్, ట్రాఫిక్ ఎస్.ఐ కృష్ణ చైతన్య, సీనియర్ జూనియర్ అడ్వకేట్స్ , న్యాయశాఖ సిబ్బంది, శ్రీ సాయి స్కూల్, లిటిల్ స్టార్స్ స్కూల్, రవితేజ స్కూల్ విద్యార్థులు ప్రభుత్వ స్కూల్స్ ఉపాధ్యాయులు, పోలీసులు ఆధికారులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల జిపిఎఫ్ సమస్యలు త్వరలో పరిష్కారం

### పిఆర్టియు జిల్లా అధ్యక్షులు వై జనార్ధన్ రెడ్డి



**నారాయణపేట జనవరి 8: (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లాలో పనిచేస్తూ సాంకేతిక కారణాల వలన ఇబ్బందులు ఉన్న ఉపాధ్యాయుల జిపిఎఫ్ సమస్యలు త్వరలో పరిష్కరించాడం జరుగుతుందనీ పి ఆర్ టి యు నారాయణపేట జిల్లా అధ్యక్షుడు వై.జనార్ధన్ రెడ్డి తెలిపారు. అందు కోసము గురువారం మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని జెడ్పి జిపిఎఫ్ కార్యాలయముకు వెళ్లి అక్కడ సిబ్బంది ద్వారా ఉపాధ్యాయుల సమస్యల మీద చర్చించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కార్యాలయం సూపరిండెంట్ మాట్లాడుతూ నారాయణపేట జిల్లాకు సంబంధించిన సాంకేతిక కారణాలవల్ల 317 జీఓ ద్వారా గద్వాల జిల్లాకు వెళ్లిన కార్డులను, మహాబూబనగర్ లో ఉన్నటువంటి కార్డులను పరిశీలించి వెంటనే నారాయ ణపేట జిల్లాకు బదిలాయిం పు చేస్తామని అన్నారు.అదేవి ధంగా స్పపుస్ జిహెచ్ఎం లుగా ప్రమోషన్ పొందడం ద్వారా నారాయణపేట జిల్లా నుండి మహబూబ్నగర్ జిల్లాకు వచ్చిన 104 మంది ఉపాధ్యాయుల కార్డులను మహబూబ్నగర్కు వచ్చే విధంగా పి ఆర్ టి యు సంఘం సహకరించాలని వా కోరారు.అలాగే మహబూ బ్నగర్ జిల్లాలో పనిచేస్తూ మూచువల్ ద్వారా నారాయణపేట జిల్లాకు వచ్చి రిటైర్డ్ అయిన ఉపాధ్యాయు ల ఫైనల్ పేమెంట్ త్వరగా వచ్చేలా చేసి నారాయణ పేటకు పంపిస్తామని తెలిపారు. జిల్లా ఏర్పడి ఆరు సంవత్సరాలైనా ఇంకా ఉమ్మ డి జిల్లా కేంద్రంలో మొత్తం ఖాతాలు నిర్వహించడం వల్ల ఇబ్బంది అవుతుందని నారాయణపేట జిల్లాకు చెందిన కార్డులను 600 కార్డులను వాటికి సంబంధించిన డబ్బులను వడ్డీతో సహ నారాయణపేట జిల్లాకు పంపాలని జనార్ధన్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణపే ట మండల అధ్యక్షులు ఎం రఘువీర్ కృష్ణా మండల అధ్యక్షులు దండు శేఖర్ పాల్గొన్నారు.

# 30 కోట్ల ప్రభుత్వ భూమి హాంఫట్

**దమ్మైగూడ ప్రాంతంలో 30 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా**

**హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు శూన్యం**

**ప్రభుత్వ భూమి 3 ఎకరాల 14 గుంటల కబ్జా చేస్తున్న వారికి అధికారుల అండన లేక ఇతరుల అండన అన్న అనుమానం**

**ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలకు స్థలం లేని కార్యాలయాలు రాష్ట్రంలో ఎన్నో ఉన్నాయి**






**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి జనవరి 8 (స్కై న్యూస్):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కీసర మండల పరిధి దమ్మైగూడ మునిసిపల్ పరిధిలో ఉన్నటువంటి సర్వే 504 లో 3 ఎకరాల 14 గుంటల ప్రభుత్వ భూమిని కబ్జాదారులు కబ్జా చేసిన వైనమని, నామమాత్రానికి సూచిక బోర్డు ఏర్పాటు చేశారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనాథ్ గౌడ్ అన్నారు. కీసర మండల పరిధిలోని దమ్మైగూడ మునిసిపల్ పరిధిలోని సర్వే 504 లోని 3 ఎకరాల 14 గుంటల భూమి గతంలో దమ్మాయిగూడ వాసులు ఇక్కడ చనిపోయిన వారిని పూడ్చి పెట్టుటకు బొందల గడ్డ కోసము ప్రభుత్వ స్థలం వినియోగించుకున్నారని అది ఇప్పుడు కబ్జాకు గురి అయిందని ఆయన అన్నారు. ఈ స్థలం విలువ 30 కోట్ల రూపాయలు ప్రస్తుతం విలువ ఉంటుందని, బొందలు ఉన్న స్థలంలో చుట్టూ ప్రహరీ గోడ పెద్దగా నిర్మించి మూడు ఎకరాల 14 గుంటల భూమిని కబ్జా చేస్తున్నారని అధికారులు నామమాత్రానికి సూచిక బోర్డు ఏర్పాటు చేశారని ఆయన ఎద్దేవ చేశారు. ఈ కబ్జాకు అధికారులు సహకరిస్తున్నారు అంటూ పెద్ద మొత్తంలో ముడుపులు ఇచ్చారన్న అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమి 3ఎకరాల 14 గుంటల భూమి కబ్జాకు గురి అవుతున్న ప్రస్తుత సమయంలో ఎందుకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో మాకు అర్థం కావడం లేదు అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 30 కోట్ల రూపాయల ప్రభుత్వ భూమిని కబ్జా దారులకు దోచిపెడుతున్న కీసర మండల అధికారులు అంటూ పెద్ద ఎత్తున శ్రీనాథ్ గౌడ్ ఆరోపిస్తున్నారు. హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు లేవని, ఈ ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేసేందుకు కుట్ర చేసిన వారికి అధికారులు సహకరిస్తున్నారా అన్న అనుమానం మాకు వస్తుందని ఎమ్మార్వో కు, హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోక పోవడం గల కారణాలు ఏంటో మాకు అర్థం కావడం లేదు అంటూ ఆయన అన్నారు. దీనిపై వెంటనే ప్రభుత్వం దృష్టి పెట్టి 30 కోట్ల రూపాయల విలువైన భూమిని కాపాడాలని, ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిని తమ ఆధీనంలోకి తీసుకోవాలని ఆయన కోరారు. ఇంత విలువైన ప్రభుత్వ భూమిని కాపాడుతారా అధికారులు గాలికి వదిలేస్తారా అన్న అనుమానం ఆయన వ్యక్తం చేశారు.

# గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి....

**ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి**




**నాగర్ కర్నూల్ జనవరి 8 (స్కై న్యూస్)** గ్రామాలను తీర్చిదిద్దేందుకు అందుబాటులో ఉంటూ అందరినీ కలుపుకుపోయి ముందుకు సాగాలని ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి కోరారు గురువారం జిల్లా కేంద్రంలోని ఒక గార్డెన్ లో ఏర్పాటు చేసిన స్థానిక ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అందరినీ సమాన దృష్టితో తమ నిధులను మంజూరు చేస్తామని వాటిని సద్వినియోగం చేసుకొని గ్రామాల అభివృద్ధికి దోహదం చేయాలని కోరారు. రాబోయే ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలలో పార్టీ విజయానికి సర్పంచులు ఉపసర్పంచులు వార్డు సభ్యులు కృషి చేయాలని కోరారు. గ్రామాలలో గత రెండు సంవత్సరాలుగా చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల వల్ల పార్టీ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించారని గ్రామాలలో సంక్షేమ పథకాలను మరింత పకడ్బందీగా అమలుచేసి గ్రామ స్వరాజ్యాన్ని తీసుకువచ్చేందుకు రాజకీయాలకు అతీతంగా కృషి చేయాలని కోరారు. రాబోయే మునిసిపల్ ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలలో విజయం సాధించి అన్ని జిల్లా పరిషత్ చైర్మన్ లను కైవసం చేసుకునే దిశగా పనిచేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కొత్తపల్లి వినోద్ ఆర్టీవో డైరెక్టర్ గోపాల్ రెడ్డి వివిధ మండలాల అధ్యక్షులు మాజీ ఎంపీపీలు జడ్పిటిసిలు మాజీ కౌన్సిలర్లు పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు

# జిహెచ్ఎంసి విస్తరణ లో స్తంభించిన పాలన

**సిబ్బంది కొరతతో జిహెచ్ఎంసి లో ఇబ్బంది పడుతున్న ఉన్నతాధికారులు**

**స్తంభించిన పాలను అదును చూసుకున్న అక్రమ నిర్మాణాదారులు**

**కాప్రా బఫర్ జోన్ లో అక్రమ నిర్మాణం కూల్చివేతలు చేసిన కొనసాగింపు**

**అక్రమ నిర్మాణాలకు చైర్మెన్ ల సహకారం ఎక్కువ అధికారుల ఆదేశాలు తక్కువ**

**పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమ నిర్మాణాలు జోరు**

**ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం రోజు రోజుకి తగ్గుముఖం పడుతున్న అధికారుల్లో చలనం లేదంటున్న ప్రజలు**







**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి జనవరి 08 (స్కై న్యూస్):** గ్రేటర్ హైదరాబాద్ విస్తరణలో భాగంగా స్తంభించిన పాలనను అదను చూసుకున్న అక్రమ నిర్మాణదారులు చైర్మన్ ల సహకారం ఎక్కువ అధికారుల ఆదేశాలు తక్కువ అంటూ ఆరోపిస్తున్న స్థానికులు. వివరాల్లోకి వెళితే గ్రేటర్ హైదరాబాద్ విస్తరణలో భాగంగా ఉప్పల్ జోన్ కాప్రా, ఘట్కేసర్ సర్కిల్స్ పరిధిలో పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయని కాప్రా బఫర్ జోన్ లో నిర్మాణాలు కొనసాగిస్తు అధికారులకు సవాలుగా మారిన అక్రమ నిర్మాణదారులు పర్యవేక్షణ లేకపోవడంతో అది సాధ్యం అంటున్నా స్థానికులు. అక్రమ షెడ్ల నిర్మాణం, అక్రమ భవనాల నిర్మాణానికి అధికారులు ఆదేశాలు ఇవ్వకపోవడంతో చైర్మన్ ల సహకారంతో అక్రమ భవనాలకు పోలీసుల అండదండలు ఉన్నాయంటూ, ఇతర కమిషనర్ల అండదండలు ఉన్నాయంటూ కొన్ని నిర్మాణాలు ఇలా ఏదో సాకుగా చెబుతూ అక్రమ నిర్మాణాలకు చైర్మెన్లు సహకరిస్తున్నారంటూ పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయని స్థానికులు అంటున్నారు. ఫీల్డ్ ను పర్యవేక్షంచే చైర్మన్ ల సహకారం లేకపోతే అంత పెద్ద పెద్ద భవనాలు ఎలా పూర్తి అవుతాయని, వాళ్లకు ముడుపులు ముట్టకుంటే ఊరుకుంటారా అని స్థానికుల ఆరోపణలు వినిపిస్తున్న చైర్మెల సహకారం మెండుగా ఉందంటున్న స్థానికులు. అక్రమ నిర్మాణాల పై చర్యలు తీసుకోకపోవడం గల కారణాలు ఏంటో అర్థం కావడం లేదంటూ అధికారుల నిర్లక్ష్యమా, పర్యవేక్షణ లోపమా లేక పెద్ద మొత్తంలో ప్రభుత్వ ఖజానాను గండి కొడుతున్న వైనమా అన్నట్టు వ్యవహారం కొనసాగుతుందంటూ పెద్ద ఎత్తున స్థానికులు ఆరోపిస్తున్నారు. స్తంభించిన జిహెచ్ఎంసి పాలన కొనసాగే వరకు అక్రమ నిర్మాణాల పై చర్యలు అధికారులు తీసుకుంటారా ? లేక గాలికి వదిలేస్తారా ? అన్న ప్రశ్నకు సమాధానం లేకుండా పోతుందని, ప్రభుత్వానికి రావాల్సిన కోట్లాది రూపాయలు దోపిడికి గురి అవుతున్నాయని, ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వం చర్యలు ఉంటాయా అన్న ప్రశ్నకు సమాధానం ఇవ్వవలసింది ప్రభుత్వమే అంటు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# శ్రీకృష్ణ కాలచక్ర మహాయాగానికి విరాళం



**జోగులాంబ గద్వాల జనవరి 8 (స్కై న్యూస్):**గద్వాలలో శ్రీ కృష్ణ కాలచక్ర మహా యాగం కార్యక్రమాలు.విశ్వశాంతి మహా యజ్ఞాన్నికి తన వంతు సహాయంగా స్వామి శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద కు 50,000/- యాభై వేల రూపాయలు అందించిన యుగేందర్ అడ్వకేట్ గారు వారి కుటుంబ సభ్యుల పేరు మీద అందజేశారు.గద్వాలలో శ్రీ కృష్ణ కాలచక్ర మహా యాగం కార్యక్రమాలు నిర్వహిస్తున్న సందర్భంలో భాగంగా యుగంధర్ అడ్వకేట్ గురువారం రోజు విశ్వశాంతి మహా యజ్ఞానికి తన వంతు సహాయం గా స్వామి శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపనంద గారికి 50,000 యాభై వేల రూపాయలను ధర్మ కార్యానికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా యుగంధర్ అడ్వకేట్ వారి కుటుంబ సభ్యులకు కు స్వామి వారి ఆశీస్సులు కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నాము అని స్వామి వారు తెలిపారు.

# సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లను సన్మానించిన అడ్వకేట్ మందాడి సరోజ్ రెడ్డి



**దేవరకద్ర మూసాపేట జనవరి 8 (స్కై న్యూస్);** మూసాపేట్ మండలంలోని చక్రపూర్, అచ్చయపల్లి గ్రామపంచాయతీ ఎన్నికలలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు మెంబర్లుగా ఎన్నికైన అభ్యర్థులను సన్మానించిన హైకోర్టు అడ్వకేట్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మందడి సరోజ్ రెడ్డి. ఈ సందర్భంగా అడ్వకేట్ మాట్లాడుతూ గ్రామ ప్రజలతో మమేకంగా ఉంటూ ప్రజా సమస్యలను తక్షణమే తీర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్లపై ఉన్న ప్రమాద భరిత విద్యుత్ స్తంబాలను మార్చిన 17 వ వార్డు కౌన్సెలర్ సర్వర్ పాషా



రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ లోని 17 వ వార్డు నెహ్రూ కాలనీ అంటేనే అభివృద్ధి కి నోచుకోక వెనుకబడి ఉండేది కాలం చెల్లిన కరెంటు వైర్లు, విద్యుత్ స్తంబాలు, ఒకే స్తంబానికి అల్లుకోపోయిన విధ్యుత్ తీగలు ప్రమాద కరంగా ఉండేవి కాలనీలో రోడ్లు సరిగ్గా లేక వచ్చిపోయే వాహనదారులకు, కాలనీవాసులకు ఇబ్బందికరంగా ఉండేది ఎంతోమంది 17 వ వార్డు లో గతంలో వార్డు మెంబెర్స్ నుండి కౌన్సెలర్ గా చేసిన అభివృద్ధి మాత్రం అంతంత మాత్రమే కానీ ఇప్పుడు కౌన్సెలర్ సర్వర్ పాషా వచ్చాక 17 వ వార్డు నెహ్రూ నగర్ కాలనీ రూపురేఖలు మారిపోయాయి అభివృద్ధి అంటే ఇలా ఉండాలి అని ఇప్పుడు 17 వ వార్డు ను చూసి షాద్ నగర్ మున్సిపాలిటీ లోని మిగతా కాలనీవాసులు ఒకింత ఆశ్చర్యానికి గురువవుతూ అభివృద్ధి అంటే ఇది అనే స్థాయికి కౌన్సెలర్ సర్వర్ పాషా ను కొనియాడుతున్నారు ఇప్పుడు కాలనీ లో ఏ గల్లీలో చుసిన సీసీ రోడ్లు అండర్ డ్రైనేజీ పనులు, ఇంటింటికి నల్ల, ప్రతి వీధిలో విద్యుత్ దీపాలతో కళకళ లాడుతూ ఉన్నాయి విషయానికి వస్తే కొన్ని విద్యుత్ స్తంబాలు రోడ్లపై అడ్డంగా ఉండి రాకపోకలకు ఇబ్బందిగా మారింది ఇది తెలిసిన వెంటనే కౌన్సిలర్ సర్వర్ పాషా వెంటనే రోడ్లపై గల విద్యుత్ స్తంభాలను లోనికి జరిపించారు.వాటితో పాటు కాలనీ లో పేరుకోపోయిన చెత్త ను తొలగించడం జరిగింది దీనితో కాలనీ వాసులు సర్వర్ పాషా ను అభినందనలు తెలుపుతూ హర్శ్యం వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికే కాలనీ అభివృద్ధి కొరకు అహర్నిశలు కష్టపడుతూ కాలనీ ని అభివృద్ధి పథం లో తీసుకెళ్లిన కౌన్సెలర్ సర్వర్ పాషా మాట్లాడుతూ కాలనీ అభివృద్ధియే తన ధ్యేయం అని దానికి సాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు హ్యాట్సాఫ్ సర్వర్ భాయ్

# సింగరేణి సంస్థను పరిరక్షంచుకోవాల్సిన అవసరం ఉంది

**టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడు మాజీ రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్**

**సింగరేణి గుర్తింపు యూనియన్ ఎన్నికల కాల పరిమితి ముగిసినందున తక్షణమే ఎన్నికల నిర్వహించాలి**

**చీఫ్ జనరల్ సెక్రెటరీ కాపుకృష్ణ**





**కొత్తగూడెం జనవరి 8 :స్కై న్యూస్ ):**తెలంగాణ ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం సింగరేణి సంస్థను పరిరక్షంచుకోవాల్సిన అవసరం ఉందని టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడు మాజీ రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు గురువారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 30 వేల మంది యువకులకు ఉద్యోగాలు ఇచ్చాము. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త ఉద్యోగాల విమర్శించారు.సింగరేణి సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వం ఏటీఎంగా వాడుకొని నిధుల దుర్వినియోగానికి పాటుపడుతున్నారని ఆరోపించారు. పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ హయాములో సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించవలసిన బకాయిలు 19 వేల కోట్ల రూపాయలు మాత్రమేనని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో 24 వేల కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాల్సిన స్థితి వచ్చిందని పేర్కొన్నారు. సింగరేణి రక్షంచడానికి కార్మికులకు జీతభత్యాలు చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి 48 వేల కోట్ల రూపాయల బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు సింగరేణి గుర్తింపు యూనియన్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఏఐటియుసి ఐ ఎన్ టి యు సి సంఘాలు మెడికల్ బోర్డు ప్రతి నెలలో రెండు పర్యాయాలు నిర్వహిస్తామని చెప్పి గడిచిన 10 నెలల్లో ఒక్క బోర్డు కూడా నిర్వహించలేదని విమర్శించారు. వేలాది మంది కార్మికులు మరియు వారి కుటుంబాలు తీవ్ర ఆందోళన అశాంతితో గందరగోళంలో ఉన్నారని పేర్కొన్నారు.సింగరేణి గుర్తింపు యూనియన్ ఎన్నికల కాల పరిమితి ముగిసినందున తక్షణమే ఎన్నికల నిర్వహించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యంతో జరిగే సంప్రదింపులకు అన్ని కార్మిక సంఘాలకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి చీఫ్ జనరల్ సెక్రెటరీ కాపుకృష్ణ, ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య అధికార ప్రతినిధి పర్లపల్లి రవి కోశాధికారి చెల్పూరి సతీష్, కేంద్ర ఉపాధ్యక్షులు మెడికల్ సంపత్ కుమార్ మంగీలాల్ కూసన వీరభద్రం ప్రభాకర్ రెడ్డి సదానందం 11 డివిజన్ల ఉపాధ్యక్షులు వడ్డేపల్లి శంకర్ ఐలి శ్రీనివాస్ నాగెల్లి సాంబయ్య మల్రాజు శ్రీనివాసరావు మేడిపల్లి సంపత్ బండి రమేష్ బడితల సమ్మయ్య నాగెల్లి వెంకటేశ్వర్లు గడప రాజయ్య తుమ్మ శ్రీనివాసరావు జాఫర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ నేతలతో కలిసి మీడియా సమావేశం

షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాట్లాడుతున్న తీరు వాళ్ల భాష చూస్తుంటే 90 ఎం ఎల్ గాళ్ళలా కనిపిస్తున్నారు

రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి లను తిడితే సహించేది లేదు

ఉద్యమకారుల బతుకులు రోడ్డుపాలు చేశారు

షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘాటు హెచ్చరిక



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, జనవరి 8:–** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్థానిక ఉద్యమకారులు జేఏసీ నేతలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాట్లాడుతున్న తీరు వాళ్ల భాష చూస్తుంటే 90 ఎం ఎల్ గాళ్ళలా కనిపిస్తున్నాయన్నారు కేటీఆర్ అయితే కేఏ పాల్ ను తలపిస్తున్నారు ఒకవైపు అమ్మ పలుకు జగదంబ పలుకు అంటూ కవిత వీళ్ళ గుట్టు రట్టు చేస్తుంటే మరోవైపు అడ్డగోలు మాటలతో జనాల్లో చులకన అవుతున్నారు ఇది రాష్ట్రానికి పట్టిన దరిద్రం ఇకనైనా పిచ్చి మాటలు మానుకోండి అంటూ షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఘాటుగా స్పందించారు బీఆర్ఎస్ నాయకులు తమ మాటలతో తమ చేతలతో రాష్ట్రంలో ప్రజలు రాజకీయాలను అసహ్యించుకునే తరహాలో దిగజారి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు ఉద్యమ పార్టీ అని రంగంలోకి వచ్చి ఉద్యోగులు కార్మికులు, జర్నలిస్టులు విద్యార్థులు సబండ వర్గాలందరినీ కలుపుకొని ఉద్యమం చేసి అధికారంలోకి వచ్చాక అదంతా తమ ఘనకార్యమని ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు కేవలం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశించిన పదవి ఇవ్వలేదన్న కోపంతో బయటికి వచ్చి తెలంగాణ ప్రజల సెంటిమెంటును తన రాజకీయాల కోసం వాడుకున్నాడని ఆరోపించారు తీరా అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలను మరిచిపోయి వాళ్ళ కుటుంబమే పదవులను అనుభవిస్తూ కాలక్షపం చేసిందని ఉద్యోగాలను, ప్రజా సమస్యలను ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు శ్రీకాంతాచారి కిష్టయ్య యాదిరెడ్డి లాంటి ఎందరో ప్రాణ త్యాగాలు చేస్తే తెలంగాణ వచ్చిందని గుర్తు చేశారు కానీ అలాంటి కుటుంబాలను మరచిపోయి ఒకే కుటుంబం పదవులను అనుభవించిందని అన్నారు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్న లక్ష్యంతో తమకు నష్టం జరుగుతుందని తెలిసిన సోనియాగాంధీ అడుగు వెనక్కి వేయకుండా తెలంగాణ ఇచ్చారని, తెలంగాణ ఇస్తే పదవులకు దూరంగా ఉంటానని మాట ఇచ్చిన కేసీఆర్ ఆ మాట తప్పి పదవుల కోసం పాకులాడాడని అన్నారు అలాంటి వ్యక్తి తనను తాను తెలంగాణ జాతిపితగా చెప్పుకోవడం బీఆర్ఎస్ నాయకులు భజన చేయడం విడ్డూరంగా ఉందన్నారు స్వపక్షంలోనే వ్యతిరేకత ఎదురు అయిన్నప్పటికీ కాంగ్రెస్ వెనకడుగు వేయకుండా తెలంగాణ ఇచ్చిందని గుర్తు చేశారు అవన్నీ మర్చిపోయి ఇప్పుడు రాజకీయ వ్యభిచారానికి బీఆర్ఎస్ దిగజారింది అన్నారు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భూముల ఆక్రమణలు, ప్రాజెక్టులలో అవినీతి వంటివి చేసి ప్రజలకు నీరు అందకుండా అడ్డుకున్నది బీఆర్ఎస్ పార్టీ అని, ఆ నిజాలను కాంగ్రెస్ మాట్లాడితే బూతులకు దిగడం అలవాటుగా మారిందని అన్నారు మాజీ మంత్రి కేసీఆర్ తన స్థాయిని మరిచి అడ్డగోలుగా మాట్లాడడం దురదృష్టకరమన్నారు లక్ష్మదేవి పల్లి ప్రాజెక్టు 90 శాతం పూర్తయిందని చెప్పడం హాస్యాస్పదమని అక్కడికి వెళ్లి చూస్తే తట్ట మట్టి ఎత్తిన దాఖలాలు కూడా కనిపించదని అన్నారు తెలంగాణ భాష అంటూ అడ్డమైన బూతులు మాట్లాడి దిగజారి వ్యవహరిస్తే ఏదో ఒక రోజు అది మీకే చేటు తెస్తుందని చెప్పారు. సీఎం రేవంత్ వచ్చాకనే ఆంధ్ర ప్రాంతానికి నీటి తరలింపును ఆపారని అక్కడి మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఒప్పుకున్న సంగతి గుర్తు చేశారు రోజా వద్ద రొయ్యల పులుసు తిని బీరాలు పలికిన కేసీఆర్ గురించి ప్రజలకు గుర్తుందని అన్నారు కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావులు అధికారంలో ఉన్నప్పుడు చేసిన అవినీతి భాగవతాన్ని సాక్షత్తు ఆ ఇంటి బిడ్డ కవిత బయట పెట్టడం పదేళ్ల వాళ్ళ అవినీతికి నిదర్శనం అని అన్నారు ఇకనైనా దిగజారుడు స్థాయి మాటలను వదిలిపెట్టకుంటే తగిన బుద్ధి చెబుతామని ఎమ్మెల్యే హెచ్చరించారుతెలంగాణ వచ్చాక తెలంగాణ ఉద్యమకారులను గాని అమరవీరుల కుటుంబాలను బీఆర్ఎస్ ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదని మాజీ జెడ్పిటిసి తెలంగాణ ఉద్యమకారుడు పి. వెంకటరామిరెడ్డి అన్నారు మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఉద్యమకారుల గురించి అసెంబ్లీలో మాట్లాడడంపై వారు ధన్యవాదాలు తెలిపారు తెలంగాణ పోరాటంలో ఎంతో మంది ఉద్యమకారులు ఉన్నారని గుర్తు చేశారు కాలం తర్వాత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అసెంబ్లీలో తెలంగాణ ఉద్యమకారుల ప్రస్తావన తేవడం సంతోషకరమని అన్నారు తెలంగాణ వస్తే నీళ్లు, నిధులు, నియామకాలు వస్తాయని మభ్యపెట్టిన బీఆర్ఎస్ అన్నీ మరిచిపోయిందని అన్నారు కేటీఆర్ భాష చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు ఎమ్మెస్ అత్తయ్య మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు తగిన గౌరవం ఇచ్చేలా అసెంబ్లీలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడిన తీరు సంతోషకరమని అన్నారు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకనే నిజమైన తెలంగాణ వచ్చిన భావన కలుగుతుందని అన్నారు అనంతరం ఉద్యమకారులు ఎమ్మెల్యేకు గులాబీ మొక్కను బహుమతిగా ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఈఉద్యమకారులు పి వెంకట్ రాంరెడ్డి, జాంగారి రవి, జాంగారి నరసింహ, మంగులాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

# తోడు దొంగలతో పాలమూరు సర్వనాశనం

నాడు కే సి ఆర్...నేడు రేవంత్ కమిషన్ల కక్కుర్తి

నీటి వాటాలో బి ఆర్ ఎస్,కాంగ్రెస్ రెండూ అన్యాయం చేశాయి

సాగు నీటి సాధన కోసం

బిజెపి మరో ఉద్యమం

బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ



**నారాయణపేట జనవరి 8: (స్కైన్యూస్)**మాజీ ముఖ్యమంత్రి కే సి ఆర్,ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇద్దరు తోడు దొంగలతో ఉమ్మడి పాలమూరు జిల్లా సర్వనాశనం అయిందని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామా జీ ఆవేదన వ్యక్తంచేశారు.గురువారం నారాయణపేట లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్,జిల్లా కోశాధికారి సిద్ధి వెంకట్ రాములు,పట్టణ బిజెపి అధ్యక్షుడు పి.వినోద్ కుమార్ తో కలిసి మాట్లాడుతు కమిషన్ల కోసం తప్పిస్తే వారికి పాలమూరు జిల్లా ప్రజల కష్టాలు పట్టవని విమర్శించారు.నారాయణపేట సరిహద్దు తంగిడి నుంచి కృష్ణానది పాలమూరు జిల్లాలో 3వందల కిలోమీటర్ల దూరం తర్లిపోతుంటే మన నీటిని మనం వాడుకొని దుస్థితి కల్పించారని అన్నారు.ఉమ్మడి రాష్ట్రానికి బచావత్ ట్రిబ్యునల్ 811 టి ఎం సి ల వాట ఇచ్చిందన్నారు.నీళ్ళు,నియామకాల కోసం ఏర్పడిన తెలంగాణలో 2015లో తొలి అపెక్స్ కౌన్సిల్స్ సమావేశంలో తెలంగాణ కు సింహభాగం వాటా కొరాల్సింది పోయి నాటి సి ఎం కే సి ఆర్ 299 టి ఎం సి లకే సంతకం చేసి పాలమూరు జిల్లా కు తీరని అన్యాయం చేశారని అన్నారు. అంతే కాకుండా పాలమూరుబి రంగారెడ్డి పై బి ఆర్ ఎస్,కాంగ్రెస్ కు రెండిటికీ చిత్త శుద్ధి లేదని పేర్కొన్నారు.తెలంగాణ కు 60 ఏళ్లుగా కాంగ్రెస్ తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు.2014 కన్నా ముందు ఎస్ ఎల్ బి సి,కల్వకుర్తి,నెట్టెంపాడు, డిండి,కోయిల్ సాగర్ ప్రాజెక్టులకు పరిపాలన అనుమతులు మాత్రమే ఇచ్చి నీటి కేటాయింపులు చేయకుండా కాంగ్రెస్ పచ్చి మోసం చేసిందనీ విమర్శించారు.బి ఆర్ ఎస్ అధికారంలోకి వచ్చాక పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ను డి పి ఆర్ లేకుండా మొదలు పెట్టీ 30 వేల కోట్ల నిధులు ఖర్చు పెట్టి పంపిణీ కాల్వలు లేకుండా కమిషన్లు మెక్కి పాలమూరు ను ఎడారి చేశారని అన్నారు.నాడు జూరాల బ్యాక్ వాటర్ వరద జలాలతో ప్రాజెక్టు చేపడతామని అంటే ఇప్పటి సి ఎం రేవంత్ రెడ్డి కుమ్మక్కై వ్యతిరేకించి నేడు తాను పాలమూరు ప్రాజెక్ట్ ను జూరాల నుంచి చేపడతానని చెప్పడంలో మతలబెమని ప్రశ్నించారు. నాడు కే సి ఆర్ అనుమతులు లేకుండా పనులు ప్రారంభించి గుంటలు తవ్వి కోట్లు కమిషన్లు నొక్కారని నేడు అదేతరహా లో రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు తప్పా చిత్తశుద్ధి లేదని అన్నారు.జిల్లాలో బిజెపి సాగునీటి సాధన కోసం మరో ఉద్యమం చేపడుతుందని తోడు దొంగలకు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలని కోరారు.

**విబి జి రాం జి పై కాంగ్రెస్ అనవసర రాద్ధాంతం**

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విబీ జి రాం జీ పతాకంపై కాంగ్రెస్ అనవసర రాద్ధాంతం చేస్తున్నదని ప్రజలు నమ్మొద్దని జిల్లా బిజెపి అద్యక్షుడు సత్య యాదవ్ ప్రజలను కోరారు.ఇదివరకు ఉన్న ఉపాధి హామీ పథకం కు ఎలాంటి చట్టబద్ధత లేదని ప్రస్తుతం ప్రధాని నరేంద్రమోడీ పథకానికి చట్ట బద్దత తీసుకు రావడమే కాకుండా పనిదినాలు వంద నుంచి125 రోజులకు పెంచడం జరిగిందన్నారు. కూలీ డబ్బులు ఇప్పుడు ఎలాంటి అవినీతికి తావు లేకుండా నేరుగా వారి ఖాతాలోనే జమ చేస్తారని అన్నారు.అలాగే సోషల్ ఆడిట్ గ్రామ పంచాయతీలకు అప్పగించింది అని తెలిపారు.ఇంత సులువైన పథకం రూపొందిస్తే కాంగ్రెస్ పార్టీ అసత్య ప్రచారాలు చేస్తున్నదని ప్రజలు నమ్మొద్దని తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

# మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పై ముగిసిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ

- ఈ పథకంతో ముప్పు లేదని ముక్తకంఠంతో ఏకాభిప్రాయం తెలిపిన ప్రజా ప్రతినిధులు, రైతులు,రైతు సంఘాల సభ్యులు






**నారాయణపేట జనవరి 8: (స్కైన్యూస్):**తెలంగాణ కాలుష్య నియంత్ర ణ మండలి ఆధ్వర్యంలో మక్తల్ నారాయణ పేట కొడం గల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించి దామరగిద్ద తండా లో గురువారం ఏర్పా టు చేసిన పర్యావరణ ప్రజా భిప్రాయ సేకరణ కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. మూడు నియోజకవర్గాల నుంచి మూడు నియోజక వర్గాలలోని 7 మండలాల నుంచి ప్రజా ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, విశ్రాంత ఉద్యోగులు, రైతులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అందరూ ముక్త కంఠంతో నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి ఎలాంటి పర్యావరణ ముప్పు, విఘాతం లేదని, వీలైనంత తొందరగా ఆ పథ కానికి పర్యావరణ అనుమ తులు ఇచ్చి ప్రారంభించాలని ఏకాభిప్రాయాన్ని తెలియ జేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ కాలుష్య నియం త్రణ మండలి(పి సి బి) హైద రాబాద్ ప్రాంతీయ కార్యాల యం నుంచి ఈ ఈ సురేష్ హాజరు కాగా జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రామచందర్ నాయక్, నీటి పారుదల శాఖ ఎస్. ఈ శ్రీధర్ పాల్గొన్నారు. పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ లో భాగంగా ఏడు మండలాల నుంచి వచ్చిన వందలాది మంది సమక్షంలో 28 మంది వక్తలు తమ తమ అభిప్రా యాలను వెల్లడించారు. అందరూ మక్తల్ నారాయ ణపేట కోడంగల్ ఎత్తిపోతల పథకం పనులను తొందరగా ప్రారంభించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని, ఆ పథకం పూర్తి చేసి సాగు, తాగునీరు అందించాలని కోరారు. ఆ పథకం చేపడితే పర్యావరణానికి వచ్చే నష్టం ఏమీ లేదని, గాలి, నీరు, వాతావరణ కాలుష్యం ఏమీ జరగదని తేల్చి చెప్పారు. ఆ పథకం పూర్తి అయితే పర్యా వరణం ఇంకా మెరుగు అవు తుందని తెలిపారు. వెంటనే పథకం ప్రారంభించేందుకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలని అధికారి సురేష్ ను వారు కోరారు. చివర్లో అధికా రి సురేష్ మాట్లాడుతూ పర్యా వరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో వచ్చిన అభి ప్రాయాలన్నింటిని నమోదు చేసుకున్నామని, మొత్తం కార్యక్రమాన్ని వీడియో చిత్రీక రణ చేయడం జరిగిందని, మీటింగ్ మినిట్స్ తో పాటు వీడియో ను కాలుష్య నియం త్రణ మండలి కి సమర్పిస్తా మని తెలిపారు. ఆ పథకంలో ఊట్కూర్ గ్రామం ముంపున కు గురయ్యే ఆస్కారమే లేదని, ఊట్కూరు మండల పరిసరాలలో సంచరించే జింకలను సంరక్షణ కేంద్రానికి తరలించేందుకు బడ్జెట్ కేటా యించడం జరిగిందని నీటి పారుదల శాఖ ఎస్. ఈ. శ్రీధర్ ఓ ప్రశ్నకు సమాధా నంగా బదులిచ్చారు. ఈ కార్యక్రమంలో నారాయణ పేట మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు పుట్టి ఈదప్ప, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ ఛార్జీ కుంభం శివకుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఈ ఈ బ్రహ్మానందరెడ్డి, పర్యావ రణ కన్సల్టెన్సీ కరీముల్లా, దామరగిద్ద తహసిల్దార్ తిరుపతయ్య, ఎంపీడీవో జయలక్ష్మ, దామరగిద్ద తండా సర్పంచ్ శరణ్ నాయక్, దామరగిద్ద సర్పంచ్ అద్దన్ కనికి రెడ్డి, బాపన్ పల్లి శ్రీను, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, రైతులు రైతు సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్లలో ప్రజా బాట కార్యక్రమంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించిన టిఎస్ఎస్ పిడిసిఎల్ అధికారులు...



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, జనవరి 8:–** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పట్టణంలో ప్రజా బాట కార్యక్రమం లో భాగంగా విద్యుత్ సమస్యలను పరిశీలించి సమస్యలను పరిష్కరించిన టి ఎస్ ఎస్ పి డి సి ఎల్ విద్యుత్ అధికారులు జరిగింది చేవెళ్ల పట్టణంలోని లోని 100కేవీ ట్రాన్స్ ఫార్మర్ నీ వెంటనే మరమ్మత్తులు చేయడం జరిగింది లో వోల్టేజి సమస్య ఉందని కనకమామిడి మల్లారెడ్డి పిర్యాదు చేయడంతో వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించడం జరిగింది ఈ కార్యక్రమం లో ఏడిఈ సాయినాథ్ కుమార్, ఏ ఈ రాజేందర్, లైన్ మెన్లు భాస్కర్ రెడ్డి, సునీల్ పుల్లయ్య, వీరన్న, స్థానికులు మర్పల్లి కృష్ణారెడ్డి, నత్తి కృష్ణారెడ్డి, కనకమామిడి మల్లారెడ్డి, జుకన్నగారి లక్ష్మరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ లో గుట్టుగా సెక్స్ రాకెట్

దాడులు చేసి పట్టుకున్న ప్రత్యేక పోలీసు బృందం

ముంబై, గుజరాత్ యువతులను పెట్టి వ్యభిచారం




**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ జనవరి 8 :–** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ కేంద్రంలో సెక్స్ రాకెట్ ముఠా దంద కొనసాగిస్తుంది విశ్వసనీయ సమాచారం ప్రకారం ఎస్ఓటి పోలీసులు గురువారం సాయంత్రం సెక్స్ రాకెట్ ముఠా నిర్వహిస్తున్న కార్యకలాపాల వద్ద వారిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు షాద్ నగర్ సీఎస్కే వెంచర్లో గత కొంతకాలంగా ముంబై గుజరాత్ ప్రాంతాలకు చెందిన జావేద్, ఫాతిమా దంపతులు ముగ్గురు యువతులను పెట్టి సెక్స్ రాకెట్ నడుపుతున్నారు అయితే ఎట్టకేలకు విశ్వసనీయ సమాచారం ప్రకారం ఎస్ఓటి పోలీసులు పథకం ప్రకారం సీ.ఎస్.కె. వెంచర్ లో గుట్టుక నిర్వహిస్తున్న ఓ విల్లాను చుట్టుముట్టి జావేద్ ఫాతిమా దంపతులతో పాటు నిషా మరో ఇద్దరిని అదుపులోకి తీసుకొని స్థానిక పోలీసులకు అప్పచెప్పారు ఈ విషయమై స్థానిక సీఐ విజయ్ కుమార్ ను వివరణ కోరగా తనకు తెలియదని మీడియాకు చెప్పారు. అయితే ఎస్ ఓ టి పోలీసులు ముగ్గురు బాధితులతో పాటు నిర్వాహకులను పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పజెప్పినట్లు సమాచారం.

# లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్ ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి




**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, జనవరి 8:–** రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గం లో ఆటో నగర్ ఇసుక లారీ పార్కింగ్ వద్ద జరిగిన కొత్తపేట బిల్డింగ్ మెటీరియల్ లారీ ఓనర్స్ అసోసియేషన్ వారి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.ఈ సందర్భంగా లారీ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఇట్టి లారీ పార్కింగ్ వద్ద మూత్రశాలలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నము అని తెలిపారు అలాగే ఉదయం పూట ట్రాఫిక్ పోలీసులు చాలన్ల పేరుతో ఫోటోలు తీయడం జరుగుతుందన్నారు.అలాగే దుమ్ముదూలి విపరీతంగా రావడం జరుగుతుంది అన్నారు.అలాగే విపరీతంగా దోమలు ఉన్నాయని తెలిపారు.అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పోలీస్ అధికారులతో ఒక సమావేశం ఎర్పాటు చేయించి చలానా విధించకుండా చూస్తామని తెలిపారు.అలాగే మూత్రశాలలకు తన వంతు సహాయ సహకారం ఇస్తామని తెలిపారు.రోడ్డు మీద దుమ్ము,దూళి నివారణకు రోడ్లపై ట్యాంకర్ ద్వారా నీళ్లు కొట్టించే విధంగా చేస్తామన్నారు.అలాగే పక్కన ఉన్న చెరువులో దోమలు వ్యాపించకుండా మందులు చల్లడం జరుగుతుంది అని చెప్పారు.ఇట్టి కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి,మాజీ అధ్యక్షులు జగదీష్ యాదవ్, టంగుటూరి నాగరాజు,యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి,అధ్యక్షులు నర్రి వెంకన్న,ప్రధాన కార్యదర్శి కుండే సత్తయ్య,కోశాధికారి నర్రి అంజయ్య, ఉపాధ్యక్షులు లింగం,సత్తయ్య,కార్యనిర్వాహక కార్యదర్శులు యాదయ్య,మల్లేష్ సహాయ కార్యదర్శులు నర్సింహా,లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ముంబాయిలో స్వచ్ఛంద సంస్థల ఆత్మీయ సమ్మేళనం



**నారాయణపేట జనవరి 8: (స్కైన్యూస్)** నారాయణపేట సేవా సంస్థ ముంబై ధారవి సభ్యులు,నారాయణపేట చేయూత స్వచ్ఛంద సంస్థ సభ్యులు చలో క్షత్ర భూమి కార్యక్రమానికి వెళ్లి గురువారం ముంబాయిలోని దారవి అంబేడ్కర్ స్కూల్ లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నారాయణపేట నుంచి వెళ్ళిన చేయూత స్వచ్ఛంద సంస్థ సభ్యులను సమాజ్ సేవా ముంబాయి సంస్థ సభ్యులు ఘనంగా సన్మానిం చారు.ఈ సందర్భంగా చేయూత స్వచ్ఛంద సంస్థ,ముంబాయి సమాజ్ సేవా సంస్థ సామాన్యంగా పని చేస్తూ సామాజిక సేవా కార్యక్రమాలనువిస్తరించాలని నిర్ణయించారు. సహకరిస్తున్న సమాజ్ సేవా సంస్థ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నారాయణపేట చేయూత సేవ సంస్థ సభ్యులు ,సమాజ్ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



# హ్యాంగోవర్ తో తలపట్టేసిందా? ఈ టిప్స్ ట్రై చేసి చూడు

కొత్త సంవత్సరం మొదలైంది. అందరూ తమకు నచ్చినట్లుగా నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు. కానీ చాలామంది హ్యాపీగా వెల్కమ్ చెప్పారనే కంటే హ్యాంగోవర్ తో వెల్కమ్ చెప్పారనడం కరెక్టుగా ఉంటుంది. డిసెంబర్ 31 రాత్రి మొదలుపెట్టి అర్థరాత్రి దాటేంతవరకూ తాగి.. తెల్లవారాక ఆ హ్యాంగోవర్ కు తలపట్టేసి.. దాన్ని ఎలా వదిలించుకోవాలో తెలియక నానా తంటాలు పడుతుంటారు. కొత్త సంవత్సరం, తొలిరోజునే ఇలా హ్యాంగోవర్ తో ఉంటే ఎలా బ్రదర్. పక్కనోడు మంచి చేస్తే ఆదర్శంగా తీసుకోం గానీ.. వాడు తాగాడు,నేను కూడా తాగాలి అని వెంటనే ఫాలో అయిపోతావ్ కదా. ఇప్పుడు ఎంత చెప్పినా గడిచిన రాత్రి తిరిగిరాదు కదా. తలకెక్కిన హ్యాంగోవర్ ను ఎలా వదిలించుకోవచ్చో కొన్ని చిట్కాలు తెలుసుకుందాం. ఇవన్నీ హ్యాంగోవర్ లక్షణాలే.. తలనొప్పి, తల తిరగడం, నోరు ఎండిపోవడం, గుండె వేగంగా కొట్టుకోవడం, వాంతులు వచ్చినట్లు ఉండటం.. ఇవన్నీ హ్యాంగోవర్ లక్షణాలే. దీనివల్ల డే అంతా చాలా చిరాకుగా ఉంటుంది. ఆ హ్యాంగోవర్ ను కొన్ని టిప్స్ ద్వారా తగ్గించుకోవచ్చు. ఆల్కహాల్ తీసుకున్నాక శరీరం ఎక్కువగా నీటిని కోల్పోతుంది. సో ఉదయం లేవగానే నార్మల్ వాటర్ లేదా గోరువెచ్చని నీటిని కొద్దికొద్దిగా తాగాలి. దీనివల్ల డీహైడ్రేషన్ తగ్గి, తలనొప్పి వంటి సమస్యల నుంచి రిలీఫ్ ఉంటుంది.

**కొబ్బరినీళ్లు, కాఫీతో రిలీఫ్**

కొబ్బరి నీళ్లు తాగితే ఇంకా మంచిది. వీటిలో ఉండే నాచరల్ ఎలక్ట్రోలైట్స్ శరీరాన్ని త్వరగా ఉత్తేజపరుస్తాయి. కాఫీలో ఉండే ్ఫీన్ కూడా మత్తును తగ్గించడంలో యూజ్ అవుతుంది. బట్ ఒక కప్పు కంటే ఎక్కువ కాఫీ తీసుకుంటే డీహైడ్రేషన్ పెరిగే ఛాన్సుంది.


**హ్యాంగోవర్ కు నేచురల్ మెడిసిన్ నిమ్మ**

హ్యాంగోవర్ తగ్గడానికి అందరూ ముందుగా చేసేపని నిమ్మరసం తాగడం. ఇందులో ఉండే విటమిన్ సి ఆల్కహాల్ ప్రభావాన్ని సహాయ పడుతుంది. మజ్జిగలో నిమ్మరసం పిండుకుని తాగినా హ్యాంగోవర్ నుంచి కాస్త రిలీఫ్ పొందొచ్చు.

**వామిట్ సెన్సేషన్ ను తగ్గించే అల్లం**

వికారం, వామిట్ సెన్సేషన్ ను తగ్గించే శక్తి అల్లంకు ఉంది. కొన్ని అల్లం ముక్కల్ని నీటిలో వేసి మరిగించి.. ఆ నీటిని గోరువెచ్చగా తాగాలి. ఎనర్జీ కోసం అరటిపండును తినడం లేదా అరటిపండుతో షేక్ చేసుకుని తాగడం చేయాలి. యాపిల్, అవకాడో వంటి పండ్లు కూడా శరీరానికి అవసరమైన పోషకాలు అందిస్తాయి.

# ఉదయం లేవగానే ఈ 7 తప్పులు చేస్తున్నారా?



మంచి రోజు అనేది మంచి ఉదయంతోనే మొదలవుతుంది. కానీ మనలో చాలామంది లేవగానే చేసే కొన్ని పొరపాట్ల వీఱర్ఘుఎవం) వల్ల రోజంతా అలసట, నీరసంతో బాధపడుతుంటారు. కొందరు నిపుణుల అభిప్రాయం ప్రకారం, మనం రోజూ చేసే 7 చెడు అలవాట్లు మన ఆరోగ్యాన్ని) ఎలా దెబ్బతీస్తున్నాయో ఇప్పుడు చూద్దాం.మొబైల్ చూడటం: కళ్లు తెరిచిన వెంటనే ఫోన్ చూసే అలవాటు చాలామందికి ఉంది. దీనివల్ల మెదడుపై ఒత్తిడి పెరిగి, రోజంతా ఆందోళనగా అనిపిస్తుంది.నీళ్లు తాగకపోవడం: రాత్రంతా నిద్రపోవడం వల్ల శరీరం డీహైడ్రేట్ అవుతుంది. లేవగానే నీళ్లు తాగకపోతే మెటబాలిజం మందగిస్తుంది.పరగడుపున టీ/కాఫీ: ఖాళీ కడుపుతో ్ఫిన్ తీసుకోవడం వల్ల ఎసిడిటీ సమస్యలు వస్తాయి.బ్రేక్‌ఫాస్ట్ మానేయడం: ఉదయం అల్పాహారం తీసుకోకపోతే శరీరానికి కావాల్సిన శక్తి అందక, మెదడు పనితీరు మందగిస్తుంది.అలారం స్నూజ్ చేయడం: పదే పదే అలారం ఆపి పడుకోవడం వల్ల నిద్ర చక్రం దెబ్బతిని, మరింత బద్ధకంగా తయారవుతారు.వేడి నీళ్ల స్నానం: ఉదయాన్నే మరీ వేడి నీళ్లతో స్నానం చేస్తే శరీరం రిలాక్స్ అయి నిద్రమత్తు వస్తుంది. చల్లని లేదా గోరువెచ్చని నీరే మంచిది.చ్కర పదార్థాలు: ఉదయాన్నే స్వీట్స్ లేదా ఎక్కువ షుగర్ ఉన్న ఆహారం తీసుకుంటే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు ఒక్కసారిగా పెరిగి, అంతే వేగంగా పడిపోతాయి.ఈ చిన్న అలవాట్లను (వీశీతీఅఱఅస్త్ర వీఱర్ఘుఎవం) మార్చుకుంటే, మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉంటుంది. ఉదయాన్నే ఆరోగ్యకరమైన అలవాట్లతో రోజును ప్రారంభించండి.

# రీప్రొడక్టివ్ హెల్త్‌ను మెరుగు పరిచే 4 సహజ ఆహారాలు



ప్రస్తుతం అనేక మంది ఎదుర్కొంటున్న సమస్యల్లో హార్మోన్ల అసమతుల్యత ఒకటి. ఇక పురుషుల్లో లో స్పెర్మ్ ఇష్యూస్, మహిళల్లో అండాలు సక్రమంగా రిలీజ్ కాకపోవడం వంటి ప్రాబ్లమ్స్ పెరుగుతున్నాయి.ఇవి సంతానలేమికి దారితీస్తున్నాయి. అయితే ఈ సమస్య నుంచి బయటపడటంలో సప్లిమెంట్లకంటే సహజ సిద్ధమైన ఆహారాలే మేలు చేస్తాయని పోషకాహార నిపుణులు అంటున్నారు. అలాంటి వాటిలో గుమ్మడి గింజలు (ూబఎజూఎఱఅ ూవవసం), అరటిపండ్లు, బీట్‌రూట్, ముడి తేనె (తీఱష ష్ట్రశీఅవఎ) వంటివి కూడా ఉన్నాయి. సప్లిమెంట్లు లేకుండానే వీటి ద్వారా బలం, శక్తి, రక్తప్రసరణ, అలాగే రీ ప్రొడెక్టివ్ హెల్త్‌ను మెరుగుపరచవచ్చు. అదెలాగో చూద్దాం.గుమ్మడి గింజలుగుమ్మడి గింజలు (ూబఎజూఎఱఅ ూవవసం) అన్‌సాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్లు, మెగ్నీషియం, జింక్, ఐరన్, కాపర్, మాంగనీస్, ఫాస్ఫరస్, పొటాషియం, ఫోలేట్ వంటి మినరల్స్, అలాగే ఫైబర్ వంటి పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్లు కూడా అందిస్తాయి. వీటిని నానబెట్టి లేదా రోస్ట్ చేసి కూడా తినవచ్చు. సలాడ్స్‌పై చల్లుకోవచ్చు. స్మూతీలు లేదా గ్రానోలాలో కలిపి తీసుకోవచ్చు. లేదా స్నాక్‌గా రోజుకు 1-2 టేబుల్ స్పూన్లు కూడా తినవచ్చు. మొత్తానికి వీటిని ఆహారంగా తీసుకుంటే దీర్ఘకాలిక వ్యాధుల రిస్క్ తగ్గుతుందని, హార్ట్ హెల్త్ మెరుగుపడుతుందని నిపుణులు అంటున్నారు. అలాగే ఇమ్యూనిటీని పెంచడం, స్పెర్మ్ హెల్త్ అండ్ హార్మోన్ బ్యాలెన్స్‌కు సపోర్ట్ చేయడం, అలసట తగ్గించడంలో కీ రోల్ పోషిస్తాయి.అరటిపండ్లుఅరటిపండ్లు పొటాషియం, విటమిన్ దీ6, విటమిన్ జ, మెగ్నీషియం, ఫైబర్, అలాగే సహజ చ్కరలు వంటి పోషకాలతో నిండి ఉంటాయి. అలాగే మినరల్స్ అండ్ యాంటీ ఆక్సిడెంట్లు కూడా అందిస్తాయి. వీటిని పండ్లుగా తినవచ్చు. పచ్చిగా ఉన్నప్పుడు కూరగానూ వండుకోవచ్చు. అలాగే స్మూతీలు, మిల్క్ షేక్స్‌లో కలిపి తాగవచ్చు. బేకింగ్‌లో ఉపయోగించవచ్చు. లేదా వర్కౌట్ ముందు ఎనర్జీ స్నాక్‌గా తీసుకోవచ్చు. ఆరోగ్య ప్రయోజనాల విషయానికి వస్తే డైజెస్టివ్ హెల్త్‌ను మెరుగుపరచడం, బ్లడ్ షుగర్ లెవల్స్‌ను సమతుల్యం చేయడం, హార్ట్ హెల్త్ సపోర్ట్, బ్లడ్ ప్రెజర్ నియంత్రణ, వెయిట్ మేనేజ్‌మెంట్, ఇమ్యూనిటీ పెంచడం, అథ్లెటిక్ పెర్ఫార్మెన్స్‌ను మెరుగుపరచడం వంటివి ఉన్నాయి.బీట్‌రూట్‌స్త్రీ, పురుషుల్లో రీప్రొడక్టివ్ హెల్త్‌ను మెరుగు పర్చడంలో బీట్‌రూట్ కూడా అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు (బెటాలైన్స్), నైట్రేట్లు, ఫైబర్, ఫోలేట్, పొటాషియం, విటమిన్ జ అండ్ మినరల్స్ (ఐరన్, మాంగనీస్) వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. సలాడ్స్‌లో కలపడం ద్వారా, జ్యూస్ రూపంలో, రోస్ట్ లేదా బాయిల్ యడం ద్వారా ఉపయోగించవచ్చు. మల్టిపుల్ మీల్స్‌లో విభజించి తీసుకోవచ్చు. రక్తపోటును నియంత్రించడంలో, అథ్లెటిక్ పెర్ఫార్మెన్స్ మెరుగుపరచడంలో, గుండె, అలాగే జీర్ణశయ ఆరోగ్యాన్ని మెరుగు పర్చడంలో మెదడు సామర్థ్యాన్ని పెంచడంలో, శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించడంలో బీట్ రూట్‌లోని పోషకాలు సహాయపడతాయి. రీ ప్రొడక్టివ్ హెల్త్‌ను మెరుగు పరుస్తాయి.ముడి తేనెముడి తేనె (ూఱష ఎశీఅవఎ) యాంటీ ఆక్సిడెంట్లు, అమినో ఆసిడ్స్, విటమిన్ సి, బి, ఐరన్, జింక్ వంటి మినరల్స్, ఎంజైమ్స్ అండ్ సహజ చ్కరలతో నిండి ఉంటుంది. రోజుకు 1-2 టీస్పూన్లు తేనెను టీ లేదా గోరు వెచ్చని నీటితో కలిపి తీసుకోవచ్చు. ఆరోగ్య ప్రయోజనాల విషయానికి వస్తే కఫం, గొంతునొప్పి, గాయం మానడంలో, బ్లడ్ షుగర్ కంట్రోల్లో ఉండటంలో, గుండె ఆరోగ్యాన్ని మెరుగు పర్చడంలో, ఇమ్యూనిటీని పంచడంలో, ఇన్‌ఫ్లమేషన్ తగ్గించడంలో ముడితేనె అద్భుతంగా సహాయపడుతుంది.

# ఔషధ నిధి..!

అరటి పువ్వులో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి ప్రోస్టేట్ గ్రంధి పరిమాణాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. ఇందులోని సిట్రిక్ యాసిడ్, అమినో యాసిడ్స్ ప్రోస్టేట్ గ్రంధిని సాధారణ పరిమాణానికి తీసుకువస్తాయి. అరటి పువ్వు నెఫ్రో ప్రొటెక్టివ్ యాక్టివిటీని కలిగి ఉంది. ఇది కిడ్నీ దెబ్బతినకుండా కాపాడుతుంది. అరటి పువ్వుతో చర్మ సమస్యలకు కూడా చెక్ పెట్టొచ్చు అంటున్నారు నిపుణులు. ఇది యాంటీ హిస్టామైన్ లక్షణాలు కలిగి ఉండటం వల్ల అలెర్జీలు తగ్గించడంలో సహాయపడుతుంది. అరటి పువ్వులో తక్కువ కేలరీలు ఉండటం వల్ల బరువు తగ్గడంలో సహాయపడుతుంది. అరటి పువ్వులోని టానిన్లు, ఫ్లేవనాయిడ్లు, యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి, ఆక్సీకరణ నష్టాన్ని తొలగిస్తాయి. తద్వారా గుండె రోగులలో అనేక సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. అరటి పువ్వులు ఫైబర్ అధికంగా ఉండి, మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడకుండా చేస్తుంది.అరటి పువ్వు రక్తంలో చ్కర స్థాయిలను తగ్గించే లక్షణాలను కలిగి ఉంది. ఇది నెమ్మదిగా శరీరంలోకి గ్లూకోజ్‌ని విడుదల చేస్తుంది. అదనంగా, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ కూడా మధుమేహాన్ని నియంత్రించడంలో సహాయపడతాయి. అరటి పువ్వులో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరంలో రక్త లోపాన్ని తీర్చడంలో సహాయపడుతుంది. ఈ కారణంగా రక్తహీనతతో బాధపడేవారు దీన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలి. ఇందులో ఉండే జింక్ ఎముకల నష్టాన్ని నివారిస్తుంది. ఇందుల్వోర్సెటిన్, కాటెచిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఎముకల నష్టాన్ని నివారించడంలో సహాయపడతాయి. అధిక రక్తపోటు సమస్యతో ఇబ్బంది పడుతున్న వారికి అరటి అద్భుత మేలు చేస్తుంది. అరటి పువ్వును ఆహారంలో భాగంగా చేసుకుంటే.. యాంటీ హైపర్‌టెన్సివ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. ఇది రక్తపోటును నియంత్రించగలదు. ఇందులో ఉండే పీచు, యాంటీ ఆక్సిడెంట్లు, అనేక పోషకాలు అనేక ఇతర వ్యాధులకు దివ్యౌషధంగా పనిచేస్తాయి.



# బిజినెస్

## భారీగా తగ్గిన వెండి

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుతున్నాయనే సంకేతాల నేపథ్యంలో వెండి ధరలు ఒక్కసారిగా భారీగా పడిపోయాయి. సోమవారం ఎంసిఎక్స్ మార్కెట్లో కిలో వెండి ధర ఒక్క రోజే రూ.21 వేలు తగ్గింది. మధ్యాహ్నం తర్వాత ఒక్క గంటలోనే కిలో వెండి ధర భారీగా తగ్గి రూ.2,33,120 కు చేరింది. ముఖ్యంగా ఉక్రెయిన్-, రష్యా యుద్ధానికి సంబంధించి సానుకూల పరిణామాలు కనిపించడంతో పెట్టుబడిదారుల్లో లాభాల స్వీకరణ కనిపించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కి మధ్య జరిగిన చర్చలు సానుకూలంగా ఉండటంతో సురక్షిత పెట్టుబడిగా భావించే వెండిపై అమ్మకాల ఒత్తిడి పెరిగింది. ఇటీవల వెండి కిలోకు రూ.2,54,174 వద్ద ఆల్ టైమ్ గరిష్ట స్థాయికి చేరింది. దీని తర్వాత చోటుచేసుకున్న భారీ పతనం ఇదే కావడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్లలో కూడా వెండి ధరల్లో హెచ్చుతగ్గులు కనిపించాయి. సోమవారం ప్రారంభంలో వెండి ధర ఔన్సుకు తొలిసారిగా 80 డాలర్లని దాటింది. అయితే లాభాల స్వీకరణ కారణంగా ధర మళ్లీ 75 డాలర్ల స్థాయికి తగ్గింది. అయినప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా వెండిపై పెట్టుబడిదారుల ఆసక్తి ఇంకా కొనసాగుతోంది. ఇదే సమయంలో బంగారం ధరలు కూడా ఎంసిఎక్స్‌లో ఫిబ్రవరి 2026 డెలివరీ ధర 10 గ్రాములకు రూ.1,40,230కు చేరింది. అంతర్జాతీయంగా కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ ఔన్సుకు

## ఇవి బ్యాటరీలకు ఆధార్ తరహా నెంబర్లు



కేంద్ర రవాణా మంత్రిత్వశాఖ శనివారం ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల సంబందిత కీలక ముసాయిదా మార్గదర్శకాలు వెలువరించింది. ఇవి కార్లు ఇతర వాహనాలకు అత్యవసరంగా వాడే బ్యాటరీలకు ఇకపై ఆధార్ తరహా నిర్థిష్ట క్రమ సంఖ్యలను పొందుపర్చేందుకు ప్రతిపాదించారు. సమర్థవంతమైన రీ ఛార్జింగ్‌కు, వీటి ఉనికి తెలుసుకునేందుకు (ట్రెసిబులిటి) ఈ నెంబర్ల ప్రక్రియ ఉపయోగపడుతుందని మార్గదర్శకాలలో మంత్రిత్వ శాఖ తెలిపింది. ముసాయిదా అమలులోకి వస్తే బ్యాటరీల ఉత్పత్తిదార్లు లేదా దిగుమతిదార్లు తప్పనిసరిగా వీటికి 21 అంఇల బ్యాటరీ ప్యాక్ ఆధార్ నెంబరు అంటే బిపిఎఎన్‌ను తప్పనిసరిగా పొందుపర్చుకోవల్సి ఉంటుంది. లేకపోతే ఇటువంటి బ్యాటరీలు ఉనికిలోనికి రావడానికి వీలుండదు. బిపిఎఎన్ అధికారిక పోర్టల్‌లో సంబంధిత బ్యాటరీ ప్యాక్ డైనమిక్ డేటాను జతచేయాల్సి ఉంటుంది. ఈ మేరకు బ్యాటరీల ఉత్పత్తిదార్లకు ఈ నిబందన తప్పనిసరి చేస్తారు. మార్కెట్‌లోకి పంపే ప్రతి బ్యాటరీకి ఈ నెంబరు నిర్థిష్టంగా ఉండటంతో వాటిని గుర్తించేందుకు వీలేర్పడుతుంది. రీసైక్లింగ్ ప్రక్రియ సులభతరం అవుతుందని అధికార వర్గాలు తమ ప్రకటనలో తెలిపాయి.

## భారత్ నుంచి 50 బిలియన్ డాలర్ల ఐఫోన్ల ఎగుమతితో రికార్డు!

భారతదేశం ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో కొత్త చరిత్ర సృష్టించింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం ద్వారా యాపిల్ ఐఫోన్ల ఎగుమతులు భారీ మైలురాయిని చేరుకున్నాయి. గత ఐదేళ్లలో భారత్ నుంచి ఏకంగా 50 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 4.15 లక్షల కోట్లు) విలువైన ఐఫోన్లు విదేశాలకు ఎగుమతి అయ్యాయి. 2026 ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లోనే (ఏప్రిల్-డిసెంబర్ 2025) దాదాపు 16 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లను యాపిల్ ఎగుమతి చేసింది. భారత్ నుంచి ఎగుమతి అవుతున్న మొత్తం స్మార్ట్‌ఫోన్లలో 75 శాతం వాటా ఐఫోన్లదే కావడం విశేషం. ఈ విజయంతో మొబైల్ తయారీలో భారత్ ప్రపంచంలోనే రెండో స్థానానికి చేరింది. ప్రస్తుతం దేశంలో టాటా గ్రూప్‌కు చెందిన మూడు ప్లాంట్లు, ఫాక్స్‌కాన్‌కు చెందిన రెండు ప్లాంట్లలో ఐఫోన్ల తయారీ జరుగుతోంది. ఎగుమతులే కాకుండా దేశీయ మార్కెట్లోనూ యాపిల్ సత్తా చాటుతోంది.

# సానుకూలతలున్నా.. అప్రమత్తతే



దేశీయ స్టాక్ మార్కెట్లలో, సమీప భవిష్యత్తులో సానుకూలతలు కొనసాగొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. భారత్-అమెరికా ఒప్పందం మరింత ఆలస్యమైతే, రూపాయి బలహీనపడొచ్చు. బుధవారం వెలువడే తొలి ముందస్తు జీడీపీ (2025-26) అంచనాల కోసం మదుపర్లు ఎదురు చూస్తున్నారు. 2026లో ఈక్విటీ మదుపర్లకు మెరుగైన ప్రతిఫలాలే కనిపించొచ్చని, అయితే విదేశీ పెట్టుబడుల ప్రవాహంపైనే ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు. విదేశీ పోర్టుఫోలియో మదుపర్లు, ఈనెల తొలి 2 రోజుల్లోనే రూ.7,608 కోట్ల విక్రయాలు జరపడం గమనార్హం. గతేడాది తరహాలోనే ఈ ఏడాదిలోనూ నిఫ్టీ-50 లాభాలు ఉండొచ్చని, కార్పొరేట్ ఫలితాలు బాగుంటే, మరింత ప్రతిఫలం లభిస్తుందని ఓ బ్రోకరేజీ అంటోంది. ఈనెల 12న టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ ఫలితాలు వెల్లడి కానున్నాయి. వివిధ రంగాలపై విశ్లేషకుల అంచనాలు ఇలా..ఆర్థిక ఫలితాలకు ముందు ఈవారం నిఫ్టీ బ్యాంక్ రాణించొచ్చు. దీనికి 59,800-59,500 వద్ద కీలక మద్దతు ఉంది. 60,500-60,700 వద్ద నిరోధం ఎదురుకావొచ్చు. 59,500 దిగువన లాంగ్ పొజిషన్ల నుంచి ట్రేడర్లు బయటకు వచ్చే అవకాశం ఉన్నందున, సెంటిమెంటు బలహీనపడొచ్చు.లోహ కంపెనీల షేర్లు మరిన్ని లాభాలు అందించొచ్చు. కేంద్ర విధానాలు, స్థూల ఆర్థిక అంశాలు కలిసిరావొచ్చు. 'పడినపుడల్లా కొనుగోలు చేయడం' మంచి పద్ధతి అవుతుంది. స్వల్పకాలంలో నిఫ్టీ లోహ సూచీ సానుకూలంగానే కనిపిస్తోంది. ఓవర్‌బాట్ పరిస్థితుల వల్ల తక్కువ శ్రేణిలో కదలికలుండొచ్చు.టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా షేరుకు కొంత విక్రయాల ఒత్తిడి ఉండొచ్చు. ఏజీఆర్ బకాయిల విషయంలో లభించిన ఊరట ప్రభావం పెద్దగా కనిపించకపోవచ్చు. రూ.6 లక్ష్యంతో ఈ షేరును విక్రయించొచ్చని ఓ బ్రోకరేజీ చెబుతోంది. భారతీ ఎయిర్‌టెల్‌కు రూ.2,140 వద్ద నిరోధం, రూ.2,000 వద్ద మద్దతు కనిపిస్తోంది.చమురు-గ్యాస్ కంపెనీల షేర్లు సమీప కాలంలో సానుకూల ధోరణిలో చలించొచ్చు. నిఫ్టీ ఆయిల్-గ్యాస్ సూచీకి 12,100-11,950 వద్ద మద్దతు, 12,600-12,700 వద్ద నిరోధం కనిపిస్తోంది. ఫలితాలకు ముందు యంత్రపరికరాల షేర్లు ఒక శ్రేణిలోనే చలించొచ్చు. ప్రధాన కంపెనీలన్నీ బలమైన ఆదాయ వృద్ధిని నమోదు చేయొచ్చు. అయితే ఆర్డర్ల రాక తగ్గడం, షేర్ల అధిక ధరల కారణంగా ఈ రంగ షేర్లకు విక్రయాల ఒత్తిడి ఏర్పడొచ్చు.వాహన కంపెనీల షేర్లు రాణించొచ్చు. రిటెయిల్ గిరాకీ కొనసాగుతుండడం, ఎగుమతులు బాగుండడం ఇందుకు నేపథ్యం. షేర్ల ధరలు అధికంగా ఉన్నా, ఫలితాలు బాగుంటాయన్న అంచనాల మధ్య కాస్త పెరగొచ్చనే భావిస్తున్నారు.కొంత స్తబ్దత తర్వాత విలువలు పుంజుకుంటుండడంతో, ఐటీ షేర్లు లాభాలు అందుకోవచ్చు. ఫెడ్ వడ్డీ రేటు కోతల అనంతరం క్లయింట్ల వ్యయాలు పెరగొచ్చన్న అంచనాలకు తోడు, ఏఐ ఆధారిత సేవలకు గిరాకీ పెరుగుతుండడం కలిసిరావొచ్చు. ఈ నెలలో సిమెంటు ధరలు పెరగొచ్చన్న అంచనాల మధ్య సిమెంటు రంగ షేర్లు మెరవవచ్చు. దక్షిణాది రాష్ట్రాల్లో 50 కిలోల బస్తా ధర రూ.20-30 వరకు పెరగొచ్చని హైదరాబాద్‌కు చెందిన ఒక సిమెంటు తయారీ కంపెనీ అంటోంది.ఎఫ్‌ఎమ్‌సీజీ కంపెనీల షేర్లు నష్టపోవచ్చు. ఈ సూచీ 54,000 - 57,500 స్థిరీకరణ శ్రేణిలో, దిగువ స్థాయి కంటే కిందకు రావడం ఇందుకు నేపథ్యం. సిగరెట్లపై ఎక్సైజ్ సుంకం విధించడంతో ఐటీసీ షేరు 2023 ఫిబ్రవరి తర్వాత అత్యంత కనిష్ఠ స్థాయి(రూ.350.05)కి చేరింది.ప్రభావం చూపే వార్తలు లేనందున ఔషధ కంపెనీల షేర్లు ఒక శ్రేణికి లోబడి ట్రేడవవచ్చు. త్రైమాసిక ఫలితాల కారణంగా రాబోయే వారాల్లో ఎంపిక చేసిన ఫార్మా షేర్లు కాస్త పెరగొచ్చు.

# జొమాటో సీఈఓ చెప్పేంది తప్పు..!




గిగ్‌వర్కర్లకు గౌరవమైన వేతనం, ప్రోత్సాహకాలు దక్కుతున్నాయని జొమాటో సీఈఓ దీపిందర్ గోయల్ చెప్పేది తప్పని గిగ్ వర్కర్ల యూనియన్లు ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీపిందర్ గోయల్ తన కంపెనీకి చెందిన తాత్కాలిక ఉపాధి విధానం 'గిగ్ మోడల్' ను సమర్థించుకుంటూ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ అసోసియేషన్ (డీజీపీడబ్ల్యూఏ) తప్పుబట్టింది. డెలవరీ కార్మికుల ప్రస్తుత పని పరిస్థితులు ఏమాత్రం గౌరవప్రదంగా లేవని ఆందోళన వ్యక్తం చేసింది. దీంతో భారతదేశంలో వేగంగా పెరుగుతోన్న క్విక్ కామర్స్, డెలివరీ కార్మికుల ప్రయోజనాలపై దీపిందర్ గోయల్, గిగ్‌వర్కర్ల యూనియన్ల మధ్య జరుగుతున్న చర్చ తీవ్ర వేడెక్కినట్లయ్యింది."జొమాటోలో 2025లో డెలివరీ పార్ట్‌నర్ సగటు వేతనం రూ.102గా ఉంది. 2024లో ఇది రూ.92గా నమోదయ్యింది. డెలివరీ భాగస్వాములు ఒకవేళ రోజుకు 10 గంటలు చొప్పున నెలలో 26 రోజులు పనిచేసినా ఒక్కో డెలివరీ ఏజెంట్ రూ.26,500 ఆర్జించొచ్చు. అందులోంచి పెట్రోల్, నిర్వహణ ఖర్చులు మినహాయించినా రూ.21,000 వస్తుంది. దీనికి టిప్ అదనం. ఫుల్ టైమ్ వర్క్‌కు ప్రత్యామ్నాయంగా గిగ్ వర్క్ మోడల్ రూపుదిద్దుకుంది. ఉద్యోగితో సమానంగా ప్రయోజనాలు, స్థిరమైన వేతనాలు కోరడం ఈ మోడల్‌కు ఏమాత్రం సరిపోదు." అని దీపిందర్ గోయల్ వ్యాఖ్యలు చేశారు.దీపిందర్‌కు యూనియన్ల కౌంటర్..దీపిందర్ గోయల్ వ్యాఖ్యలను గిగ్ వర్కర్ల యూనియన్ సవాల్ చేసింది. క్షత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందని డీజీపీడబ్ల్యూఏ తెలిపింది. "పెట్రోల్, వాహన నిర్వహణ ఖర్చులను తీసివేస్తే వాస్తవానికి గంటకు నికరంగా రూ.81 మాత్రమే వస్తుంది. దీని ప్రకారం.. నెలకు 26 రోజులు, రోజుకు 10 గంటల చొప్పున కష్టపడి పనిచేసే వ్యక్తికి సుమారు రూ.21,000 మాత్రమే లభిస్తుంది. డెలివరీ భాగస్వాములకు వేతనంతో కూడిన సెలవులు (పెయిడ్ లీవ్స్), సామాజిక భద్రత లేదా గ్యారెంటీ ఉన్న ప్రమాద బీమా లేవు. గోయల్ చెప్పిన అదనపు ఆదాయం చాలా పరిమితం. కేవలం 5 శాతం ఆర్డర్లకు మాత్రమే టిప్స్ వస్తున్నాయి." అని డీజీపీడబ్ల్యూఏ ఎత్తి చూపింది.డెలివరీ భాగస్వాములకు సామాజిక భద్రతతో పాటు ప్రోత్సాహకాలు కల్పించాలని, 10 నిమిషాల్లో డెలివరీ టార్గెట్ లాంటి పని ఒత్తిడిని తగ్గించాలనే డిమాండ్లతో ఇటీవల ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బెస్ట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్‌లు సమ్మె చేపట్టాయి. డిసెంబర్ 25న, 31న రెండు రోజుల పాటు దేశ వ్యాప్తంగా చేపట్టిన సమ్మె పిలుపునతో ఫుడ్ యాప్‌లకు ఝలక్ ఇచ్చిన విషయం తెలిసిందే. కొత్త సంవత్సరం ముందు రోజు భారీగా ఆర్డర్లు ఉండటంతో వ్యాపారంపై తీవ్ర ప్రభావం పడొచ్చనే భయంతో ఆయా యాజమాన్యాలు గిగ్‌వర్కర్లకు స్వల్ప ప్రోత్సాహకాలు పెంచి తాత్కాలికంగా బయటపడ్డాయి. తాజాగా గిగ్‌వర్కర్లు మళ్లీ ఆందోళనకు సంకేతాలు ఇవ్వడం విశేషం.

# ఐసీసీకి కొత్త తలనొప్పి.. టీ20 ప్రపంచకప్ షెడ్యూల్ మార్చాల్సిందేనా!



టీ20 ప్రపంచకప్ నిర్వహణకు సిద్ధమవుతున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి(×జజ)కి కొత్త తలనొప్పి మొదలైంది. ఫిబ్రవరి 7వ తేదీ నుంచి మెగా టోర్నీ ప్రారంభం కానుండగా.. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు బాంబ్ పేల్చింది. ఐపీఎల్ నుంచి పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను తొలగించడానికి ప్రతిచర్యగా, భారత్‌లో ప్రపంచకప్ ఆడమని బంగ్లా తేల్చి చెప్పేసింది. దాంతో.. ఇదివరకే ప్రకటించిన షెడ్యూల్‌ను మార్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. బంగ్లాదేశ్‌లో మైనార్టీలైన హిందువులపై హత్యాకాండ తదనంతర పరిణామాలు క్రికెట్‌పై పడ్డాయి. అల్లర్లతో అట్టుడుకుతున్న బంగ్లాతో దౌత్య సంబంధాలకు బ్రేక్ వేసిన భారత్.. క్రికెట్ సంబంధాల్ని కూడా కట్ చేసింది. హిందువుల హత్యలను నిరసిస్తూ ఐపీఎల్ నుంచి బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ (వీబర్ఘుటఅఓబతీ =వంష్ట్రఘ్మిఅ)ను తొలగించింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు వరల్డ్‌కప్ ఆడేందుకు తమ జట్టును ఇండియాకు పంపమని ఐసీసీకి ఈ-మెయిల్ చేసింది. ఆటగాళ్ల భద్రత దృష్ట్యా తమ టీమ్ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని కోరింది. దాంతో.. ఇప్పటికే షెడ్యూల్ వెలువరించి ప్రపంచకప్ నిర్వహణపై కసరత్తు చేస్తున్న ఐసీసీ ఆలోచనలో పడింది. బంగ్లా బోర్డు విజ్ఞప్తిని పరిశీలిస్తున్న జై షా నేతృత్వంలోని ఐసీసీ త్వరలోనే కొత్త షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశముంది. ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ఖండిస్తున్న భారత ప్రభుత్వం.. ఆ దేశంతో దౌత్య సంబంధాలకు బ్రేక్ వేసింది. అంతేకాదు కోల్‌కతా నైట్ రైడర్స్ ఇటీవలవేలంలో రూ.9.1 కోట్లు పలికిన బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను కొనడంపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో.. అతడిని స్క్వాడ్ నుంచి తప్పించాలని బీసీసీఐ ఆదేశించింది. జనవరి 4 ఆదివారం సమావేశమైన బోర్డు సభ్యులు ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్ నుంచి తప్పించిన బీసీసీఐని తప్పుపట్టారు. భద్రతా కారణాలతో భారత్‌కు తమ జట్టును పంపమని బోర్డు వెల్లడించింది. 'భద్రతా కారణాల రీత్యా మా జట్టును ప్రపంచకప్ కోసం భారత్‌కు పంపించడం సాధ్యం కాదు. బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నాం. బీసీసీఐ నిర్ణయానికి కౌంటర్‌గా మేము ఈ తీర్మానం చేశాం. మా జట్టు మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించండి' అని బంగ్లా క్రికెట్ బోర్డు ఆదివారం ఐసీసీకి పంపిన ఈ-మెయిల్‌లో తెలిపింది. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 7న ఈడెన్ గార్డెన్స్ మైదానంలో బంగ్లాదేశ్, వెస్టిండీస్ తలపడాలి. కానీ, బంగ్లా బోర్డు విన్నపం నేపథ్యంలో ఆ జట్టు మ్యాచ్‌లను శ్రీలంకలో నిర్వహించడంపై ఐసీసీ ఆలోచిస్తోంది. టీ20 ప్రపంచకప్ స్క్వాడ్ : లిటన్ కుమార్ దాస్(కెప్టెన్), మొహమ్మద్ సైఫ్ హొసేన్(వైస్ కెప్టెన్), తంజిద్ హసన్, పర్వేజ్ హొసేన్, తౌహిద్ హృదయ్, షమీమ్ హొసేన్, కాజీ నురుల్, మహేది హసన్, రిషద్ హొసేన్, నసుమ్ అహ్మద్, ముస్తాఫిజుర్ రెహ్మాన్, తంజిమ్ హసన్, తస్కిన్ అహ్మద్, షైఫుద్దీన్, షోరిఫుల్ ఇస్లాం.

## భారీ శతకంతో విరుచుకుపడిన రూట్.. ఆస్ట్రేలియాను ఆదుకున్న హెడ్..!



యాషెస్ సిరీస్‌లో చివరిదైన సిడ్నీ టెస్టులో ఆస్ట్రేలియా ధీటుగా బదులిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో జో రూట్(160) భారీ శతకంతో ఇంగ్లండ్ సవాల్ విసిరినా.. పేసర్ నెసెర్(4-60) విజృంభణతో ప్రత్యర్థిని నాలుగొందల లోపే కట్టడి చేసింది. అనంతరం ట్రావిస్ హెడ్(91 నాటౌట్) విధ్వంసక అర్ధశతకం బాదేయగా.. మార్నస్ లబూషేన్(48) క్రీజులో నిలబడ్డాడు. వీరిద్దరి జోరుతో పటిష్ట స్థితిలో నిలిచిన స్మిత్ సేన తొలి ఇన్నింగ్స్‌లో ఇంకా 218 పరుగులు వెనకబడి ఉంది సిడ్నీ టెస్టు రసవత్తరంగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ భారీ స్కోర్ చేయగా.. ఆస్ట్రేలియా కూడా తగ్గేదేలే అన్నట్టుగా ఆడుతోంది. ఓపెనర్ ట్రావిస్ హెడ్(91 నాటౌట్) మెరుపు అర్ధ శతకంతో ఆసీస్ పుంజుకుంది. రెండో రోజు ఆట ముగిసే సరికి 2 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది ఆతిథ్య జట్టు. అంతుకుముందు దాంతో.. ఓవర్‌నైట్ స్కోర్ 211-3తో రెండో రోజు ఇన్నింగ్స్ ఆరంభించిన పర్యాటక జట్టు 384కే ఆలౌటయ్యింది. మిడిలార్డర్ క్రీజులో పాతుకుపోవడంతో తొలిసారి ఆలౌట్ గండం తప్పించుకున్న ఇంగ్లండ్‌ను నెసెర్(4-60) దెబ్బకొట్టాడు. జో రూట్(160), వికెట్ కీపర్ జేమీ స్మిత్(46)ల మెరుపులతో నాలుగొందల దిశగా వెళ్తున్న పర్యాటక జట్టు తోకను ఈ ఆసీస్ పేసర్ కత్తిరించాడు. ఇద్దరు నిలబడడంతో.. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ సిడ్నీ టెస్టులో తొలి రోజు ఆధిపత్యం చెలాయించింది. వెలుతురు లేమి కారణంగా 45 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైనా పర్యాటక జట్టు మిడిలార్డర్ బ్యాటర్లు క్రీజునంటుకుపోయారు. ఓపెనర్లు బెన్ డకెట్(27), జాక్ క్రాలే(16)లు శుభారంభమిచ్చినా స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. కాసేపటికే బొలాండ్ ఓవర్లో జాకబ్ బెథెల్(10) ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన జో రూట్, హ్యారీ బ్రూక్ ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వలేదు.

# స్పోర్ట్స్

## ముంబై కెప్టెన్‌గా అయ్యర్.. పునరాగమనం అదిరేనా..!



స్వదేశంలో న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు వైస్ కెప్టెన్‌గా ఎంపికైన శ్రేయాస్ అయ్యర్ మైదానంలోకి దిగనున్నాడు. అది కూడా కెప్టెన్‌గా. ఈమధ్యే కోలుకున్న అయ్యర్ దేశవాళీ క్రికెట్‌లో ఢిల్లీ సారథిగా ఎంపికయ్యా. వన్డే ఫార్మాట్లో జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో తదుపరి మ్యాచ్‌లకు అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని సోమవారం ముంబై క్రికెట్ సంఘం తెలిపింది. సిడ్నీ వన్డేలో గాయంతో ఆటకు దూరమైన శ్రేయాస్ అయ్యర్.. సర్జరీ తర్వాత వేగంగా కోలుకున్నాడు. ఇటీవలే బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ చాటుకొని న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు ఎంపికయ్యాడు. అయితే.. బీసీసీఐ నిబంధనల ప్రకారం ఫిట్‌నెస్ చాటుకుంటేనే జాతీయ జట్టుకు ఆడే అవకాశం ఉన్నందున దేశవాళీ టోర్నీలో ఆడేందుకు సిద్ధమయ్యాడీ స్టార్ బ్యాటర్. సీనియర్ ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ ంగాయపడడంతో అయ్యర్‌కు ముంబై సారథ్యం అప్పగించింది. 'ముంబై సీనియర్ టీమ్ కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్ నియమితులయ్యాడనే విషయాన్ని మీతో పంచుకోవడం సంతోషంగా ఉంది. విజయ్ హజారే ట్రోఫీలో ముంబై అయ్యర్ సారథ్యంలోనే తదుపరి మ్యాచ్‌లు ఆడనుంది' అని ఎంసీఏ ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రస్తుతం గ్రూప్ సీ నుంచి రెండో స్థానంలో ఉంది. జనవరి 6న హిమాచల్ ప్రదేశ్‌తో, జనవరి 8న పంజాబ్‌తో ముంబై తలపడనుంది.

### జనవరి 11న బరోడాలో

రెండేళ్ల క్రితం వన్డే ప్రపంచకప్‌లో, ఆపై ఛాంపియన్స్ ట్రోఫీలో మెరిసిన అయ్యర్‌ను న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు తీసుకున్నారు. రెగ్యులర్ సారథి శుభ్‌మన్ గిల్ (రాష్ట్రబఎిఘఅ +అశ్రీశ్రీ) నేతృత్వంలో 15 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేయగా.. అయ్యర్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. జనవరి 11న బరోడాలో జరుగనున్న తొలి వన్డేలో కివీస్‌తో టీమిండియా తలపడనుంది. భారత వన్డే స్క్వాడ్ : శుభ్‌మన్ గిల్(కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, యశస్వీ జైస్వాల్, కేఎల్ రాహుల్(వికెట్ కీపర్), శ్రేయాస్ అయ్యర్(వైస్ కెప్టెన్), రిషభ్ పంత్(వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, సిరాజ్, హర్షిత్ రానా, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, నితీశ్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్.




# లైన్ క్లియర్.. సాయిపల్లవి హిందీ డెబ్యూ సినిమా రిలీజ్‌పై

మూవీ లవర్స్‌కు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ సాయిపల్లవి. ఈ కోలీవుడ్ అమ్మడు తెలుగు, తమిళం, మలయాళంలో సినిమాలు చేస్తూ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. ఇక హిందీలో కూడా సాయిపల్లవి తన లక్‌ను పరీక్షించుకునేందుకు రెడీ అవుతుందని తెలిసిందే. బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ నటిస్తోన్న మేరే రహో సినిమాలో సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని 2025లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేశారు మేకర్స్. తాజాగా కొత్త రిలీజ్ డేట్ ఫైనల్ చేశారన్న వార్త బయటకు వచ్చింది. లేటెస్ట్ టాక్ ప్రకారం మేరే రహో చిత్రాన్ని జులై రెండో వారంలో విడుదల చేయబోతున్నారట. రిలీజ్ డేట్‌పై మేకర్స్ రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారని బీటౌన్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. మొత్తానికి సాయిపల్లవి ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న హిందీ డెబ్యూ మూవీ ఈ ఏడాది సెకండాఫ్‌లో థియేటర్లలో సందడి చేయనుందన్న వార్తను ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు అభిమానులు, మూవీ లవర్స్. 2025లో తండేల్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది సాయిపల్లవి. ఈ భామ ఖాతాలో మరో మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ రామాయణ ఉంది. ఈ మూవీ రెండు పార్టులుగా రాబోతుంది. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న మేరే రహో మూవీని సునీల్ పాండే డైరెక్ట్ చేస్తున్నాడు.



# మృణాళ్ ఠాకూర్‌ను హైదరాబాద్ పిలుస్తోందట.. ఇంతకీ ఎందుకో తెలుసా మరి?

టాలీవుడ్ హీరో అడివిశేష్ మృణాల్ ఠాకూర్ కాంబినేషన్‌లో డెకాయిట్ సినిమా వస్తోన్న విషయం తెలిసిందే. షనీల్ డియో కథనందిస్తూ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా.. మేకర్స్ ఫైనల్‌గా ఈ మూవీని ఉగాది కానుకగా మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ గురించి క్రేజీ అప్‌డేట్ షేర్ చేసింది మృణాళ్ ఠాకూర్. డెకాయిట్ ఫైనల్ షెడ్యూల్ పూర్తి చేసేందుకు తాను హైదరాబాద్‌కు వెళ్తున్నానని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఈ పోర్షన్‌తో మృణాళ్ ఠాకూర్‌కు సంబంధించిన పార్ట్ పూర్తి కానుంది. హైదరాబాద్ పిలుస్తోంది.. అంటూ మృణాళ్ ఠాకూర్ షేర్ చేసిన ఈ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నాడు. ప్రకాశ్ రాజ్ మరో కీలక పాత్రలో నటిస్తున్నాడు. డెకాయిట్ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తుండగా.. సునీల్ నారంగ్ కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు. అడివిశేష్ హీరోగా నటించిన క్షణం, గూఢచారి చిత్రాలకు సినిమాటోగ్రఫర్‌గా పనిచేసిన షనీల్ డియో ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఇప్పటికే విడుదల చేసిన టీజర్‌పై సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తోంది.



# 'వారణాసి' రిలీజ్ డేట్ ఫిక్స్ .. అంతర్జాతీయ వేదికపై అరుదైన రికార్డు దిశగా..

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ అడ్వెంచర్ ప్రాజెక్ట్ 'వారణాసి' పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. భారతీయ సినిమా స్థాయిని మరో మెట్టు ఎక్కించబోయే ఈ చిత్రం కోసం సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే 2027 సమ్మర్‌లో విడుదల చేస్తామని రాజమౌళి అధికారికంగా వెల్లడించగా, తాజాగా ఈ మూవీకి సంబంధించి రిలీజ్ డేట్ దాదాపుగా ఖరారైనట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం 2027 ఏప్రిల్ 9న 'వారణాసి'ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. శ్రీరామ నవమి రోజున ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తే సినిమాకు మరింత ఆధ్యాత్మిక బలం చేకూరుతుందని టీమ్ భావిస్తున్నట్టు సమాచారం. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సినీ వర్గాలు అంటున్నాయి. 'రామాయణం'లోని ఒక కీలక ఘట్టాన్ని ఆధారంగా చేసుకొని ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు రాజమౌళి ఇప్పటికే వెల్లడించారు. ఇందులో మహేష్ బాబు శ్రీరాముడిగా కనిపించనున్నారని ప్రచారం సాగుతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌లో ఆయన 'రుద్ర' అవతారంలో దర్శనమివ్వగా, ఆ లుక్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టించింది. కేవలం టైటిల్ గ్లింప్స్‌తోనే అంతర్జాతీయ స్థాయిలో సినిమాపై ఆసక్తి పెరిగింది. ఈ ప్రాజెక్ట్ ప్రమోషన్లు రిలీజ్‌కు రెండేళ్ల ముందే ఇంటర్నేషనల్ లెవల్‌లో మొదలయ్యాయి. తాజాగా ఈ మూవీ అనౌన్స్‌మెంట్ టీజర్‌ను పారిస్‌లోని ప్రతిష్టాత్మక 'లే గ్రాండ్ రెక్స్' థియేటర్‌లో ప్రదర్శించనున్నారు. జనవరి 5న రాత్రి 9 గంటలకు బిగ్ స్క్రీన్‌పై ప్రత్యేక ఫార్మాట్‌లో గ్లింప్స్ ప్రదర్శన జరగనుంది. ఈ ఘనత సాధించిన తొలి ఇండియన్ సినిమాగా 'వారణాసి' చరిత్రలో నిలవనుంది. గ్లింప్స్‌ను బట్టి చూస్తే, సృష్టి ఆవిర్భావం నుంచి వారణాసి నగర ప్రాధాన్యత, యజ్ఞ యాగాలు, గుహలు, మణికర్ణిక ఘాట్, చినమస్తా దేవి ఉగ్రరూపం వంటి అంశాలు కథలో కీలకంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో రామాయణంలోని ఒక ప్రధాన ఘట్టాన్ని కథలో మిళితం చేస్తూ, మహేష్ బాబు రుద్రుడిగా, రాముడిగా ద్వంద్వ అవతారాల్లో కనిపించనున్నారన్న టాక్ వినిపిస్తోంది.

# ఎమ్మెల్యే మేఘారెడ్డి జన్మదిన సందర్భంగా "మేఘా" రక్తదాన శిబిరం...

## ఘనంగా వనపర్తి ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు









**వనపర్తి జిల్లా ప్రతినిధి జనవరి 8 (స్పైన్యూస్ ):** వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి జన్మదినం సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో రికార్డ్ స్థాయిలో రక్త సేకరణ జరిగింది.రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరం యువశక్తి ఫౌండేషన్ సమన్వయం ద్వారా 482 యూనిట్ల రక్తాన్ని స్వీకరించినట్టు అధికారులు పేర్కొన్నారు.గతంలోనూ ఎమ్మెల్యే మేఘా రెడ్డి పుట్టినరోజు సందర్భంగానే రికార్డ్ స్టైల్ రక్త చేతన జరిగిందని మళ్లీ నేడు వనపర్తి నియోజకవర్గంలో అదే రికార్డు స్థాయిలో 482 జరగడం హర్షించదగ్గ విషయమని వారన్నారు.వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పుట్టినరోజు వేడుకలను వనపర్తి నియోజకవర్గం మొత్తంలో ఘనంగా నిర్వహించారు. మొదటగా ఖిల్లా ఘణపురం మండలం గట్టు కాడిపల్లి శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఖిల్లా ఘనపురం మండల కేంద్రంలో మండల నాయకులు ఏర్పాటు చేసిన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ఆయన కుటుంబ సమేతంగా కేకునుకోసి నాయకులకు కార్యకర్తలకు పంచిపెట్టారు.ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం ఖిల్లా ఘణపురం మండలం మానాజీపేట గ్రామ స్టేజీ వద్ద గ్రామస్తులు ఎమ్మెల్యే కి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు కేకుకోసి శుభాకాంక్షలు తెలియజేశారు.వృద్ధులకు అన్నదాన పంపిణీ కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే.వనపర్తి మండలం చిట్యాల గ్రామ శివారులోని చేయూత అనాథాశ్రమం వారు వృద్ధులకు భోజన పంపి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఇందుకుగాను ఎమ్మెల్యే వృద్ధులకు భోజనాన్ని సరఫరా చేసేందుకు కావలసిన వాహనాన్ని గతంలోనే అనాదశ్రమానికి వితరణ చేశారు.ఈ క్రమంలో ఎమ్మెల్యే జన్మదిన సందర్భంగా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో గురువారం అనాధ వృద్ధులకు భోజనం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంత రం పామిరెడ్డిపల్లి పాఠశాలలో విద్యార్థులకు మూర్పుష్యకాలను పెన్నులను పంపిణీ చేశారు.అనంతరం వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతుల మధ్యన మార్కెట్ యార్డ్ కార్మికుల మధ్యన ఏర్పాటు చేసిన పుట్టినరోజు వేడుకలకు ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్మికులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థుల మధ్యన పుట్టినరోజులు వేడుకలు వనపర్తి పట్టణంలోని మరికుంట లో గల బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా పాల్గొన్నారుఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే కేకునుకోసి శుభాకాంక్షలు తెలియజేశారు.విద్యార్థులకు తక్షణ అవసరార్థం రెండు లక్షల రూపాయల విలువగల డిజిటల్ బోర్డును తన సొంత నిధులతో ఏర్పాటు చేయిస్తానని చెప్పారు.గిరిజన గురుకుల పాఠశాల అభివృద్ధి అభివృద్ధి కోసం మూడు కోట్ల రూపాయలను మంజూరు చేయించామని చెప్పారు.పాఠశాల అభివృద్ధి కోసం పూర్తిస్థాయిలో దృశ్య సారిష్టమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అనంతరం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మేఘా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు. ప్రముఖులు అధికారులు యువకులు, మహిళలు ఎమ్మెల్యే కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, వనపర్తి పట్టణ మున్సిపల్ మాజీ చైర్మన్లు వైస్ చైర్మన్లు మాజీ కౌన్సిలర్లు పట్టణ నాయకులు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారూ.

# ముడా ద్వారా నగరంలో శాశ్వత అభివృద్ధి...

**: ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



**మహబూబ్‌నగర్, జనవరి 8(స్పైన్యూస్)** అభివృద్ధికి దిశానిర్దేశం చేసే కీలక ఘట్టంగా ముడా (మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథరిటీ) లోగోను గౌరవ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి , పరిగి ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి గమాట్లాడుతూ, ఈ లోగో కేవలం ఒక గుర్తు మాత్రమే కాకుండా, ప్రణాళికాబద్ధమైన పట్టణ విస్తరణ, ఆధునిక మౌలిక వసతులు, పారదర్శక పాలన, ప్రజల అవసరాలకు అనుగుణమైన అభివృద్ధి అనే లక్ష్యాలకు ప్రతీకగా నిలుస్తుందని ఆయన తెలిపారు. ముడా ద్వారా మహబూబ్‌నగర్ నగరాన్ని శాశ్వత అభివృద్ధి మార్గంలో నడిపించాలనే ప్రభుత్వ సంకల్పం ఈ ఆవిష్కరణలో ప్రతిఫలించిందన్నారు. ఈ కార్యక్రమంలో , జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేవరకద్ర లో రైల్వే లిమిటెడ్ హైట్ సబ్ వే మంజూరు...



**సికింద్రాబాద్, జనవరి 8(స్పైన్యూస్):**రైల్ నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో భేటీ అయిన మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ. మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ కృషి తో దేవరకద్ర లో లిమిటెడ్ హైట్ సబ్ వే శాంక్షన్ అయ్యింది.. ఫిబ్రవరి చివరి వారంలో టెండర్లను ఆహ్వానించనున్నారు. టీడీ గుట్టలో రోడ్డు ఓవర్ బ్రిడ్జి కూడా శాంక్షన్ అయ్యింది, నిర్మాణ పనులకు ఏప్రిల్ లో టెండర్లను ఆహ్వానించనున్నారు.మహబూబ్ నగర్ పార్లమెంట్ పరిధిలో పలు ప్రాంతాలలో రైల్వే ట్రాక్ దాటేందుకు ప్రజలు,వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆయా ప్రాంతాల్లో రోడ్డు అండర్ బ్రిడ్జి, రోడ్డు ఓవర్ బ్రిడ్జి లతో పాటు లిమిటెడ్ హైట్ సబ్ వే ల నిర్మాణం కొరకు గతంలో అందజేసిన వినతిపత్రాల సంబంధించిన పురోగతి పై రైల్వే ఉన్నతాధికారులతో ఎంపీ డీకే అరుణ సమీక్ష నిర్వహించారు. సమీక్షలో తిమ్మసానిపల్లి, బోయపల్లి, వీరన్నపేట లోని రైల్వే ట్రాక్ ల పై రోడ్డు ఓవర్ బ్రిడ్జి, మోతి నగర్ లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలకు సంబంధించి ఫిజబులిటీ రిపోర్ట్ పూర్తయిందని,రైల్వే బోర్డుకు ప్రతిపాదన పంపడం జరిగిందని.. అనంతరం మార్చ్, ఏప్రిల్ లో ఆ పనులకు కూడా శాంక్షన్ అవనున్నట్లు ఎంపీ డీకే అరుణ గారికి రైల్వే జనరల్ మేనేజర్ తెలిపారు. ప్రధానంగా ఆయా గ్రామాల ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మిగతా వాటికి త్వరితగతిన శాంక్షన్ వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీ డీకే అరుణ గారు సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ని కోరారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల భాగస్వామ్యం అవసరం

**సంగం వెంకట పుల్లయ్య,**
**మోటార్ వాహనాల తనిఖీ అధికారి**



**భద్రాచలం జనవరి 8( స్పై న్యూస్):**రోడ్డు ప్రమాదాలను సమర్థవంతంగా అరికట్టాలంటే రవాణా శాఖ అధికారుల చర్యలతో పాటు ప్రజల బాధ్యతాయుతమైన భాగస్వామ్యం అనివార్యమని భద్రాచలం మోటార్ వాహనాల తనిఖీ అధికారి సంగం వెంకట పుల్లయ్య అన్నారు.జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు ఉ 2026లో భాగంగా,భద్రాచలం రవాణా శాఖ కార్యాలయంలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కార్యాలయానికి వివిధ సేవల నిమిత్తం వచ్చిన దరఖాస్తుదారులు, వాహనదారులు సాధారణ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ వినియోగం చేయాలని సూచించారు.అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయని స్పష్టం చేశారు.ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు సహాయం చేసే గుడ్ సమారిటన్ లను గౌరవించి, ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తేనే ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు.ఈ అవగాహన కార్యక్రమం ప్రజల్లో రోడ్డు భద్రతపై జాగ్రత్తను పెంపొందించడంలో కీలకంగా నిలిచిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ శివయ్య, సిబ్బంది భీముడు తదితరులు పాల్గొన్నారు.పొల్యూషన్ సర్టిఫికెట్లు, రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్లు, బ్లాక్ ఫిల్మ్‌పై స్పెషల్ డ్రైవ్ భద్రాచలంలోని కూనవరం రోడ్డులో వాహనాల తనిఖీ కార్యక్రమం (స్పెషల్ డ్రైవ్) నిర్వహించడం జరిగింది.ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఒక వాహనాన్ని సీజ్ చేయడం జరిగింది.వాహనాల రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్లు మోటార్ వాహనాల చట్టం (మోటార్ వెహికల్ యాక్ట్ ) ప్రకారం తప్పనిసరిగా ఉండాలని, అలాగే పొల్యూషన్ సర్టిఫికెట్ లేకపోవడం, బ్లాక్ ఫిల్మ్ వినియోగం వంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎం.వి.ఐ. సంగం వెంకట పుల్లయ్య హెచ్చరించారు.

## కుక్కలు కరిచే మూడ్‌లో ఉన్నాయని ముందే ఎవరూ ఊహించలేరు

వీధి కుక్కల వివాదంపై చేపట్టిన విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కుక్కలు కరవబోతున్నాయా లేదా అనే విషయాన్నిఅవి దగ్గరకు వచ్చేంతవరకు ఎవరూ ఊహించలేరని పేర్కొంది. ఈ సమస్యకు చికిత్స కంటే నివారణే ముఖ్యమన్న అభిప్రాయం వ్యక్తం చేసింది. వీధి కుక్కలను తరలించే అంశంపై అత్యున్నత ధర్మాసనం సుమోటోగా విచారణ చేపట్టింది. అటు విద్యాసంస్థలు, ఆస్పత్రులు, రైల్వేస్టేషన్లలో కుక్కకాటు కేసులు పెరుగుతున్న నేపథ్యంలో గతేడాది నవంబర్ 7న కీలక ఆదేశాలు జారీచేసింది. బహిరంగ ప్రదేశాల నుంచి వీధి కుక్కలను షెల్టర్లకు తరలించి, వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేయాలని ఆదేశించింది. ఏ కారణం చేతనైనా మళ్లీ వాటిని పట్టుకున్న ప్రదేశంలోనే వదిలేయొద్దని స్పష్టంచేసింది. ఈ ప్రాంగణాల్లో కుక్కలు లేవని నిర్ధరించుకునేందుకు క్రమంతప్పకుండా తనిఖీలు చేయాలని తన ఆదేశాల్లో పేర్కొంది. జాతీయ రహదారులపై తిరుగుతున్న పశువులను కూడా షెల్టర్లకు తరలించాలని సుప్రీంకోర్టు సూచించింది.ల

## కాంగ్రెస్ తో బీజేపీ పొత్తు.. 'మహా' నేతలపై సీఎం ఫడ్నవిస్ ఆగ్రహం



మహారాష్ట్రలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న వేళ రాజకీయంగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్నిచోట్ల ప్రతిపక్షాలైన బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎం పొత్తు పెట్టుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహారాష్ట్రలోని అంబర్ నాథ్ మున్సిపాలిటీలో అధికారం కోసం బీజేపీ, కాంగ్రెస్ కలిసి పని చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక్కడ బీజేపీ, అటు కాంగ్రెస్ తోపాటు, ఎన్సీపీతో కలిసి అంబర్ నాథ్ వికాస్ అఘాడి పేరుతో ఒక కూటమిగా ఏర్పడ్డట్లు తెలుస్తోంది. దీని ద్వారా శివసేనకు చెక్ పెట్టేందుకు ఆయా పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. అలాగే అకోలా జిల్లాలోని అకోటా మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ, ఎంఐఎం పొత్తు పెట్టుకున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. దీంతో ఇలా రెండు చోట్ల బీజేపీ.. అటు కాంగ్రెస్, ఇటు ఎంఐంతో పొత్తు పెట్టుకోవడంపై శివసేన వంటి పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. మున్సిపల్ సీట్లు దక్కించుకునేందుకు స్థానికంగా ప్రత్యర్థి పార్టీలతో బీజేపీ పొత్తు పెట్టుకోవడంపై మహాయుతి కూటమి నేత, రాష్ట్ర సీఎం ఫడ్నవిస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా, పార్టీ నిబంధనలకు విరుద్ధంగా ఇలా పొత్తులు పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంపై పూర్తి వివరాలు సేకరించేందుకు పార్టీ నేతలకు ఆదేశాలిచ్చామన్నారు. 60 సీట్లున్న అంబర్ నాథ్ లో బీజేపీ-కాంగ్రెస్-ఎన్సీపీ కూటమికివ 31 సీట్లు ఉండగా, అత్యధిక స్థానాలు (27) ఉన్న శివసేనకు అధికారం దూరమవుతుంది. దీంతో బీజేపీ తరఫున తేజశ్రీ కౌన్సిల్ ప్రెసిడెంట్ గా ఎన్నికయ్యారు. ఈ పరిణామంపై ఉద్ధవ్ ఆధ్వర్యంలోని శివసేన ఆగ్రహం వ్యక్తం చేసింది. కూటమి పొత్తు ధర్మాన్ని బీజేపీ విస్మరించి, అనైతిక చర్యలకు పాల్పడుతోందని శివసేన విమర్శించింది. మరోవైపు ఈ ప్రచారాన్ని కాంగ్రెస్ నేతలు కొట్టిపారేశారు. తమ పార్టీ కూటమిలో లేదని కాంగ్రెస్ నేతలు అంటున్నారు.

## నెతన్యాహుకు ప్రధాని మోదీ ఫోన్



ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహుతో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ఈ క్రమంలో నెతన్యాహు, ఇజ్రాయెల్ దేశ ప్రజలకు ప్రధాని మోదీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి ఇద్దరు నాయకులు కూడా తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. "నా స్నేహితుడు, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడాను. ఆయనకు, ఇజ్రాయెల్ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం సంతోషంగా ఉంది. రాబోయే కాలంలో భారత్-ఇజ్రాయెల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం గురించి మేము చర్చించాం. ప్రాంతీయ పరిస్థితులపై పరస్పరం అభిప్రాయాలను పంచుకున్నాం. ఉగ్రవాదాన్ని మరింత దృఢ సంకల్పంతో ఎదుర్కోవాలనే మా ఉమ్మడి సంకల్పాన్ని పునరుద్ఘాటించాం." అని మోదీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

## ఎక్కడో కూర్చొని... ఉచిత సలహాలు ఇస్తుంటారు



పాకిస్థాన్ ఉగ్ర దాడులకు ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో పశ్చిమ దేశాలు కపటత్వం ప్రదర్శించడంపై విదేశాంగ మంత్రి జై శంకర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు తమకు వేల మైళ్ల దూరంలో ఉన్న ఆ దేశాలు ఉద్రిక్తతల సమయంలో ఆందోళన చెందినట్లు చెప్పాయని.. కానీ అవేవీ తమ సొంత ప్రాంతంలో జరుగుతున్న వాటిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. లక్సెంబర్గ్‌లోని భారత కమ్యూనిటీ సభ్యులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సాయం చేయాలనుకునే వారితో కలిసి పని చేసేందుకు భారత్ సిద్ధంగా ఉంటుందని జైశంకర్ పేర్కొన్నారు. అదే.. పాకిస్థాన్‌లా ప్రవర్తిస్తే మాత్రం వాటికి అలాగే సమాధానం చెబుతామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో జరిగే పరిణామాలు దేనిని ఏమేరకు ప్రభావితం చేస్తాయో చెప్పడం కష్టమన్నారు. ఆలోచన లేకుండా ఎక్కడో దూరంగా కూర్చొన్నవారు.. ఉచిత సలహాలు ఇస్తున్నారని, అవి కొన్నిసార్లు స్వార్థంగా, నిర్లక్ష్యంగా ఉంటున్నాయన్నారు. ప్రస్తుతం చాలా దేశాలు తమ స్వార్థం కోసం మాత్రమే పని చేస్తున్నాయన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎలా వ్యవహరించాలనే దానిపై పలు దేశాలు భారత్‌కు సలహాలు ఇచ్చాయన్నారు. కానీ అవేవీ పట్టించుకోకుండా దేశ భద్రత కోసం భారత్ ముందుకుసాగిందన్నారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137